

సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★




జపాన్ నుండి తిరిగి వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డికి బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టు వద్ద స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు


సంపుటి 08, సంచిక: 144 | గురువారం | 24-04-2025 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# భారత్ వీడండి



## పర్యాటకులతో పాటు ప్రత్యేక వీసాదారులూ 48 గంటల్లో వెళ్లిపోవాలి

- పాక్ పౌరులను భారత్‌లోకి అనుమతించేది లేదు
- తక్షణం అటారీ–వాఘా చెక్‌పోస్టు నిలిపివేత

## సింధూ జలాల ఒప్పందం, ప్రత్యేక వీసాలు నిలిపివేత

- కేబినెట్ భద్రతా కమిటీ భేటీ నిర్ణయాలు

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని భారత్ అత్యంత తీవ్రంగా పరిగణించింది. పహల్గామ్ దాడి నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ(సిసిఎస్) భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పహల్గామ్ ఉగ్రదాడి వెనుక పాక్ హస్తం ఉందని పేర్కొన్న కేంద్రం.. ఆ దేశ పర్యటకులు భారత్‌ను వీడాలని తేల్చి చెప్పింది. పాకిస్థాన్ పర్యటకులతో పాటు ప్రత్యేక వీసాదారులు 48 గంటల్లో భారత్‌ను వీడాలని ఆదేశించింది. ఈ మేరకు కేబినెట్ భద్రతా కమిటీ భేటీలో చర్చించిన అంశాల్ని భారత విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వెల్లడించారు. పాక్ పౌరులను భారత్‌లోకి అనుమతించేది లేదని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. రాయబార కార్యాలయ సిబ్బందిని 50 నుంచి 30కి తగ్గించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. అటు పాక్ హైకమిషనర్‌ను సైతం దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు. అటారీ వాఘా చెక్ పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్లు చెప్పిన కేంద్రం.. సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని నిర్ణయించిందన్నారు. ప్రత్యేక వీసాలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే సరిహద్దు దాటిన వారు మే 1వ తేదీలోగా వెళ్లిపోవాలని మిస్త్రీ తెలిపారు. ఇదిలా ఉండగా ఉగ్రదాడి నేపథ్యంలో గురువారం అఖిలపక్ష సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశముంది.



## ఉగ్రదాడి అనుమానితుల రేఖా చిత్రాలు విడుదల

మృతులకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నివాళి


అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడిన ప్రతిపక్ష నేతలు ఖర్గే, రాహుల్‌గాంధీ



**శ్రీనగర్/న్యూఢిల్లీ :** దక్షిణ కశ్మీరు పహల్గామ్ సమీపం బైసారన్‌లో పర్యాటకులపై కాల్పులు జరిపిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదుల రేఖా చిత్రాలను కేంద్ర భద్రతా ఏజన్సీలు బుధవారంనాడు విడుదల చేశాయి. పెన్సిల్‌తో గీసిన ఈ రేఖాచిత్రాల్లో వీరంతా యువకులుగా కనిపిస్తున్నారు. వీరంతా భారత భద్రతా దళాల దుస్తుల్లో వచ్చి పర్యాటకులను వంచించారు. ప్రధానంగా పురుషులనే లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. స్త్రీలను వదిలిపెట్టారు. ఈ ముగ్గురు యువ ఉగ్రవాదులే ఘటనాస్థలంలో ప్రధానంగా కాల్పులకు పాల్పడ్డారు. ఉగ్రవాదులను అసిఫ్ ఫౌజీ, సులేమన్ షా, అబూతల్హాగా గుర్తించారు. ఐతే వీరిని వరుసగా మూసా, యూనుస్, ఆసిఫ్ అనే కోడ్ నేమ్స్‌తో పిలుస్తున్నారు. పూంఛ్‌లో జరిగిన ఉగ్రవాద దాడులతో వారికి సంబంధాలు ఉన్నాయి. దాడిలో గాయపడిన, తప్పించుకుని సజీవులుగా ఉన్న బాధితుల సహాయంతో ఈ పెన్సిల్ రేఖాచిత్రాలను తయారు చేశారు. ఈ ముగ్గురు ఉగ్రవాదులూ గెడ్డాలతో ఉన్నారు. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే నిషేధిత లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ పేరు మరుగుపరచి ప్రపంచాన్ని మభ్యపెట్టేందుకు దాని నీడగా కొత్త రూపంలో ''ద రెసిస్టెన్స్ ఫ్రంట్'' (టిఆర్‌ఎఫ్) ఉగ్రవాద సంస్థ ఆవిర్భవించింది. జమ్మూ కశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చిన 370వ అధికరణను రద్దు చేసిన తర్వాత ఈ టిఆర్‌ఎఫ్ సంస్థ ఏర్పడింది. లష్కరే తోయిబాలో ఉన్న ఉగ్రవాదులే ఈ సంస్థలోకి వచ్చారనీ, ఈ సంస్థ ఆవిర్భావం వెనుక తహవ్వుర్ రాణా (ముంబై దాడుల సూత్రధారి)వంటి ఉగ్రవాదులను పెంచి పోషించిన పాకిస్థాన్ ప్రధాన గూఢచారిసంస్థ ఐఎస్‌ఐ ఉందనేది భారత భద్రతాసంస్థల సమాచారం. మంగళవారంనాడు ఉగ్రవాదుల దాడి వార్త సర్వత్రా వ్యాపించిన తర్వాత ఈ దాడికి తామే కారణమని టి.ఆర్.ఎఫ్ తనకుతానుగా ప్రకటించుకుంది. సౌదీఅరేబియా పర్యటనలో ఉన్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కశ్మీరులో ఉగ్రవాద చర్య అనంతరం తన పర్యటన కుదించుకుని బుధవారం నాడు భారత్ చేరుకున్నారు. ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన వెంటనే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్, ఇతర ఉన్నతస్థాయీ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అనంతరం సాయంత్రం సిసిఎస్ (కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ) సమావేశం జరిపి జాతీయ భద్రతపై చర్చ జరిపారు. ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సిసిఎస్ సమావేశంలో హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశీ వ్యవహారాలమంత్రి ఎస్.జైశంకర్ పాల్గొన్నారు. బైసారన్‌లో 26 మంది పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదుల దుశ్చర్య ఘటన పూర్వపరాలను అధికారులు ప్రధానమంత్రికి వివరించారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ కూడా తన అమెరికా పర్యటనను కుదించుకుని హుటాహుటిన ఢిల్లీకి చేరుకున్నారు. జాతీయ భద్రతకు సంబంధించి ప్రధానమంత్రి నాయకత్వాన గల ఐదుగురు సభ్యుల మంత్రివర్గ కమిటీ (సిసిఎస్)లో నిర్మలాసీతారామన్ కూడా సభ్యురాలు. ప్రయాణమార్గంలో ఉన్నందువల్ల బుధవారం సాయంత్రం జరిగిన సిసిఎస్ సమావేశంలో ఆమె పాల్గొనలేకపోయారు. అజిత్ దోవల్‌తోపాటు మంత్రివర్గ కార్యదర్శి టి.వి.సోమనాథన్, రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ, ప్రధానమంత్రికి ఉన్న ఇద్దరు ముఖ్యకార్యదర్శులు పి.కె.మిశ్రా, శక్తికాంతదాస్, ఇతర సీనియర్ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా త్రివిధ దళాధిపతులతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తరువాయి 2లో

## భారత్ పక్షాన నిలబడతాం

- ఉగ్రవాదంపై ప్రపంచవ్యాప్తంగా జరిగే పోరాటంలో అండగా ఉంటాం
- ఉగ్రవాద చర్యకు ఐక్యరాజ్యసమితి, అమెరికా, రష్యా,చైనా, పాకిస్థాన్ సహా పలు దేశాల ఖండన
- మృతుల కుటుంబాలకు సంతాపం



**న్యూయార్క్ :** దక్షిణ కశ్మీరు పహల్గామ్ సమీపం బైసారన్ ప్రకృతి ప్రదేశంలో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిగిన లష్కరే తోయిబా ఉగ్రవాద అనుబంధ సంస్థ దుశ్చర్యను ఐక్యరాజ్య సమితి సహా పలు దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇద్దరు విదేశీయులతో సహా 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చిచంపడాన్ని దారుణ దుశ్చర్యగా ఐక్యరాజ్యసమితిఇ ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. భారత్ పక్షాన నిలబడతామని, భారత్‌కు పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని ఆయన ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు తరువాయి 2లో

## దేశ ఐక్యత, సమగ్రతపై ప్రత్యక్ష దాడి

- ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు కేంద్రానికి సహకరిస్తాం
- రాజకీయాలకు ఇది సమయం కాదు
- పహల్గామ్ ఉగ్రదాడిలో నేరస్థులను న్యాయస్థానంలో నిలబెట్టాలి
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ : జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మరోసారి స్పందించారు. ఈ ఉగ్రదాడి మన దేశ ఐక్యత, సమగ్రతపై ప్రత్యక్ష దాడిగా పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసేందుకు కేంద్రంతో సహకరించేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని తెలిపారు. 'రాజకీయాలకు ఇది సమయం కాదు. పహల్గామ్ ఉగ్రదాడిలో నేరస్థులను న్యాయస్థానంలో నిలబెట్టాలి. బాధితులకు న్యాయం జరగాలి. మన దేశ ఐక్యత, సమగ్రతపై ప్రత్యక్ష దాడి జరిగింది. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తాం. పహల్గామ్‌లో జరిగిన ఘటన గురించి జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లాతో మాట్లాడాను. ఈ విషయంపై చర్చించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ గురువారం సమావేశం కానుంది' అని ఎక్స్ వేదికగా ఖర్గే వెల్లడించారు. భారత్‌పై ప్రత్యక్ష దాడి తరువాయి 2లో

## పహల్గామ్‌లో పర్యాటకుల ఊచకోత హేయమైన చర్య

సిపిఐ జాతీయ కార్యవర్గం తీర్మానం



**తిరువనంతపురం :** జమ్మూ కశ్మీర్‌లో 28 మంది అమాయకుల ప్రాణాలు కోల్పోవడానికి, అనేక మంది క్షతగాత్రులవడానికి కారణమైన పహల్గామ్ ఉగ్రవాద దాడిని సిపిఐ తీవ్రంగా ఖండించింది. పౌరులు, పర్యాటకుల దారుణ ఊచకోత హేయమైన చర్య అని, పౌర సమాజంలో ఇలాంటి వాటికి తావు లేదని పేర్కొంది. కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం అధ్యక్షతన బుధవారం జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు డి.రాజా ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం పొందింది. పహల్గామ్ ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ, ఈ ఘటనలో నష్టపోయిన వారికి సిపిఐ జాతీయ కార్యవర్గం సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించింది. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేస్తూ, బాధాకరమైన సమయంలో మద్దతును తెలియజేసింది. బాధితులకు, వారి కుటుంబాలకు పూర్తి స్థాయి వైద్య, ఆర్థిక, భావోద్వేగ సహాయాన్ని తక్షణమే అందించాలని తరువాయి 2లో

## త్వరలో గట్టిగా బదులిస్తాం

- పహల్గామ్‌లో ఉగ్రదాడి పిరికిపంద చర్య
- భారతదేశాన్ని ఉగ్రచర్యలు భయపెట్టబోవు
- కుట్రపన్నిన తెరవెనుక వ్యక్తులనూ కనిపెడతాం
- కేంద్ర రక్షణశాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**న్యూఢిల్లీ :** కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన పిరికిపంద ఉగ్రవాద దాడిలో భాగస్వాములైన వ్యక్తులకు సమీప భవిష్యత్తులోనే 'గట్టి జవాబు' లభిస్తుందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పురాతన నాగరికత కలిగిన అతి పెద్ద భారతదేశాన్ని ఇలాంటి ఉగ్రవాద చర్యలు భయపెట్టబోవని స్పష్టం చేశారు. ఈ దాడిని ప్రేరేపించిన వారిని వేటాడమే కాకుండా భారత గడ్డపై ఘోర చర్యకు కుట్రపన్నిన తెర వెనుక వ్యక్తులను కనిపెడతామని చెప్పారు. పహల్గామ్ దుర్ఘటన జరిగిన ఒకరోజు తరువాత ఢిల్లీలో జరిగిన అర్జన్ సింగ్ స్మారక ప్రసంగంలో బుధవారం నాడు రక్షణ శాఖ మంత్రి స్పందించారు. అంతకు కొద్దిసేపటి ముందు జమ్మూ కశ్మీర్‌లో భద్రత పరిస్థితులపై ఆయన రెండున్నర గంటల పాటు సమావేశానిన నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ దోవల్, ఛీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ ఛీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ ఛీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠి, ఎయిర్ ఛీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్, రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కమార్‌లు హాజరయ్యారు. ''పహల్గామ్‌లో మతాన్ని లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు చేసిన పిరికిపంద దాడులలో మన దేశం అనేక మంది అమాయక పౌరులను తరువాయి 2లో

## ఉత్తర తెలంగాణకు రెడ్ అలెర్ట్ జారీ

- 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం
- మిగిలిన జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్రంలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఆదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి తరువాయి 12లో

## సైద్ధాంతిక పోరాటానికి సిద్ధం

- కాంగ్రెస్ శ్రేణులకు రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పిలుపు
- గుజరాత్ మోడల్‌గా పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు వెల్లడి
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచన



ప్రజాపక్షం / హైదరాబాద్

దేశంలో ప్రస్తుత రాజకీయ, సామాజిక పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను విస్తారంగా జనంలోకి పోవాలని, సైద్ధాంతిక పోరాటానికి సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ శ్రేణులకు ఎఐసిసి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం గుజరాత్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నిర్మాణ విధాన నమూనాను (గుజరాత్ మోడల్) పార్టీ సంస్థాగత నిర్మాణంగా చేపట్టాలని నిర్ణయించినట్లు ఆమె వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో గతంలోని బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని, దేశంలోనే మొదటి సారిగా తెలంగాణ లో కులగణన, 42 శాతం రిజర్వేషన్లు, ఎస్‌సి వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మకమన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర పరిశీలకుల సమావేశం తరువాయి 2లో

## త్వరలోనే పంచాయతీ ఎన్నికలు

మంత్రి సీతక్క 03

## విపత్తులతో నష్టం.. ప్రతి పంటకూ బీమా

- సాగుచేసిన ఏ ఒక్క రైతూ నష్టపోకుండా పంటల బీమా
- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు

03

## ఎసిబికి చిక్కిన ఎస్‌ఆర్‌ఎస్‌పి ఉద్యోగులు

ప్రజాపక్షం /పెద్దపెల్లి ప్రతినిధి



లంచగొండి అధికారులు ఎసిబి వలలో చిక్కారు. బుధవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఎస్‌ఆర్‌ఎస్‌పి కార్యాలయంలో ఎసిబి డిఎస్‌పి భద్రయ్య ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. రూ.20వేలు లంచం తీసుకుంటుండగా సుల్తానాబాద్ ఎస్‌ఆర్‌ఎస్‌పి డివిజన్ సిక్స్ సూపరింటెండెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్‌లు పట్టుబడ్డారు. అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఇజాజ్ సిక్ లీవ్ పెట్టగా, అది ధ్రువీకరించేందుకు రూ.20వేలు లంచం అడగ్గా బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు.

## వారికి పాతికేళ్ళ తరువాతే డ్రైవింగ్ లైసెన్స్

- డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్లు అప్పుడే లైసెన్స్‌కు అర్హులు
- వాహన రిజిస్ట్రేషన్ ఏడాది పాటు రద్దు
- హైదరాబాద్ ట్రాఫిక్ చీఫ్ జోయెల్ డేవిస్ ఆదేశాలు జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్



మైనర్ పిల్లలకు నడిపేందుకు వాహనాలు ఇస్తున్నారా తస్మాత్ జాగ్రత్త. వాహనం నడిపిస్తూ మైనర్‌లు పట్టుబడితే వారు 25 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు డ్రైవింగ్ లైసెన్స్ పొందటానికి అర్హులు కారు. దీంతో పాటు పట్టుబడిన వాహనం తరువాయి 2లో

## 78.57 శాతం పోలింగ్

- ముగిసిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎన్నికలు
- పోలింగ్‌కు దూరంగా బిఆర్‌ఎస్
- 25న ఓట్ల లెక్కింపు



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ బుధవారం ముగిసింది. 78.57 శాతం పోలింగ్ నమోదైంది. బిఆర్‌ఎస్ మినహా బిజెపి, కాంగ్రెస్, ఎంఐఎం కార్పొరేటర్లు, ఎంపి, ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ హాసన్, బిజెపి తరువాయి 2లో




# ప్రపంచం
WORLD NEWS

## మూడు అరబ్ దేశాల్లో ట్రంప్ పర్యటన



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వచ్చేనెల మూడు అరబ్ దేశాలలో పర్యటన చేస్తారు. ఆయన పర్యటన తేదీలు ఖరారయ్యాయి. మే 13 నుండి 16వ తేదీ వరకూ సౌదీ అరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలలో ఆయన పర్యటిస్తారని ఆయన అధికార ప్రతినిధి కరోలిన్ లెవిట్ బుధవారం పత్రికాగోష్ఠిలో చెప్పారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టి ఈనెల 29వ తేదీ నాటికి 100 రోజులు పూర్తవుతాయి. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన తొలి విదేశీ పర్యటన ఇదే. అదేవిధంగా వాటికన్‌సిటీలో జరిగే పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు కూడా ట్రంప్ దంపతులు ఈ వారాంతంలో హాజరవుతారని ఆమె చెప్పారు.

# చైనాపై స్వరం తగ్గించిన ట్రంప్




**బీజింగ్ :** భారీగా సుంకాలు విధిస్తూ చైనాను బెదిరింపులకు గురిచేస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇప్పుడు కొద్దిగా స్వరం తగ్గించారు. చైనాపట్ల గొంతు తగ్గించి మాట్లాడుతున్నారు. చైనాపై విధించిన 145 శాతం సుంకాలు గణనీయంగా తగ్గుతాయని ట్రంప్ పాలనాయంత్రాంగం బుధవారంనాడు ప్రకటించింది. ఐతే భవిష్యత్‌లో రెండు దేశాలు ఒక వాణిజ్య ఒప్పందం చేసుకోవడంపట్ల ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. ఈ తరుణంలో చైనా కూడా స్నేహహస్తం అందించింది. సమానస్థాయి గౌరవ మర్యాదలతో కూడిన చర్చలకు చైనా తలుపులు ఎప్పుడూ తెరచే ఉంటాయని చైనా ప్రభుత్వం మరోసారి తాజా ప్రకటన చేసింది. ఈ పరిణామాలను చైనా మీడియా వివరించింది. సొంత వాణిజ్య ప్రయోజాలు పక్కకునెట్టి అమెరికాకు లొంగుబాటుగా వ్యవహరించవద్దని, అమెరికాతో సుంకాల ఒప్పందాలు చేసుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పలు దేశాలకు చైనా ఇటీవల ఒక హెచ్చరిక చేసింది. అమెరికాతో ఒప్పందాలు చేసుకునేటప్పుడు తమ దేశ ప్రయోజనాలను దెబ్బతీయవద్దని కూడా పేర్కొంది. ఇప్పటికే 18 దేశాలు సుంకాల ఒప్పందాలు చేసుకోవడానికి ఆమెరికాను ఆశ్రయించాయని ట్రంప్ పాలనాయంత్రాంగం మంగళవారంనాడు ప్రకటించింది. అమెరికా ఏ లక్ష్యంకోసం ఈ సుంకాలను ప్రకటించిందో ఆ లక్ష్యాలు నెరవేరడంతో ఆ దేశం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని చైనా ఆర్థిక నిపుణుడొకరు పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వం నిలకడలేని వ్యవహారం ఆ దేశంలో ఆర్థిక మాంద్య భయాన్ని, ధరల పెరుగుదల, ప్రజావ్యతిరేక భయాలను సూచిస్తున్నాయని, ఈ విధమైన భయాలు ట్రంప్ ప్రభుత్వం ఆరంభంలో ఆశించిన లక్ష్యాలకు తీవ్ర ఆటంకాలు కలిగిస్తాయని, ఇవన్నీ నిలకడలేని అస్థిర విధానాలనీ ఒక చైనా ఆర్థిక నిపుణుడు వ్యాఖ్యానించారు. ''145 శాతం సుంకాలంటే చాలా ఎక్కువగా ఉన్నాయి, కానీ అవి ఎక్కువ కాదు, గతంలో ఈ సుంకాలు సున్నాస్థాయిలో ఉండేవి, ఇవి ఎక్కువైనాగానీ గణనీయంగా తగ్గుతాయి, ఏం జరుగుతుందో చూద్దాం'' అని ట్రంప్ తన ఓవల్ కార్యాలయంలో పాత్రికేయులతో బుధవారంనాడు చెప్పినట్లు 'యుఎస్ఎ టుడే' పేర్కొంది.

## నేడు అంతరిక్షంలోకి
# ముగ్గురు చైనా వ్యోమగాములు



**బీజింగ్ :** చైనా సొంత అంతరిక్షకేంద్రం ''తియాంగాంగ్''కు గురువారం నాడు ముగ్గురు వ్యోమగాములు బయలుదేరి వెళతారు. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం మూడు గంటలకు వాయువ్య చైనాలోని జియుక్వాన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుండి షెంజౌ–20 అంతరిక్ష నౌకలో ఈ ముగ్గురు వ్యోమగాములూ బయలుదేరతారు. గడచిన ఆరునెలలుగా 'తియాంగాంగ్'లో పరిశోధనలు చేస్తున్న వ్యోమగాములు భూమికి తిరిగి వచ్చేందుకు వీలుగా కమాండర్ చెన్ డాంగ్ సారథ్యంలో చెన్ జోంగ్రుయ్, వాంగ్ జీలు వెళుతున్నారు. చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజన్సీ (సిఎంఎస్ఎ) అధికార ప్రతినిధి లిన్ గ్జిక్వియాంగ్ ఈ విషయం చెప్పారు. లైఫ్ సైన్సెస్‌పై ఈ వ్యోమగాములు ప్రయోగాలు చేస్తారు. చైనా పదవ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ వ్యోమగాములు బయలుదేరి వెళుతున్నారు. 1970 ఏప్రిల్ 24న మొదటిసారి డాంగ్‌ఫాంఘోంగ్–1 ఉపగ్రహాన్ని చైనా ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో 2016 నుండి ఏప్రిల్ 24ను చైనా స్పేస్ డే గా పాటిస్తున్నారు. చైనా మానవ సహిత అంతరిక్ష ప్రయోగాలలో భాగంగా షెంజౌ–20 నౌక 35వసారి అంతరిక్షానికి బయలుదేరుతోంది.

**భవిష్యత్‌లో పాక్ వ్యోమగాములు**



చైనా అంతరిక్ష శోధనలో పాకిస్థాన్ ఉమ్మడి భాగస్వామిగా చేరింది. పాకిస్థాన్ మొదటిసారి ఇద్దరు వ్యోమగాములను చైనా అంతరిక్ష కేంద్రానికి పంపేందుకు ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది. దీంతో చైనా తనకంటూ ప్రత్యేకంగా నిర్మించుకున్న అంతరిక్ష కేంద్రం ''తియాంగాంగ్''కు వెళ్ళే మొట్టమొదటి విదేశీ వ్యోమగాములు పాకిస్థానీయులే కానున్నారు. చైనా అంతరిక్షసంస్థ ఇద్దరు వ్యోమగాములకు శిక్షణ ఇచ్చి తన అంతరిక్ష కేంద్రానికి తీసుకువెళుతుంది. పాకిస్థాన్ ''సుపార్కో (పాకిస్థాన్ స్పేస్ అండ్ అప్పర్ అట్మాస్ఫియర్ రీసెర్చ్ కమిషన్) డైరెక్టర్ షఫాత్ అలీ ఈనెలారంభంలోనే ఈ విషయం ప్రకటించినప్పటికీ మెరిట్ ప్రాతిపదికపై ఇద్దరు వ్యోమగాముల ఎంపిక ప్రక్రియ తాజాగా ప్రారంభమైంది.

## గట్టిగా బదులిస్తాం (మొదటి పేజీ తరువాయి)

కోల్పోయింది. ఇలాంటి తీవ్రమైన అమానవీయ చర్య మనందరినీ తీవ్రమైన దుఃఖం, బాధలో ముంచేసింద'ని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ ఘటన నేపథ్యంలో భారత ప్రభుత్వం అవసరమైన, తగిన ప్రతి చర్యను తీసుకుంటుందని దేశ ప్రజలు హామీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ ప్రభుత్వం ఏ మాత్రం సహించబోని విధానాన్ని అవలంభిస్తుందని, ప్రతి భారతీయ పౌరుడు ఇలాంటి పిరికిపంద చర్యకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉన్నారని చెప్పారు.

**ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లకు ఉధృతం చేయండి**

సాయుధ బలగాలు తమ పోరాట సన్నద్ధతను పెంచుకొని, ఉగ్రవ్యతిరేక కార్యకలాపాల ఉధృతిని తీవ్రంగా చేయాలని ఉన్నతస్థాయి సమావేశంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదేశించినట్లు సమాచారం. జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై అవకాశం ఉన్న అన్ని కోణాలలో సమావేశం చర్చించినట్లు తెలిసింది. కాగా, రెండు రోజుల సౌదీ అరేబియా పర్యటనను అర్థాంతరంగా ముగించుకొని ప్రధాని మోదీ ఢిల్లీకి బుధవారం ఉదయం తిరిగి వచ్చారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం శ్రీనగర్‌కు వెళ్ళి పరిస్థితులను సమీక్షించారు.

## సైద్ధాంతిక పోరాటానికి సిద్ధం
(మొదటి పేజీ తరువాయి)

టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన బుధవారం గాంధీ భవన్‌లో జరిగింది. సమావేశంలో మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథ్, సిడబ్ల్యుసి సభ్యులు సిహెచ్.వంశీచంద్ రెడ్డి, టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత జమ్మూ కాశ్మీర్ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల మృతి పట్ల సమావేశం సంతాపాన్ని తెలియజేస్తూ 2 నిమిషాలు మౌనం పాటించింది. సమావేశంలో మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలని, ఈ విషయంలో పార్టీ నాయకత్వం మరింత చిత్తశుద్ధితో సీరియస్‌గా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి చాలా చరిత్ర ఉందని, బ్రిటిష్ వాళ్ళతో కూడా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసిందన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ జాతీయ స్థాయి ఆలోచనలతో పార్టీ పని చేస్తుందన్నారు.

**టిపిసిసి పూర్తిస్థాయి ప్రక్షాళన : మహేష్‌కుమార్**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి)ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయనున్నట్లు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని కార్యవర్గాల కూర్పు ఉంటుందన్నారు. పార్టీ ప్రక్షాళనకు ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ దిశా నిర్దేశం చేశారని, పరిశీలకులకు మూడు దశలలో టాస్క్ నిర్దేశించినట్లు తెలిపారు. ఏప్రిల్ 25 నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి పార్టీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా సమావేశాలకు బ్లాక్, మండల అధ్యక్షులను ఆహ్వానించాలని సూచించారు. ఎంపి, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలుగా పోటీ చేసిన అభ్యర్థులు, ఎఐసిసి, టిపిసిసి, ఆఫీస్ బేరర్లు, జిల్లా స్థాయి సీనియర్ నాయకులను ఆహ్వానించాలన్నారు. టాస్క్ 2లో అసెంబ్లీ, బ్లాక్ లెవెల్ మీటింగ్స్, టాస్క్ 3లో మండల సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. 'జై భీమ్, జై బాపు, జై సంవిధాన్' కార్యక్రమాలు తెలంగాణలో పెద్ద ఎత్తున విజయవంతం అవుతున్నాయని ఎఐసిసి అగ్రనేతలు హర్షం వ్యక్తం చేశారన్నారు. ఇప్పుడు పరిశీలకులుగా ఇచ్చిన బాధ్యత అత్యంత కీలకమైనదని, చాలా బాధ్యతగా చిత్తశుద్ధితో చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు సంస్థాగత నిర్మాణం చాలా కీలకమని, ఈ విషయం లో పరిశీలకులు చేపట్టే కార్యక్రమాలు చాలా మరింత బాధ్యతగా చేయాలన్నారు. వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయని, వార్డు సభ్యుల నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు, కౌన్సిలర్ నుంచి మేయర్ వరకు దాదాపు లక్షన్నర పదవులను భర్తీ చేసుకునే అవకాశం ఉందని, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణానికి కూడా తెలంగాణ రోల్ మాడల్‌గా నిలవాలన్నారు.

## నిలబడతాం (మొదటి పేజీ తరువాయి)

పుతిన్ ఉగ్రవాదుల చర్యను ఖండిస్తూ ఉగ్రవాదంపై ప్రపంచవ్యాప్తంగా జరిగే పోరాటంలో భారత్ పక్షాన నిలబడతామని నరేంద్రమోదీకి పంపిన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఈ ఉగ్రవాద చర్యకు కారణమైనవారు తగిన శిక్ష ఎదుర్కొంటారన్నారు. చైనా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ మరణించిన కుటుంబాలకు తీవ్ర సంతాపం ప్రకటించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నాగానీ తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఆయన అన్నారు. పాకిస్థాన్ కూడా ఈ ఉగ్రవాద చర్యను తీవ్రంగా ఖండించింది. భారతదేశ ఆక్రమణలో ఉన్న కశ్మీరు (ఐఓకె)ప్రాంతంలో ఉగ్రవాదులు దాడిచేసి 26 మంది పర్యాటకులను హతమార్చడంపట్ల పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయ అధికార ప్రతినిధి షఫ్కత్ ఖాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దాదాపు చైనా–పాకిస్థాన్ ప్రకటనలు ఒకేవిధంగా ఉన్నాయి. పాకిస్థాన్ మాజీ విదేశాంగమంత్రి దస్తగిర్‌ఖాన్ కూడా ఉగ్రవాదుల చర్యపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ కూడా బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్‌లేయన్ ఉగ్రవాద చర్యను తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదులు దాడిచేసినాగానీ భారతదేశ ఆత్మవిశ్వాసం, స్ఫూర్తి చెక్కుచెదరరదన్నారు. యూరోపియన్ యూనియన్ భారతదేశం వెంటే ఉంటుంది అంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఒక సంతాప సందేశం పంపించారు. జర్మనీ, ఇటలీ ప్రధానమంత్రి మెలోనీ, శ్రీలంక,మాల్దీవులు తదితర దేశాల అధికార ప్రతినిధులు ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తూ ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు తమ మద్దతు తెలియజేశారు.

## ప్రత్యక్ష దాడి (మొదటి పేజీ తరువాయి)

జరిగిందని, యావత్ దేశమంతా షాక్‌కు గురైందన్నారు. ఈ దాడికి పాకిస్థాన్‌కు చెందిన ఒక ఉగ్రసంస్థ బాధ్యత వహిస్తోందని చెప్పారు. అయితే.. మన కు జరిగిన అన్యాయానికి తగిన బదులు ఇవ్వాలని, మనమంతా ఒక్కటే, క లిసి కట్టుగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదామని పిలుపునిచ్చారు. ఉ గ్రవాదులను ఏరి పారేసేందుకు కేంద్రం మరింత తీవ్రంగా కృషి చేయాలని, జమ్ముకశ్మీర్ భద్రతపై పర్యటకులకు నమ్మకం కలిగించాలన్నారు. మరికొన్ని రోజుల్లో అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానుంది. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఆ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎలాంటి ఉగ్రదాడులకు అవకాశం ఇవ్వకుండా భద్రతా బలగాలను మరింత పటిష్ఠం చేయాలి అని సూచించారు. కాగా, బెంగళూరులో విలేకరులతో మాట్లాడు తూ 2000లో జరిగిన భయంకరమైన చిట్టిసింగ్‌పురా ఊచకోత తర్వాత పహల్గామ్‌లో ఉగ్రవాదులు, వేర్పాటువాదులు చేసిన అత్యంత దారుణమైన ప్రయత్నాలలో ఒకటి అన్నారు. నిరాయుధులైన, అమాయక పౌరులను హ త్య చేసిన వారు మనుషులు కాదని తాము దృఢంగా పునరుద్ఘాటిస్తున్నాన్నా రు. పక్షపాత రాజకీయాలకు ఇది సమయం కాదని పేర్కొంటూ, 'ఈ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారికి న్యాయం చేయడం ద్వారా ప్రాణాలు కోల్పోయిన వారికి, దుఃఖిస్తున్న వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా సమష్టి సంకల్పం కోసం కృషి చేయాల్సిన క్షణం అని భావోద్వేగంతో ఖర్గే అన్నారు. పహల్గామ్‌లో దాడి జరిగి 36 గంటలు గడిచిపోయింది, ఆ ఉగ్రవాదిని వేటాడేందుకు ప్రభుత్వం శక్తినంతా ఉపయోగించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కాగా.. కశ్మీర్‌లో మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గామ్ సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు పర్యటకులను కాల్చి చంపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు తీవ్రంగా గా యపడ్డారు. అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చేపట్టాయి.

## హేయమైన చర్య (మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వాన్ని, జమ్మూ కశ్మీర్ యూనియన్ టెరిటరీ ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ క్రూర దాడి భద్రత, నిఘా వైఫల్యాలతో పాటు సందర్భోచితమైన, దృఢమైన జవాబును కోరుతున్నదని పేర్కొంది. ఈ దాడి వెనుక ఉండి ప్రేరేపించిన వారిని, ప్రణాళికలు రచించిన వారిని కచ్చితంగా గుర్తించి, చట్టం ముందుకు తీసుకురావాలని డిమాండ్ చేసింది. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికైన ప్రభుత్వం ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా రాష్ట్ర ప్రభుత్వం సహా సంబంధిత భాగస్వాములను సంప్రదించి విశ్వాస నిర్మాణ చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ ప్రాంతంలో దీర్ఘకాలం పరిఢవిల్లేలా శాంతి పునరుద్ధరణకు, సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు ప్రజల భద్రత, విశ్వాసం, ప్రజాస్వామిక హక్కులకు ప్రాధాన్యతనివ్వాలని సిపిఐ కోరింది.

**పోప్‌కు నివాళి**

ఇటీవల మరణించిన పోప్ ఫ్రాన్సిస్(జోర్జ్ మారియో బెర్గొగ్లియో)కు సిపిఐ జాతీయ కార్యవర్గం నివాళి అర్పించింది.

## ఉగ్రమూలాలను అంతం చేస్తేనే దేశానికి, పౌరులకు రక్షణ : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పెహల్గాంలో పౌరసమాజంపై ఉగ్రవాదుల దాడి అమానుశమని, ఈ దాడిని, హత్యాకాండను కండిస్తున్నామని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సబీర్ పాషా అన్నారు. పెహెల్గం ఉగ్రదాడిపై వారు స్పందిస్తూ ఈ విధమైన దాడులు హత్యాకాండ, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవటం బాధాకరమని, దీనిపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిం ఉంచాలని, ఉగ్రవాదాన్ని తుద ముట్టించి ప్రజలకు మనోధైర్యాన్ని కల్పించాలని కోరారు. ఉగ్రము మూలాలను అంతం చేస్తేనే దేశానికి దేశ పౌరులకు రక్షణ ఉంటుందని పేర్కొన్నారు. దేశ ప్రజల ప్రాణబద్రతకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. అమాయక ప్రజలను చంపడం ద్వారా ఉగ్రవాదులు సాధించేది ఏంటని ప్రశ్నించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి వారు సంతాపం ప్రకటించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## అఫ్గానిస్థాన్‌కు 92 వేలమందిని తరలించిన పాకిస్థాన్



**ఇస్లామాబాద్ :** గడచిన 23 రోజుల్లో పాకిస్థాన్ నుండి 92,000 మంది వలస ప్రజలను వారి స్వదేశం అఫ్గానిస్థాన్‌కు తరలించారు. పాకిస్థాన్ ప్రభుత్వం మంగళవారంనాడు ఈ విషయం వెల్లడించింది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం దాదాపు 30,00,000 లమంది ఆఫ్ఘానిస్థాన్ జాతీయులు అనేక దశాబ్దాలుగా పాకిస్థాన్‌లో నివసిస్తున్నారు. వీరిని బలవంతంగా ఆఫ్ఘానిస్థాన్‌కు తరలిస్తూ ఉండటంతో వలస ప్రజలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. తాము సర్వస్వం కోల్పోయామనీ, గడచిన 60 సంవత్సరాలుగా తాము పాకిస్థాన్ దేశంలో జీవనం గడుపుతున్నామని కొన్ని కుటుంబాలకు చెందిన వారు ఆవేదనతో మీడియాకు చెప్పారు. తమ దేశంలోకి మాదకద్రవ్యాలు, ఉగ్రవాదాన్ని అఫ్గానిస్థాన్ దిగుమతి చేస్తోందని పాకిస్థాన్ ఆరోపిస్తున్నది. అఫ్గాస్థానీయులు నేరాలకు ప్రతిరూపాలుగా ఉనానరనిఇ చెబుతున్నది. నజ్మైన్ కుటుం బం కొద్దిరోజుల క్రితం అఫ్గాన్ సరిహద్దు రాష్ట్రం నంగర్‌హర్‌కు వెళ్ళి అక్కడే ఒక చిన్న ఇల్లును అద్దెకు మాట్లాడుకున్నారు. వారికి అక్కడి అఫ్గానిస్థాన్ భాషకూడా తెలియడంలేదు. ఏవో కొన్ని పాత్రలు తప్ప ఆ కుటుంబం ఇప్పటికే దారిద్ర్యంలో బతుకుతోంది. పైగా ఆఫ్గానిస్థాన్‌లో బాలికలకు చదువుకునే అర్హత లేదు. మహిళలను అనేక ఉద్యోగాల నుండి తొలగించారు. యూనివర్సిటీలు, బ్యూటీ సెలూన్లు, పార్కులు, జిమ్‌లు వంటి అనేక ప్రాంతాలలో తిరగకూడదనీ, ఉద్యోగాలు చేయకూడదని స్త్రీలపై అఫ్గానిస్థాన్ ప్రభుత్వం 2021 నుండీ ఆంక్షలు అమలు చేస్తోంది. ఆ దేశంలో 80 శాతం ప్రజలు రోజుకు ఒక్క డాలరుకంటే అతి తక్కువ సంపాదనతో జీవనం వెళ్ళదీస్తున్నారు. ''మా జీవితంలో ఏనాడూ అఫ్గానిస్థాన్‌ను చూడలేదు, అక్కడ పని దొరుకుతుందో లేదో కూడా తెలియదు, అక్కడ పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియదు'' అని 28 ఏళ్ళ యువకువు జలీల్ ఖాన్ మహ్మమ్మదిన్ ఆందోళన వ్యక్తం చేశారు.

## డ్రైవింగ్ లైసెన్స్ (మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్‌ను కూడా ఏడాది పాటు రద్దు చేస్తారు. ఈ మేరకు హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ జోయెల్ డేవిస్ ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఈ నెల 5 నుంచి నిర్వహిస్తున్న 'మైనర్ డ్రైవింగ్' స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన 1275 మందిపై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన మైనర్లందరికి 25 ఏళ్లు నిండిన తరువాతనే వారు డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందెందుకు అర్హులని ఆదేశాలు కూడా జారీ చేశారు. దీంతో పాటు పట్టుబడిన వాహనాలలో 35 వాహనాల రిజిస్ట్రేషన్‌లను కూడా ఏడాది పాటు రద్దు చేసామని ఆయన తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తున్న తల్లిదండ్రులపై ట్రాఫిక్ జాయింట్ పోలీసు కమిషనర్ జోయెల్ డేవిస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు హైదరాబాద్‌లో ఎప్రిల్ 5వ తేదీ నుంచి 'మైనర్ డ్రైవింగ్'పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటి వరకు 1275 మంది మైనర్లు పట్టుబడ్డారు. అలాగే వా రు రిజిస్ట్రేషన్ కాని 35 వాహనాలకు ఏడాది పాటు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తూ ట్రాఫిక్ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. మోటారు వాహనాల చట్టం, 1988లోని సెక్షన్ 199A ప్రకారం ఏ మైనర్ వ్యక్తి, మోటా రు వాహనాన్ని నడపడం ఖచ్చితంగా నిషేధించబడింది. ఈ నిబంధనను ఉల్లంఘించడం వలన మైనర్కే కాకుండా వాహన యజమాని లేదా సంరక్షకుడికి కూడా కఠినమైన చట్టపరమైన పరిణామాలు ఎదురవుతాయని జోయెల్ డేవిస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ స్పెసల్ డ్రైవ్ డ్రైవ్ ప్రారంభమైనప్పటి నుండి, నగర రోడ్లపై మోటారు వాహనాలను నడుపుతున్న మైనర్లపై మొత్తం 1275 కేసులు నమోదు చేశారని ఆయన తెలిపా రు. కొన్ని వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను రద్దు చేయాలని ప్రాంతీయ రవాణా అథారిటీ (ఆర్‌టిఎ)కు అభ్యర్థనలు కూడా పంపించిడం జరిగిందన్నారు. ఫలితంగా, ఇప్పటివరకు అలాంటి 35 వాహనాల రిజిస్ట్రేషన్‌ను ఒక సంవత్సరం పాటు రద్దు చేశారని, మిగిలిన వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు ప్రక్రియలో ఉందని ఆయన తెలిపారు.ఈ స్పెషల్ డైవ్‌లో ట్రాఫిక్ డిసిపిలు, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ (మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థిగా గౌతమ్ రావు బరిలో ఉన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలలో ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. భారీ బందోబస్తు, జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం చుట్టూ పోలీసులు కట్టుదిట్టంగా ఆంక్షలను అమలు చేస్తూ పోలింగ్ నిర్వహించారు. దాదాపు 200 మీటర్ల నుంచే రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. జిహెచ్ఎంసి కార్యాలయం చుట్టూ బారికేడ్లను ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఉదయం ప్రారంభమైన పోలింగ్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బిజెపి ఎంపిలు ఈటల రాజేందర్, డాక్టర్ కె. లక్ష్మ ణ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు మొదట పోలింగ్ బూత్ నెంబర్ 1లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, ఆ పార్టీ ఎంఎల్‌ఎలు అక్బరుద్దీన్ ఓవైసీ, మాజీద్ హుస్సేన్, కౌసర్ మోహియుద్దీన్, ముంతాజ్ ఖాన్, మిరాజ్ జాఫర్ హుస్సేన్, మహ్మద్ ముబిన్, అహ్మద్ బిలాలాలు ఒకే సారి వరుసగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌సి ఎం.ఎస్. ప్రభాకర్, టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండ రామ్, ఎంఎల్‌సి అమేర్ అలీఖాన్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేశ్‌లతో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డిలు తమ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నెంబర్ 2లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం కల్లా ఎంఐఎం పార్టీకి చెందిన కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు పోలింగ్‌లో పాల్గొన్నారు. గోషామహల్ బిజెపి ఎమ్మెల్యే టి. రాజాసింగ్ మధ్యాహ్నం రెండు గంటలకు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లు 112 మంది ఉండగా, 88 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో ఎక్స్ అఫిషియో సభ్యులు 31 కాగా, 22 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81 మంది కార్పొరేటర్ల లో 66 మంది ఓటు వేశారు. ఈ నెల 25న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపును జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని పన్వర్‌హాల్‌లో నిర్వహిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు.

**క్రాస్ ఓటింగ్ పై ఉత్కంఠత..**

ఈ ఎన్నికలో ఎంఐఎం గెలిచే అవకాశం ఉండగా ఓడిపోతామని తెలిసినా బిజెపి బరిలోకి దగడంతో రాజకీయం ఉత్కంఠగా మారింది. ఈ క్రమంలో బిఆర్ఎస్ ఓటింగ్‌కు దూరంగా ఉండటం, కాంగ్రెస్ పోలింగ్‌లో పాల్గొనడం రాజకీయాన్ని మరింత ఆసక్తిగా మారింది. పోలైన మొత్తం ఓట్లలో 50 శాతానికి ఒక్క ఓటు ఎక్కువ ఎవరికి లభిస్తే ఆ అభ్యర్థి గెలిచినట్లుగా ప్రకటిస్తారు. ఈ నేపథ్యంలో 88 ఓట్లు పోలవగా ఇందులో పార్టీల మధ్య క్రాస్ ఓటు జరిగిందా అనే విషయం ఉత్కంఠగా మారింది.

## రేఖా చిత్రాలు విడుదల
(మొదటి పేజీ తరువాయి)

సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను ఉద్ధృతం చేయాలని, ఎప్పటికప్పుడు భద్రతా పోరాటానికి సిద్ధంగా ఉండేలా సాయుధ దళాలను అప్రమత్తం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉగ్రవాదుల దారుణ అకృత్యం పట్ల దేశ ప్రజల మనోభీష్టాన్ని ప్రతిబింబించే ప్రతిస్పందనను సమీప భవిష్యత్తులో ప్రభుత్వం చేపడుతుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఉగ్రవాదుల దాడిలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నేపాల్ దేశాలకు చెందిన ఇద్దరు పర్యాటకులు కూడా మరణించారు. మృతదేహాలను బుధవారం నాడు తెల్లవారుజామున శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మృతదేహాలను పోలీసు కంట్రోల్ రూముకు తీసుకువచ్చారు. హోంమంత్రి అమిత్ షా అక్కడే మృతదేహాలను సందర్శించి వారి భౌతిక కాయాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉగ్రవాదానికి భారత్ తలవంచబోదని, నేరస్థులకు, సూత్రధారులకు శిక్ష తప్పదని ఆయన హెచ్చరిక చేశారు. ఉగ్రవాదులను వదిలిపెట్టేదిలేదన్నారు. బైసారన్‌లో ఉగ్రవాదుల దాడి ఘటన తెలిసిన వెంటనే ప్రధానమంత్రి మోదీ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రికి అమిత్ షా శ్రీనగర్ చేరుకున్నారు. ఆయనతోపాటు ఢిల్లీ నుండి అనేకమంది ఉన్నతాధికారులు కూడా వెళ్ళారు. స్థానిక పోలీసులకు మద్దతుగా సహాయ సహకారాలు అందించడానికి ఎన్ఐఎ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ) ఇన్‌స్పెక్టర్ జనరల్ నాయకత్వాన ఒక బృందం పహల్గామ్‌కు చేరుకుంది.

**గౌరవప్రదంగా మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు**

శ్రీనగర్ ఆసుపత్రి చుట్టుపక్కల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి గాయపడిన పర్యాటకులకు చికిత్సలు చేస్తున్నారు. కాగా దాడిలో మరణించిన వివిధ రాష్ట్రాలకు చెందిన పర్యాటకులకు రూ.10 లక్షలు వంతున జమ్మూ కశ్మీరు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. తీవ్రంగా గాయపడినవారికి రూ.2 లక్షలు, స్వల్పగాయాలు తగిలినవారికి ఒక లక్షరూపాయలు వంతున నష్టపరిహారం చెల్లించింది. జమ్మూ కశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎక్స్ వేదికగా ఈ మేరకు ఒక పోస్టింగ్ పెట్టారు. ''ఈ ఉగ్రవాద దాడితో నేను చాలా దిగ్భ్రాంతికి గురయ్యాను, అమాయకులైన పౌరులపై చేసిన ఆటవిక దుర్మార్గపూరితమైన ఈ చర్యకు పాల్పడినవారికి సమాజంలో స్థానం లేదు, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాను, వెలకట్టలేని ప్రజల ప్రాణాలు పోయాయి. వారి మృతికి తీవ్ర సంతాపం ప్రకటిస్తున్నాం'' అని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. పర్యాటకులు అందరూ స్వస్థలాలకు చేరుకోవడానికి అన్ని ఏర్పాట్లూ చేశామని, మరణించిన వారి భౌతిక కాయాలను గౌరవప్రదమైన పద్ధతులలో వారి వారి స్వస్థలాలకు ఇళ్ళకు తీసుకువెళ్ళడానికి అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ''మా సంకల్పం చెక్కుచెదరదు, ఉగ్రవాదానికి భయపడం, ఈ దాడికి కారకులైన వారిని న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్షించేవరకూ మాకు విశ్రాంతి లేదు'' అని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

**35 ఏళ్ళలో మొదటిసారి..**
**సర్వత్రా ప్రజా నిరసన**
**స్తంభించిన కశ్మీరులోయ**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా బైసారన్‌లోని ఘటనాస్థలాన్ని సందర్శించారు. గాయపడినవారిని పరామర్శించారు. ఈ ఘటనలో ప్రత్యక్ష సాక్షులుగా ఉన్న బాధితులను అమిత్ షా కలిసి వారిని ఓదార్చారు. వారి ప్రత్యక్ష అనుభవాలను ఆలకించారు. నాయకులు ఈ ఉగ్రవాద చర్యను ఖండించినవిధంగానే స్థానిక ప్రజలు కూడా అదే స్థాయిలో ప్రతిస్పందించి ఉగ్రవాద చర్యను వ్యతిరేకించారు. ఉగ్రవాదులు సృష్టించిన రక్తపాతానికి వ్యతిరేకంగా అనేక రాజకీయపార్టీలు, సామాజిక–మత సంస్థలు, వాణిజ్య విభాగాలు, పౌరసమాజ గ్రూపులు బుధవారంనాడు కశ్మీరు బందుకు పిలుపు ఇచ్చాయి. అధికార నేషనల్ కాన్ఫరెన్స్‌పార్టీ, ప్రీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ, పీపుల్స్ కాన్ఫరెన్స్, అప్నీ పార్టీలు బంద్ పిలుపులో పాల్గొన్నారు. కశ్మీరులో అనేక స్థానిక పత్రికలు మొదటి పేజీల్లో పతాక శీర్షికల్లో ఉగ్రవాదుల దాడిని వ్యతిరేకిస్తూ వార్తలు రాశాయి. ఈ దాడి చర్యను వ్యతిరేకిస్తూ స్థానిక భాషలో బలమైన,శక్తిమంతమైన పదజాలంతో శీర్షికలు పెట్టాయి. వార్తాకథనాలు రాశాయి. మొదటిపేజీల్లో ఎరుపు, తెలుపు రంగుల డిజైన్లలో వార్తలు ప్రచురించాయి. తమ వంతు సంఘీభావం ప్రకటించాయి. ఈ అమానవీయ చర్యను ప్రతిఘటిస్తూ స్థానిక ప్రజల మనోవేదనను పత్రికలు ప్రదర్శించి సంఘీభావం ప్రకటించాయి.

**బాధితులకు న్యాయం చేయండి**
**అమిత్‌షాకు ఖర్గే,రాహుల్ వెల్లడి**

పహల్గామ్‌లో ఉగ్రవాదుల కాల్పుల ఘటనపై దేశంలో ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఇద్దరూ కేంద్రమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో సంభాషించారు. కశ్మీరులో తాజా పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని రాజకీయ పార్టీలతో కూడా సంభాషించి జమ్మూ కశ్మీరు భద్రతకు పూర్తి భరోసా కల్పించాలని ఈ సందర్భంగా మల్లికార్జునఖర్గే హోంమంత్రికి విజ్ఞప్తి చేశారు. పర్యాటకులకు వీలైనవిధంగా అన్ని రకాలుగా కట్టుదిట్టమైన భద్రత ఇవ్వాలని ఆయన కోరారు. కాంగ్రెస్‌పార్టీ తరపున బాధిత కుటుంబాలకు పూర్తి అండదండలు అందిస్తామని ఆయన ప్రకటించారు. జమ్మూ కశ్మీరు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఆ కేంద్ర పాలిత ప్రాంత ఇతర సీనియర్ మంత్రులతో కూడా ఖర్గే, రాహుల్ ఇద్దరూ ఫోన్ సంభాషణలు జరిపారు. బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని కోరారు. ''ఈ దాడికి సూత్రధారులను వదిలిపెట్టకూడదు, వారికి కఠినశిక్షలు పడాల్సిందే'' అని మల్లికార్జున ఖర్గే ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. జమ్మూ కశ్మీరు కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తారిక్ కర్రాతో కూడా ఖర్గే,రాహుల్‌గాంధీ మాట్లాడి పార్టీ పరంగా తగినవిధంగా ప్రతిస్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్‌గాంధీ, బాధిత కుటుంబాలకు తన పూర్తి మద్దతు తెలియజేశారు. వారికి పూర్తి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాహుల్‌గాంధీ ఈ విషయాలన్నీ ఎక్స్ వేదికగా తెలియజేశారు. ఉత్తుత్తి ప్రకటనలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఈ ఉగ్రవాద దాడికి పూర్తి బాధ్యత వహించాలని కాంగ్రెస్‌పార్టీ తొలుత డిమాండ్ చేసింది. ఉగ్రవాదుల దాడి మానవత్వానికి మాయనిమచ్చ అని కాంగ్రెస్ పేర్కొంది. మరణించిన పర్యాటకులపట్ల రాహుల్‌గాంధీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. జమ్మూ కశ్మీరు ప్రభుత్వం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నిర్మాణాత్మకమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## త్వరలోనే పంచాయతీ ఎన్నికలు :మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్: బిసి రిజర్వేషన్ల పెంపు ప్రక్రియ కారణంగా ఆలస్యమైన పంచాయతీ ఎన్నికలను త్వరలోనే నిర్వహిస్తామని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థకు మూల కేంద్రంగా ఉన్న గ్రామ సభల ద్వారానే సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థకు చట్టబద్ధత కల్పించిన సందర్భాన్ని గుర్తు చేస్తూ ప్రతి ఏటా ఏప్రిల్ 24న 'జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం' జరుపుకుంటారని గుర్తుచేస్తూ, మంత్రి సీతక్క బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అధికార వికేంద్రీకరణ, పంచాయతీల పటిష్టత కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తు చేసుకున్నారు. భారత రాజ్యాంగంలో పొందుపరిచినవిధంగా, 73వ రాజ్యాంగ సవరణఅనుగుణంగా గ్రామ పంచాయతీలకు విధులు, నిధులు అప్పగించే దిశలో సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం పనిచేస్తుందని,గ్రామపంచాయతీల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుతూ రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛదనం పచ్చదనం, పల్లెల్లో పనుల జాతర వంటి కార్యక్రమాలను పూర్తి చేసినట్లు వివరించారు.

## విపత్తులతో నష్టం..
# ప్రతి పంటకూ బీమా

### సాగుచేసిన ఏ ఒక్క రైతూ నష్టపోకుండా పంటల బీమా
### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును మొదలుపెట్టింది. పర్యావరణ కాలుష్యంబారిన పడడంతో తరుచూ వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్న కారణంగా ఏర్పడుతున్న అతివృష్టి, అనావృష్టిలతో పంటలకు తీవ్ర నష్టం జరుగుతుండడంతో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోకుండా ప్రయోజనం చేకూరేలా సమగ్ర పంట బీమా పథకాన్ని అమలు చేసేందుకు చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఇతర అధికారులతో పంటల బీమా పథకం అమలుకు సంబంధించిన ప్రాథమిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ పథకం కింద రైతులందరికీ బీమా అందించడం, ఏఏ పంటలకు బీమా పథకాన్ని వర్తింపచేయాలనే విషయాలపై సుదీర్ఘ చర్చజరిగింది. ముఖ్యంగా వానాకాలం, యాసంగి కాలాల్లో ఏఏ పంటలకు ఏఏ విపత్తుల కింద బీమా వర్తింపచేయాలనే అంశంపై సమగ్రంగా చర్చించారు.

**రాష్ట్రాన్ని 11 క్లస్టర్లుగా విభజన :**
పంటల బీమా అమలుకు సంబంధించి ప్రతి ఏటా నష్టం సంభవిస్తున్న ప్రాంతాల ఆధారంగా రాష్ట్రాన్ని 11 క్లస్టర్లుగా విభజించారు. సాధారణంగా ప్రతి వానాకాలం సీజన్‌లో సుమారు 128 లక్షల ఎకరాలు సాగు అవుతుండగా, ఇందులో వరి 66.78లక్షల ఎకరాలు, మొక్కజొన్న 5.23, పత్తి 44.75, మిర్చి 1.90, సోయాబీన్ 3.80, కంది 5.21 లక్షల ఎకరాలు పంటలు వేస్తున్నారు. యాసంగి విషయానికి వస్తే మొత్తం 78 లక్షల ఎకరాల సాగులో వరి 59 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 9, వేరుశనగ 2.2, శనగ 1.7 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్లు అధికారుల అంచనా. దీని ప్రకారం పంట బీమా అమలుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం మార్గదర్శకాల ప్రకారం వానా కాలానికిగాను మొత్తం ప్రీమియంలో రైతు వాటా 2 శాతం, యాసంగి పంటకాలంలో 1.5 శాతం, వాణిజ్య, ఉద్యానపంటలకు గాను 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉండగా, మిగిలిన ప్రీమియంలో రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు చెరిసగం చొప్పున భరించాల్సి ఉంటుంది. అయితే రైతువాటను సైతం రాష్ట్ర ప్రభుత్వమే భరించే ఆలోచనలో ఉంది.

**ఏ ఒక్క రైతు నష్టపోకుండా పంటల బీమా : మంత్రి**
విపత్తుల కారణంగా పంట నష్టం జరిగితే సాగుచేసిన ఏ ఒక్క రైతు నష్టపోకుండా పంటల బీమా పథకం ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ఇతర రాష్ట్రాలు ఏ విధంగా అమలుచేస్తున్నాయో అధ్యయనం చేసి, వానాకాలం, యాసంగి పంటలకు సంబంధించి రైతులందరికీ ప్రయోజనం చేకూరే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. దిగుబడి ఆధారిత బీమా పథకం కింద వరి, మొక్కజొన్న, కంది, మినుము, సోయాబీన్, వేరుశనగ, శనగ, నువ్వులు మొదలైన పంటలు, వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పత్తి, మిరప, మామిడి, ఆయిల్ పామ్, టమాట, బత్తాయి తదితర పంటలకు బీమా వర్తింపచేసే విషయంలో పూర్తిస్థాయిలో రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పథకాన్ని రూపకల్పన చేయాలని అధికారులకు సూచించారు. ఎండాకాలంలో వడగళ్ల వర్షం వలన నష్టపోయే వరి, మామిడి వంటి ప్రధాన పంటలకు పూర్తి స్థాయి నష్టపరిహారాన్ని రైతులకు అందించే విషయంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. అదేవిధంగా టెక్నాలజీ ఆధారంగా పంటల దిగుబడి అంచనాలను రూపొందించడం, నష్టపోయిన పంటల విషయంలో బీమా కంపెనీలు సత్వరమే బీమా క్లెయిమ్ అందించేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

# భూ భారతి ఇందిరమ్మ బ్రాండ్

### రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా భూ భారతి చట్టం రూపకల్పన
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/నూతనకల్ : భూ భారతి ఇందిరమ్మ బ్రాండ్ అని రైతన్నల సంక్షేమమే ధ్యేయంగా మేధావులు, రెవెన్యూ నిపుణులు, ప్రజల సూచనలతో భూ భారతి చట్టం రూపొందించడం జరిగిందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భూభారతి చట్టం 2025పై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల దీవెనలతో ఏర్పడిన ఇందిరమ్మ ప్రజాప్రభుత్వం పేదల భూములకు భద్రత కల్పించేలా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి రోజున సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూభారతి చట్టం ప్రారంభించినట్లు తెలిపారు. ధరణి చట్టం నాలుగు గోడల మధ్య నలుగురు వ్యక్తులు స్వార్థం కోసం పేదల భూములను కొల్లగొట్టేందుకు రూపొందించిన చట్టమన్నారు. ఇలాంటి చట్టం ఎక్కడా లేదని, ప్రజల మధ్యకు వెళ్తే చిన్న చిన్న సమస్యలు కూడా అధికారులు పరిష్కరించేలా అధికారం లేకుండా తహసీల్దార్ అడిగితే కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోండి అని చెప్పడం జరిగిందన్నారు. రైతుల ఇబ్బందులను తెలుసుకొని తాము వారి కష్టాలను కడతేర్చేందుకు ధరణిని బంగాళాఖాతంలో పడేసి కోదండరాంరెడ్డి ఆధ్వర్యంలో కమిటీని వేసి పెండింగ్‌లో ఉన్న 2.46లక్షల దరఖాస్తులతో పాటు నేటి వరకు 3.5లక్షల దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. ఈ కమిటీ 15నెలల 18 రాష్ట్రాల్లో తిరిగి మంచి రెవెన్యూ అంశాలను స్వీకరించి ప్రజల అభిప్రాయాలు, రెవెన్యూ అధికారులు, నిపుణుల ద్వారా అభిప్రాయ సేకరణ చేసి రైతుల సంక్షేమమే ధ్యేయంగా చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ధరణి 2020 చట్టం గత ప్రభుత్వం తీసుకవచ్చిన రూల్స్ రెగ్యూలేషన్ లేకుండా అమలు చేయడం జరిగిందన్నారు. సాదాబైనామా 2020 అక్టోబర్‌లో దరఖాస్తు చేసుకున్న నేటికి పరిష్కారం కాలేదన్నారు.
భూభారతి చట్టం 2025లో 90రోజుల్లోనే భూ సమస్యలు పరిష్కరించేలా ఆర్‌డిఒ, కలెక్టర్ స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ఫైలెట్ ప్రాజెక్టు కింద దీన్ని అమలు చేయడం జరిగిందన్నారు. జూన్ 2 నుండి తహసీల్దార్లు గ్రామాలకు వెళ్లి భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. రాష్ట్రంలో 9.26లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, మిస్సింగ్ సర్వే నెంబర్లలాంటివి ఇందులో ఎక్కువగా ఉన్నాయన్నారు.
కోర్టు కేసుల్లో ఉన్నవి కూడా చాలా ఉన్నాయన్నారు. ఆధార్ నెంబర్ వలే ప్రతీ రైతుకు భూధార్ నెంబర్ ఇస్తామని తెలిపారు. రైతుల ప్రతి భూమిని రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు హద్దులతో కూడిన మ్యాప్‌ను పట్టాదార్ పాస్ బుక్కులో ప్రింట్ చేస్తామని చెప్పారు.
ఇతరులకు రిజిస్ట్రేషన్ కాకుండా మిగిలిన భూములను రైతులు సర్వే చేయించుకుంటే వాటిని సర్వే చేసి పాస్ బుక్కులు ప్రింట్ చేస్తామని తెలిపారు. జిల్లా ఎస్‌పినర్సింహ, అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్‌డిఓ వేణుమాధవరావు, తహసీల్దార్ శ్రీనివాస్, శ్యాంసుందర్ రెడ్డి, అమీన్ సింగ్, బ్రహ్మయ్య, హరిచంద్రప్రసాద్, ఎంపిడిఓ సునీత, ఎఎంసి చైర్మన్ గిరిధర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ జయసుధా సుధాకర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పదేళ్ల పరిపాలనలో చేసిన అభివృద్ధిపై..
# బిఆర్ఎస్ శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి

### ఎంపి మల్లు రవి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే చేసిన అభివృద్ధిపై, రానున్న నాలుగేళ్లలో చేయనున్న అభివృద్ధిపై శ్వేతపత్రాన్ని విడుదల చేశామని, బిఆర్ఎస్ పదేళ్ల పరిపాలనలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రాన్ని బిఆర్ఎస్ రజతోత్సవ సభలో విడుదల చేయాలని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంకా పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటుంటే, బిఆర్ఎస్ నేత చంద్రశేఖర్‌రావు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు బిఆర్ఎస్ నాయకులు గోబల్స్ ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి కూటమిగా ఏర్పడి పోటీ చేస్తాయన్నారు. గాంధీభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రజతోత్సవ సభలో పార్టీ అధ్యక్షునిగా ఎవరిని చేస్తారో చెప్పాలని, ఎస్‌సిని అధ్యక్షునిగా చేస్తారా? ఎస్‌టిని అధ్యక్షునిగాగా చేస్తారా స్పష్టతనివ్వాలన్నారు. మోదీ ప్రభుత్వం పేద ప్రజలకు వ్యతిరేకమని, వంద రోజుల ఉపాధి హామీ పనులకు బడ్జెట్‌ను తగ్గించి పేద ప్రజల కడుపు కొట్టిందని మల్లు రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. యుపిఎ ప్రభుత్వ హాయంలో తీసుకువచ్చిన 'పనికి ఆహార పథకాన్ని' ఎత్తివేయలేక బడ్జెట్ తగ్గించారని విమర్శించారు. బడ్జెట్ పెంచి పని రోజులు పెంచాలని ప్రధాని మోదీని కాంగ్రెస్ ఎంపిలందరం కలిసి వినతి పత్రం ఇస్తామని, అందుకు బిజెపి ఎంపిలు కూడా ప్రధానిని ఒప్పించాలన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తామని బిజెపి నేతలు అంటున్నారని, వారు మూసీ ప్రక్షాళన చేశారా? మెట్రో రైల్‌కు నిధులు తెచ్చారా? ప్రజలు బిజెపికి ఎందుకు ఓట్లు వేస్తారని ఆయన ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయిస్తున్నారని, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్‌లు తెలంగాణాకునిధులను ఎందుకు తీసుకురావడంలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపి 8సీట్లు గెలవదన్నారు.

## సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న
# టిపిసిసి కార్యవర్గ జాబితాలు నిజం కావు

### టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టీకరణ

ప్రజాపక్షం / హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) కార్యవర్గం, జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల నియామకపు ప్రతిపాదనల పేర్లతో సామాజిక మాధ్యమంలో ప్రచారంలో ఉన్న జాబితాలు నిజం కావని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అలాంటి ప్రతిపాదనలు, జాబితాలు ఇప్పటివరకు టిపిసిసి చేయలేదని ఆయన తెలిపారు. డిసిసి, టిపిసిసి కార్యవర్గం ప్రతిపాదనల కోసం క్షేత్రస్థాయి సంప్రదింపుల కోసం ఒక విధానంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఇలాంటి తప్పుడు సమాచారంతో ఉన్న జాబితాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎవరు నమ్మవద్దని మహేష్‌కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో కోరారు.



# చరిత్రలో నిలిచిపోయే రజతోత్సవ బహిరంగ సభ

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు

ప్రజాపక్షం /ఎల్కతుర్తి : చరిత్రలో నిలిచిపోయేలా రజతోత్సవ బహిరంగ సభ నిర్వహించనున్నామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో బిఆర్ఎస్ 25వ వసంతం రజతోత్సవ మహా సభకు జరుగుతున్న ఏర్పాట్లను బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు,మాజీ మంత్రులతో కలిసి సభ వేదిక ప్రాంగణం ఏర్పాట్లు పార్కింగ్ సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సభ వేదిక వద్ద విలేకరుల సమావేశంలో కెటిఆర్ మాట్లాడారు. తొలుత జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల చేత హతమైన భారతీయులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మాట్లాడుతూ ఇది ఏ రాజకీయ లబ్ధి కోసం చేస్తున్నటువంటి సభ కాదు టిఆర్ఎస్ (బిఆర్ఎస్) స్థాపించి 25 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జరుగుతున్న సభ అని అన్నారు. దేశ చరిత్రలో ఎన్నో పార్టీలు పుట్టుకుంటూ వచ్చాయి, కనుమరుగైపోయాయి కానీ చివరి దాకా నిలబడ్డవి రెండు పార్టీలు మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, రాజ్యసభ సభ్యులు రవిచంద్ర, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూధనా చారి,బండా ప్రకాష్, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి,తక్కళ్లపల్లి రవిందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, డాక్టర్ టి.రాజయ్య, చల్లా ధర్మారెడ్డి,నరేందర్, గండ్ర వెంకట రమణారెడ్డి, శంకర్ నాయక్, సతీష్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## కార్మికులకు గుదిబండగా మారిన
# బయోమెట్రిక్ రద్దుచేయాలి

### భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.నరసింహ డిమాండ్



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/గండిపేట్ : భవన నిర్మాణ కార్మికుల ప్రతి సమస్యకు థంబ్ సిస్టం (వేలిముద్ర) అనేది అనివార్యంగా మారిన సందర్భంలో థంబ్ సిస్టం పెట్టలేక ఎంతోమంది కార్మికులు లబ్ధి పొందలేకపోయారని, కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న థంబ్ సిస్టం తక్షణమే రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.నరసింహ డిమాండ్ చేశారు. ఏప్రిల్ 21, 22 రెండు రోజులపాటు జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం నాల్గవ రాష్ట్ర మహాసభలో తీసుకున్న కర్తవ్యాలు, తీర్మానాలను ఆయన బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. లేబర్ అడ్డాల దగ్గర మౌలిక సదుపాయాలు కల్పించాలని, వలస కార్మికుల చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని, భవన నిర్మాణ కార్మికులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ముడిసరుకు రేట్లు పెరిగి భవన నిర్మాణాలు ఆగిపోయిన సందర్భంగా కార్మికులకు నష్ట పరిహారం కింద నెలకు 15 రోజుల చొప్పున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా లేబర్ బోర్డు నుండి గాయపడి, చనిపోయిన కార్మికులకు 6 లక్షల నుండి 10 లక్షలకు ఎక్స్‌గ్రేషియా పెంచి ఇవ్వాలని, నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పని ప్రదేశాలలో సేఫ్టీ పరికరాలు అమలు చేయడంతో పాటు కార్మిక సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్ళించకుండా కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాలని, 22 తీర్మానాలు మహాసభ ఏకగ్రీవంగా ఆమోదం చేసినట్లు ఎం.నరసింహ వివరించారు.
ఈ విలేకరుల సమావేశంలో ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆహ్వాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు,రాష్ట్ర కార్యదర్శిలు కమతం యాదగిరి,మల్లికార్జున్, శివశంకర్,ఎస్ మల్లేష్ కోశాధికారి కన్య గారి నరసింహారెడ్డి, ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు నర్రాగిరి,అన్నపు ప్రభు, ఈ సమావేశంలో మున్సిపల్ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సక్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్**

భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షులుగా మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.నరసింహ, కార్యనిర్వాక అధ్యక్షునిగా గన్నారం రమేష్, ప్రధాన కార్యదర్శిగా పల్లా దేవేందర్ రెడ్డి, 75 మందితో నూతన కమిటీ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నికుంది.

## విద్యార్థులకు ఉన్నత విద్యలో
# అడ్డంకులను తొలగించడమే లక్ష్యం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఉన్నత విద్యలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు ఉన్న అడ్డంకులను తొలగించడమే తమ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టిజిసిహెచ్ఇ) చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి అన్నారు. న్యూఢిల్లీకి చెందిన కాలేజ్ బోర్డ్ ఇండియా గ్లోబల్ అలయన్స్ ఎల్‌ఎల్‌పి, ఇండియా, సౌత్, సెంట్రల్ ఆసియాతో పరస్పర అవగాహన ఒప్పందం తెలంగాణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఒక ముఖ్యమైన ముందడుగు అవుతుందన్నారు. న్యూఢిల్లీకి చెందిన కాలేజ్ బోర్డ్ ఇండియా గ్లోబల్ అలయన్స్ ఎల్‌ఎల్‌పి, ఇండియా, సౌత్,సెంట్రల్ ఆసియాతో పరస్పర అవగాహన ఒప్పందం సీనియర్ డైరక్టర్ మీనాక్షి కచ్రూ చట్టా హైదరాబాద్‌లోని టిజిసిహెచ్ఇ కార్యాలయంలో ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డితో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థుల కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్నత విద్యలో అవకాశాలు, విద్యా సంస్థలలో ప్రవేశం పొందే నేపథ్యంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఒయు) తదితర అంశాలపై చర్చించారు.
**ఎఐసిటిఇ ప్రతినిధులతో భేటీ :** ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) ఆవిష్కరణ విభాగం డైరెక్టర్ డాక్టర్ యోగేష్ బ్రహ్మంకర్, ఎఐసిటిఇ ఇండోవేషన్ సెంటర్, సౌత్ సెంట్రల్ రీజియన్, హైదరాబాద్ మేనేజర్ డాక్టర్ భీమ ఎల్ రెడ్డి బృందం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డిని బుధవారం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో ఉన్నత విద్యా సంస్థలలో ఇన్నోవేషన్,ఇంక్యుబేషన్ వ్యవస్థను స్థాపించేందుకు టిజిసిహెచ్ఇ సహకారం కోరారు. ఈ సందర్భంగా యోగేష్ బ్రహ్మంకర్ వివిధ ఇన్నోవేషన్ నిధులు, విద్యార్థులు,అధ్యాపకుల కోసం ఉన్న ఫెలోషిప్‌లను, పథకాలను వివరించారు. టిజిసిహెచ్ఇ సహకారంతో ప్రాంతీయ స్థాయిలో ఉన్నత విద్యా సంస్థల క్లస్టర్లను ఏర్పాటు చేయాలని, జిల్లాల్లో ఉన్న విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు

# హైదరాబాద్ నుండి యాదగిరిగుట్టకు ఎంఎంటిఎస్ రైలు

### ద.మ. రైల్వే జిఎంతో చర్చించిన ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ తిరుపతి అయినటువంటి యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దర్శనంకోసం వచ్చే భకుల సౌకర్యార్థం కోరకై హైదరాబాద్ నుండి రాయగిరి వరకు ఎంఎంటిఎస్ రైలును నడిపించాలని ఎంపి చామలకిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. హైదరాబాద్ నుండి రాయగిరి రైల్వే స్టేషన్ వరకు ఎంఎంటిఎస్ రైలు నడిపే విధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను తాను ఒప్పిస్తానని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అరుణ్ కుమార్‌జైన్‌కు వివరించారు. అలాగే భువనగిరి, ఆలేరు, జనగాం, రామన్నపేటలో కొనసాగుతున్న రైల్వే అభివృద్ధి పనులు, రైళ్ల రాకపోకల సమయాలు మార్పు , అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మాణాల కోసం ఇటీవలే పార్లమెంట్లో ప్రస్తావించిన పలు అంశాలు, కేంద్ర రైల్వే శాఖ మంత్రితో కలిసిన విషయాలపై సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌తో చామల కిరణ్ కుమార్‌రెడ్డి కులంకశంగా చర్చించారు. తన నియోజకవర్గంలో కొనసాగుతున్న రైల్వే పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని మేమరండం ఇచ్చారు.

# భూభారతి ద్వారా పారదర్శక భూ లావాదేవీలు: నరెడ్కో



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి ద్వారా పారదర్శకమైన, సమర్థవంతమైన భూ లావాదేవీల నిర్వహణ జరుగుతుందని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) తెలంగాణ కార్యవర్గం అభిప్రాయపడింది.హైదరాబాద్‌లో బుధవారం నరెడ్కో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంస్థ తెలంగాణ అధ్యక్షుడు విజయ సాయి మేకా మాట్లాడుతూ.. భూ భారతి తీసుకువచ్చినందుకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ''తెలంగాణలో పారదర్శకమైన, సమర్థవంతమైన భూపాలనా వ్యవస్థ దిశలో భూభారతి కార్యక్రమం ఒక పెద్ద ముందడుగు అన్నారు. దాంతో పాటుగా బిల్ నౌ అప్లికేషన్ కూడా భవనాలు, లేఅవుట్ల ఆమోదాన్ని స్ట్రీమ్ లైన్ చేయనుందని తెలిపారు. ఇది డెవలపర్లకు ప్రాజెక్టుల అమలును మరింత సులభతరం చేయనుందని ఆశాభావం వ్యక్త పరిచారు.ఈ కార్యక్రమం డెవలపర్లు, ఇన్వెస్టర్లు, కొను గోలుదారులు అందరికీ ఒకే విధంగా తిరుగులేని విలువలను అందించగలదని నరెడ్కో తెలంగాణ విశ్వసిస్తోం దని అన్నారు. ఈ విధమైన ప్రగతిశీలక సంస్కరణ యొక్క ప్రయోజనాలను గరిష్ఠస్థాయిలో రియల్ ఎస్టేట్ రంగం పొందేం దుకు వీలుగా ప్రభుత్వంతో కలసి పని చేసేందుకు నరెడ్కో తెలంగాణ కట్టుబడి ఉంది'' అని అన్నారు. ప్రపంచస్థాయి మౌలిక వసతులు, సులభంగా వ్యాపారం చేయగలగడం, ప్రణాళికాబద్ధమైన పట్టణ విస్తరణకు సంబంధించి రాష్ట్రం యొక్క విస్తృత ఆశయానికి అనుగుణంగానే నరెడ్కో కార్యక్రమం ఉందన్నారు. మౌలిక వసతుల మెరుగుదల, అన్ని దిశల్లో మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్, నాలుగో నగరం అభివృద్ధి, నూతన 350 కి.మీ. రీజనల్ రింగ్ రోడ్ అనేవి రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ఐదు డెవలప్మెంట్ ఇన్షియేటివ్స్‌గా ఉన్నాయన్నారు. వీటి కోసం రూ. 10,000 కోట్లను కేటాయించారని, ఈ ఐదు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతగానో అవసరమైన ప్రాధాన్యాన్ని తెలంగాణ ప్రభుత్వం ఇవ్వగలదని నరెడ్కో తెలంగాణ ఆశిస్తోందన్నారు. అదిరాబోయే కాలంలో రియల్ ఎస్టేట్, జిడిపి, పర్యాటక అభివృద్ధికి ఎంతో దోహదపడగలదని నరెడ్కో తెలంగాణ భావిస్తోందని ఆయన తెలిపారు. నరెడ్కో నేతలు కలి ప్రసాద్ దామోర, డాక్టర్ లియోన్ వై కిరోన్, కె.శ్రీధర్‌రెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

## మోగా ఇంజనీరింగ్‌కు
# న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ భారీ ఆర్డర్



### రూ.12,800 కోట్లతో రెండు అణు రియాక్టర్లు నిర్మించనున్న ఎంఇఐఎల్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద నిర్మించనున్న 700మెగావాట్స్ ఎలక్ట్రిక్ సామర్థ్యం కలిగిన రెండు అణు రియాక్టర్ యూనిట్ల నిర్మాణానికి సంబంధించి పర్చేజ్ ఆర్డర్‌ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఇఐఎల్) బుధవారం అందుకుంది. ముంబైలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐఎల్) సీనియర్ అధికారుల నుండి పర్చేజ్ ఆర్డర్ ను (ఎంఈఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సి.హెచ్.సుబ్బయ్య అందుకున్నారు.
కైగా వద్ద 5, 6 యూనిట్లకు సంబంధించిన రూ.12,800 కోట్ల వ్యయంతో అణు రియాక్టర్లను ఎంఈఐఎల్ నిర్మించనుంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్స్ట్రక్షన్ (ఇపిసి) విధానంలో ఎంఈఐఎల్ ఈ అణు రియాక్టర్ల నిర్మాణాన్ని చేపట్టనుంది. ఇప్పటి వరకు ఎన్‌పిసిఐఎల్ ఏకమొత్తంగా ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్ ఇదే కావడం గమన్హారం. బిహెచ్ఇఎల్, ఎల్ అండ్ టి వంటి ఇతర ప్రముఖ బిడ్డర్లతో పోటీపడి ఈ కాంట్రాక్టును ఎంఇఐఎల్ దక్కించుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఎంఇఐఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ సుబ్బయ్య మాట్లాడుతూ ఈ ప్రతిష్ఠాత్మక ఇపిసి కాంట్రాక్ట్ ఎంఇఐఎల్‌కు లభించడం, భారతదేశ ఇంధన మౌలిక సదుపాయాల అభివృద్ధికి కంపెనీ చేస్తున్న కృషిని తెలియజేస్తోందన్నారు. మొట్టమొదటిసారిగా ఈ టెండర్ ప్రక్రియలో క్వాలిటీ కమ్‌కాస్ట్‌బెస్డ్ సెలెక్షన్ (క్యూసిబిఎస్) విధానాన్ని ఎన్‌పిసిఐఎల్ అవలంబించడంతో పాటు టెండర్ కేటాయింపులో సాంకేతిక నైపుణ్యం, ఖర్చు సామర్థ్యం రెండింటినీ సమతుల్యంగా అంచనా వేసిందని తెలిపారు. తమ సంస్థ అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యానికి, పోటీ తత్వానికి ఈ కాంట్రాక్టు సాధించటం ఓ నిదర్శనం అన్నారు. కైగా అణు రియాక్టర్ల నిర్మాణ ప్రాజెక్ట్ దేశ ఇంధన భవిష్యత్తుకు కీలకమైన అణు ఇంధన రంగంలోకి తమ సంస్థ వ్యూహాత్మక ప్రవేశాన్ని సూచిస్తుందని, ఎంఇఐఎల్‌కు ఇంజినీరింగ్ నైపుణ్యం, ఆవిష్కరణల పట్ల ఉన్న నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. దేశ, విదేశాలలో పెద్ద ఎత్తున ఇపిసి ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తిచేసిన బలమైన ట్రాక్ రికార్డు ఉందని, అణు శక్తి రంగంలో మన దేశ స్వావలంబనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించడానికి ఎంఇఐఎల్ సిద్ధంగా ఉందని సుబ్బయ్య తెలిపారు.

ప్రజాపక్షం
గురువారం, ఏప్రిల్ 24

# పహల్గాం పెనువిషాదం

జమ్మూ–కశ్మీర్‌లో టెర్రరిజం మళ్లీ పడగవిప్పింది; మంగళవారం ఉదయాన సుందర పహల్గాం లోని బైసారన్ పచ్చిక బయళ్లలో తచ్చాడుతూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్న పర్యాటకులపై ఉగ్రవాదుల తుపాకుల నిప్పులు వర్షించాయి. 28మంది అమాయకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రమైన గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్సపొందుతున్నారు. ముస్లిం టెర్రరిస్టుల బృందం పర్యాటకుల్లోని హిందువులను ఎంచుకుని కాల్పులకు గురిచేసిన మారణకాండ అనూహ్యం, అమానుషం. స్త్రీలుండగే పురుషుల లోదుస్తులు ఊడదీయించి హిందువులు అవునోకాదో నిర్ధారించుకున్నారన్న వార్తలు – ఉగ్రవాదులు వారి మార్గదర్శ ఆదేశాలపై ముందస్తు పథకం ప్రకారం ఈ రాక్షస కృత్యానికి పాల్పడినట్లు విదితం చేస్తున్నాయి. హిందూ పర్యాటకులను ఎంచుకుని చంపటంలో వారి ఉద్దేశం మన దేశంలో మత కలహాలు ప్రేరేపించటంగా స్పష్టమవుతున్నది. ఈ ఘోరకలి యావత్ భారత ప్రజలను బాధించింది, ప్రతీకారేచ్ఛను రగిల్చింది. జమ్మూ–కశ్మీర్‌కు ఆర్టికల్ 370 రద్దు తదుపరి ఎంతో అభివృద్ధిచేశాం, శాంతి–భద్రతలు ఎంతో మెరుగైనాయని భారత ప్రభుత్వ క్లెయిములను వమ్ము చేయటం ఈ దాడి ఉద్దేశ్యమా? అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ భారత్‌లో పర్యటిస్తుండగా, ప్రధానమంత్రి సౌదీ అరేబియా పర్యటనలో ఉండగా ఈ దాడి జరిగింది. హోంమంత్రి అమిత్ షా వారం రోజుల క్రితమే జమ్మూ–కశ్మీర్ భద్రతను సమీక్షించాక ఈ భద్రతా భంగం జరిగింది. భారత నాయకత్వాన్ని సవాలు చేస్తున్నట్లున్న ఈ మానవ సంహారం – వెనువెంటనే 2019 ఫిబ్రవరి 14 న జెయిషే ఆత్మాహుతిదళ సభ్యుడొకడు మందుగుండు నింపిన ట్రక్కును పుల్వామా లోని లెత్‌పోరాలో సిఆర్‌పిఎఫ్ శకటాల బారుకు గుద్దించి ఆ పేలుడులో 40మంది పారామిలిటరీ సిపాయిలను హతమార్చిన, డజన్‌కొలది గాయపరిచిన ఘోర సంఘటన ప్రజల మనసుల్లో మెదిలించింది. ఆ ఘటన దేశప్రజల్లో జాతీయోన్మాదాన్ని ఉద్దీప్తం చేసింది. ప్రభుత్వం సర్జికల్ దాడితో ప్రతీకార చర్య తీసుకుంది. ఈ తదుపరి చెదురుమదురు దాడులు అనేకం జరిగాయి. జమ్మూ–కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు జమ్మూప్రాంతం పర్వత శ్రేణుల్లో కొన్ని నెలలపాటు టెర్రరిస్టుల కదలికలు, దాడులు చూశాం. ఇటీవల కూడా అడపాదడపా ఘటనలు జరిగాయి. కాని పహల్గాం వంటి ఆర్గనైజ్డ్, టార్గెటెడ్ దాడిని, ఊచకోతను ఊహించటంలో, ముందు జాగ్రత్తలు తీసుకోవటంలో మన భద్రతా వ్యవస్థ విఫలమైంది.

పాకిస్తాన్ ప్రభుత్వం లేక ఐఎస్ఐ ప్రమేయం, ప్రోత్సాహం లేకుండా ఏవో టెర్రరిస్టు గ్రూపులు ఈ దాడికి తెగించాయని ఊహించలేము. పాక్ సైన్యాధిపతి ఆసం మునీర్ కరడుగట్టిన హిందూ వ్యతిరేకి. "ముస్లిం టెర్రరిస్టులు – పహల్గాం హిందూ పురుష టూరిస్టులను కాల్చిచంపారని" ఆయన చేసిన ప్రకటనే ఆయన దుర్మార్గపు దృష్టిని వెల్లడిస్తున్నది. ఆయన 10 రోజుల క్రితమే 'ద్విజాతి సిద్ధాంతం' గూర్చి, హిందూ–ముస్లిం వ్యత్యాసాల గూర్చి మాట్లాడారు – ఏప్రిల్ 22 న పహల్గాం ఘోరం జరిగింది. ఆయనకు ప్రధాని షా బాజ్ షరీఫ్‌తో సఖ్యత లేదు. మునీర్ తన ఆథారిటీని పక్కాచేసుకోవటానికి ఈ దాడిని ప్రేరేపించారన్న అనుమానాలు లేకపోలేదు.

ఈ ముష్కరదాడి ప్రపంచ దేశాలను దిగ్భ్రాంతి పరిచింది. ట్రంప్, పుతిన్ సహా ఎందరో ఖండించారు. టెర్రరిస్టు వ్యతిరేక పోరాటంలో భారత్‌కు సంఘీభావం తెలియజేశారు. బాధితుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. సౌదీ అరేబియానుంచే హోంమంత్రి అమిత్ షాను సత్వర సహాయక చర్యలకు ఆదేశించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తమ పర్యటనను అర్థంతరంగా ముగించుకుని తిరిగి వచ్చారు. కశ్మీర్‌లో ఒకరోజు విషాదఛాయలు అలుముకుని ఉండగానే ఢిల్లీలో భద్రతా పరమైన చర్చలు ఊపు అందుకున్నాయి. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ త్రివిధ దళాధిపతులతో భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో భద్రతా సమావేశం జరిపారు. ప్రతీకారం తప్పదని హెచ్చరించారు. సాయంత్రం ప్రధానమంత్రి అధ్యక్షతన భద్రతా వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. ప్రభుత్వం నుండి తీవ్రమైన ప్రతీకార చర్య తప్పదన్న ఊహాగానాలను మీడియా ప్రచారం చేస్తోంది. అయితే పాకిస్తాన్‌పై ఎలాంటి ప్రతీకార చర్య ఏమిటి? ఎప్పుడు, ఎలా? అన్నది పెద్ద ప్రశ్న. ఏదో నిర్ణయాత్మక చర్య అవసరమన్న ప్రజల ఆక్రోశభావనే మనోభావం. అయితే కశ్మీర్‌లో టెర్రరిజానికి ఈ దాడి ఆరంభం లేదా అంత్యం కాదు. అందువల్ల జాగ్రత్తగా ఆలోచించి దౌత్యపరంగా, సైనికంగా, క్షేత్రస్థాయిలో చర్యలు అవసరం.

# రాష్ట్రపతి, గవర్నర్‌లకు 'సుప్రీం' సమయోచిత సూచన



దుష్యంత్ దవే
సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది

తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ తమిళనాడు గవర్నర్ (2025) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సరైన రీతిలో రాజ్యాంగ స్థానాన్ని తెలియజేసింది. అది తిరుగులేనిది. అయితే, కొంతమంది ఈ తీర్పును ప్రశ్నించారు. వారికి నా సమాధానం ఏమిటంటే, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగమే సృష్టించింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 1948 నవంబర్ 4న పేర్కొన్నట్లుగా, 'పార్లమెంటరీ వ్యవస్థ, కార్యనిర్వాహకవర్గం మరింత స్థిరత్వం కంటే మరింత బాధ్యతను కలిగి ఉండాలని ముసాయిదా రాజ్యాంగం సిఫార్సు చేసింది.' తన అభిప్రాయాన్ని మరింత విస్తారంగా ఆయన వివరిస్తూ, 'అమెరికా ప్రభుత్వ నమూనాను అధ్యక్ష తరహా ప్రభుత్వం అంటారు. ముసాయిదా రాజ్యాంగం ప్రతిపాదించేది పార్లమెంటరీ వ్యవస్థ... అమెరికా అధ్యక్ష తరహా ప్రభుత్వంలో, అధ్యక్షుడు కార్యనిర్వాహక విభాగానికి అధిపతి. పరిపాలన ఆయన ఆధీనంలో ఉంటుం ది. ముసాయిదా రాజ్యాంగం ప్రకారం ఇంగ్లాండ్ రాజ్యాంగంలోని రాజు స్థానాన్నే రాష్ట్రపతి కలిగి ఉంటారు. ఆయన దేశాధినేత అయినప్పటికీ కార్యనిర్వాహక విభాగానికి అధిపతి కాదు. ఆయన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు కానీ దేశాన్ని పరిపాలించరు. ఆయన దేశానికి చిహ్నం. పరిపాలనలో ఆయన స్థానం, దేశ నిర్ణయాలు తెలియజేయడానికి ఉపయోగించే ఒక లాంఛనప్రాయమైన ముద్ర వంటిది... భారత యూనియన్ అధ్యక్షుడు సాధారణంగా తన మంత్రుల సలహాకు కట్టుబడి ఉంటారు. వారి సలహాకు విరుద్ధంగా లేదా వారి సలహా లేకుండా ఆయన ఏమీ చేయలేరు.'' రాజ్యాంగంలోని అధికరణ 52 ఇదే వైఖరిని ధృవీకరిస్తుంది. ఆ అధికరణలో 'భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉండాలి' అని, అధికరణ 153 'ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉండాలి' అని పేర్కొంటుంది.

అధికరణ 74 'ప్రధానమంత్రి నేతృత్వంలోని మంత్రి మండలి రాష్ట్రపతికి సహాయం చేయడానికి , సలహా ఇవ్వడానికి 'ఏర్పాటు అవుతుంది', అధికరణ 163 'గవర్నర్‌కు సహాయం చేయడానికి, సలహా ఇవ్వడానికి ముఖ్యమంత్రి నేతృత్వంలోని మంత్రి మండలి ఏర్పాటు అవుతుంది.''

1949లో ముసాయిదా రాజ్యాంగం ఇది సూచనల పత్రంగా ఉపయోగపడాలని ఉద్దేశించి, దీనిని ఏడవ షెడ్యూల్‌లో చేర్చాలని ప్రతిపాదించింది. అయితే, ముసాయిదా కమిటీ సూచన మేరకు ఇది తొలగించబడింది. ఈ తొలగింపును సభ్యులు వ్యతిరేకించారు, కానీ టి.టి.కృష్ణమాచారి సమర్థించారు.'సూచనల పత్రాల రూపంలో రాజ్యాంగంలో షెడ్యూల్‌లో చేర్చడానికి బదులుగా, ఈ విషయాన్ని పూర్తిగా సంప్రదాయానికి విడిచిపెట్టాలని ఇప్పుడు భావిస్తున్నారు, ఆ ఆలోచనను బలపరిచే అభిప్రాయాలు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నాయి.'' డాక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, 'మన రాజ్యాంగం ప్రకారం, గవర్నర్ ఈ సూచనల పత్రాలను నమ్మకంగా అమలు చేస్తున్నారా అని పర్యవేక్షించే కార్యనిర్వాహకులు ఎవరూ లేరు. రెండవది, ఈ రాజ్యాంగం ప్రకారం గవర్నర్‌కు మనం వదిలివేయబోయే విచక్షణాధికారం చాలా తక్కువ. మంత్రివర్గ సభ్యుల ఎంపిక విషయంలో ఆయన ప్రధానమంత్రి సలహా మేరకు వ్యవహరించాలి.'

ఇంతకుముందు, అధికరణ 52పై చర్చిస్తున్నప్పుడు, రాజ్యాంగ పరిషత్ కె.టి.షా ప్రతిపాదించిన ముసాయిదా అధికరణ 41 (ఇప్పుడు అధికరణ 52)కి ప్రతిపాదించిన సవరణను తిరస్కరించింది, దాని సారాంశం: 'భారత యూనియన్‌లోని ముఖ్య కార్యనిర్వాహకుడిని, రాజ్యాధినేతను భారత రాష్ట్రపతి అని పిలుస్తారు.' ప్రొఫెసర్ షా దీనిని సమర్థిస్తూ, రాష్ట్రపతి 'మొత్తం ప్రజల, మొత్తం దేశ సార్వభౌమాధికారానికి ప్రాతినిధ్యం వహిస్తారని' అన్నారు. కానీ డాక్టర్ అంబేద్కర్ దీనిని వ్యతిరేకిస్తూ, 'ప్రొఫెసర్ కె.టి. షా' ముఖ్య కార్యనిర్వాహకుడు, రాజ్యాధినేత' అనే పదాలను ఉపయోగిస్తున్నారు. ఆయన ఉద్దేశం ఈ ముసాయిదా రాజ్యాంగంలో ఉన్న పార్లమెంటరీ తరహా కార్యనిర్వాహక వ్యవస్థ కాకుండా అమెరికన్ అధ్యక్ష తరహా కార్యనిర్వాహక వ్యవస్థను ప్రవేశపెట్టడమని నేను నిస్సందేహంగా చెప్పగలను. నా స్నేహితుడు ప్రొఫెసర్ షా యూనియన్ రాజ్యాంగ కమిటీ నివేదికను పరిశీలిస్తే, ముసాయిదా కమిటీ ఆ కమిటీ నివేదికలో పేర్కొన్న ప్రతిపాదనలను అనుసరించిందని ఆయనకు తెలుస్తుంది. ఆ కమిటీ నివేదిక ప్రకారం, రాష్ట్రపతి కార్యనిర్వాహక శాఖకు అధిపతిగా ఉన్నప్పటికీ, ఆయనకు రాజ్యాంగం ద్వారా ఇవ్వబడిన అధికారాల ప్రకారం ఆయన చేపట్టాల్సిన అన్ని చర్యలలోనూ మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉండాలి. ఆయన సంపూర్ణ సర్వాధిపతి కాదు... అది యునైటెడ్ స్టేట్స్‌లోని పార్లమెంటరీ తరహా ప్రభుత్వం... మనం ఆ వ్యవస్థను స్వీకరించలేదు.'

రాజ్యాంగ ధర్మాసనం షంషేర్ సింగ్ వర్సెస్ పంజాబ్ రాష్ట్రం (1974) కేసులో ఈ అభిప్రాయాన్ని బలపరుస్తూ, రాష్ట్రపతి '...యూనియన్‌కు రాజ్యాంగ లేదా లాంఛనప్రాయ అధిపతి. ఆయన రాజ్యాంగం ద్వారా లేదా దాని ప్రకారం తనకు సంక్రమించిన అధికారాలు, విధులను తన మంత్రి మండలి సహాయం, సలహా మేరకు నిర్వహిస్తారు' అని పేర్కొంది. తదుపరి ఈ తీర్పునే నబామ్ రెబియా వర్సెస్ డిప్యూటీ స్పీకర్ (2016) కేసులో మరో రాజ్యాంగ ధర్మాసనం కూడా అనుసరించింది.

## తగు సమయంలో గుర్తు చేసిన సుప్రీంకోర్టు

రాష్ట్రపతి , గవర్నర్ తమ కార్యనిర్వాహక అధికారాన్ని రాజ్యాంగానికి అనుగుణంగా వినియోగించాలి. ప్రతి అధికారం దాని ఉద్దేశించిన ప్రయోజనం కోసం సహేతుకమైన వ్యవధిలో వినియోగించాల్సిన బాధ్యతతో కూడి ఉంటుంది. అలా చేయకపోతే, దానిని అలా వినియోగించాలని ఆదేశించేందుకు రిట్ కోర్టుకు బాధ్యత ఉంది. అధికరణ 60 ప్రకారం రాష్ట్రపతి, అధికరణ 159 ప్రకారం గవర్నర్ రాజ్యాంగ ప్రమాణాలు తీసుకొని, తమ శక్తి మేరకు 'రాజ్యాంగాన్ని, చట్టాన్ని పరిరక్షించడానికి, రక్షించడానికి, సమర్థించడానికి', 'భారత దేశ ప్రజల లేదా రాష్ట్ర ప్రజల సేవకు, శ్రేయస్సుకు' తమకు తాము 'అంకితం చేసుకుంటూ' ప్రతిజ్ఞ చేస్తారు. అలాంటప్పుడు ఏ రాష్ట్రపతి లేదా గవర్నర్ అయినా రాజ్యాంగాన్ని ధిక్కరించి ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఎలా వ్యవహరించగలరు?

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము తన పదవి గౌరవాన్ని కాపాడుతున్నప్పటికీ, కొంతమంది గవర్నర్‌లు తాము చేపట్టిన ఉన్నత రాజ్యాంగ పదవులను కించపరిచే విధంగా ప్రవర్తించారు. కాబట్టి రాజ్యాంగాన్ని గౌరవించాలని, దానికి కట్టుబడి ఉండాలని, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించాలని రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీంకోర్టు సమయోచితంగా గుర్తు చేసింది.

(ది హిందూ సౌజన్యంతో)

అమెరికా అధ్యక్ష తరహా ప్రభుత్వంలో, అధ్యక్షుడు కార్యనిర్వాహక విభాగానికి అధిపతి. పరిపాలన ఆయన ఆధీనంలో ఉంటుంది. ముసాయిదా రాజ్యాంగం ప్రకారం ఇంగ్లాండ్ రాజ్యాంగంలోని రాజు స్థానాన్నే రాష్ట్రపతి కలిగి ఉంటారు. ఆయన దేశాధినేత అయినప్పటికీ కార్య-నిర్వాహక విభాగానికి అధిపతి కాదు. ఆయన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు కానీ దేశాన్ని పరిపాలించరు. ఆయన దేశానికి చిహ్నం. పరిపాలనలో ఆయన స్థానం, దేశ నిర్ణయాలు తెలియజేయడా-నికి ఉపయోగించే ఒక లాంఛన ప్రాయమైన ముద్ర వంటిది...



అధికరణ 60 ప్రకారం రాష్ట్రపతి, అధికరణ 159 ప్రకారం గవర్నర్ రాజ్యాంగ ప్రమాణాలు తీసుకొని, తమ శక్తి మేరకు 'రాజ్యాంగాన్ని, చట్టాన్ని పరిరక్షించడానికి, రక్షించడానికి, సమర్థించడానికి', 'భారతదేశ ప్రజల లేదా రాష్ట్ర ప్రజల సేవకు, శ్రేయస్సుకు' తమకు తాము 'అంకితం చేసుకుంటూ' ప్రతిజ్ఞ చేస్తారు. అలాంటప్పుడు ఏ రాష్ట్రపతి లేదా గవర్నర్ అయినా రాజ్యాంగాన్ని ధిక్కరించి ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఎలా వ్యవహరించగలరు?

# ఆరోగ్యాన్ని హరిస్తున్న ఆధునిక జీవనశైలి



డా.అట్ల శ్రీనివాస్ రెడ్డి,
9703935321

పెరుగుతున్న జీవనశైలి వ్యాధులు అన్ని వయస్సుల ప్రజల జీవితం మీద ప్రభావం చూపుతున్నాయి. పాతతరం జీవనశైలిలో భౌతిక శ్రమ ఎక్కువగా ఉండేది, కానీ ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ తక్కువవుతుంది. దీని ప్రభావంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యం గా మన దేశంలో అకాల మృతులకు 60శాతం వరకు జీవనశైలి వ్యాధులే కారణమవుతున్నాయి. ఆధునికత పేరు చెప్పి మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నాం. మన చేతుల చేత మన ఆరోగ్యాన్ని తుడిచిపెడుతున్నాం. జీవనశైలి వ్యాధులలో ముఖ్యంగా గుండెజబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలు అధికంగా ఉన్నాయి. ఫాస్ట్ ఫుడ్, శారీరక వ్యాయామం లోపం, తినే విధానం, ఒత్తిడిగల జీవనశైలి ఇవన్నీ ముఖ్య కారణాలు. మహానగరాల్లో జీవించే ప్రజల్లో ఈ వ్యాధులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. నలభై ఏళ్ల లోపే హార్ట్ ఎటాక్‌లు వస్తుండటం కేవలం జీవనశైలిలో మార్పుల వల్లే జరుగుతోంది.





**మనుషులు ఆరోగ్యాన్ని తాకట్టు పెట్టారు:** ఆహార అలవాట్లలో మార్పు, ఫిజికల్ యాక్టివిటీ లోపం, ఒత్తిడి మరియు నిద్రలేమి వల్ల నానాటికీ జీవనశైలి వ్యాధులు పెరిగిపోతున్నాయి. ఆధునిక జీవనశైలిలో మానవుడు ఆరోగ్యాన్ని తాకట్టు పెడుతున్నాడు. గ్యాడ్జెట్లు, బిజీ షెడ్యూల్స్, ఆరోగ్యంపై నిర్లక్ష్యం వంటి వాటితో పాటు, స్మార్ట్‌ఫోన్ వినియోగం కూడా దీనిమీద ప్రభావం చూపుతోంది. జీవనశైలి మార్పులు శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తున్నాయి. మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు కొన్ని చిట్కాలు ముఖ్యమైనవి: రోజూ ఒకే సమయానికి నిద్ర, భోజనం, కార్యాచరణ ఉండేలా జీవనశైలి సజావుగా ఉండాలి. కనీసం 30 నిమిషాల వ్యాయామం లేదా యోగా, ప్రాణాయామం చేయడం మనశ్శాంతికి దోహదం చేస్తుంది. ధ్యానం మరియు శ్వాస నియంత్రణ తో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఆహారంలో పండ్లు, కూరగాయలు, ఒమేగా3 వంటివి చేర్చాలి. నిద్ర పరిపూర్ణంగా ఉండేలా చూసుకోవాలి (7–8 గంటలు అవసరం). స్నేహితులు, కుటుంబ సభ్యులతో అనుబంధం కొనసాగించాలి. సెల్‌ఫోన్ వినియోగాన్ని నియంత్రించాలి. కళలకు అవకాశమివ్వడం ద్వారా భావోద్వేగాల్ని సమతుల్యంగా ఉంచుకోవచ్చు. ఈ చిట్కాల వల్ల మనస్సు ఆరోగ్యంగా ఉండటమే కాక, జీవితం సంతృప్తికరంగా మారుతుంది.

**ఒత్తిడితో బతుకు చిద్రమవుతోంది :** ప్రస్తుత ఆధునిక జీవన శైలి మనిషిని ఓ యంత్రంగా మార్చేసింది. పనుల ఒత్తిడి, సమయపు తగ్గుదల, సామాజిక ఒత్తిళ్లు అన్నీ కలిసివచ్చి మనుషులను అంతర్ముఖులుగా మార్చేస్తున్నాయి. నిత్యం పరుగులు పెట్టే జీవితంలో మనసుకు తృప్తి లేక, శరీరానికి విశ్రాంతి లేకుండా పోతోంది. ఈ ఒత్తిడిలో శ్వాస కూడా భారంగా అనిపించడం మనిషికి సాధారణంగా మారిపోతోంది. ఒత్తిడి వల్ల మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయి, ఆరోగ్యం పాడవుతోంది, ఆనందం దూరమవుతోంది. ఆర్థిక విజయాల కోసం కష్టపడుతూ, మనిషి తనే నిస్సారంగా మారుతున్నాడు. భౌతిక విజయం కోసం పరిగెత్తే ఈ యుగంలో, మనస్సుకు నయం కలిగించే ప్రశాంతత అరుదైపోతోంది. ఈ పరిస్థితుల్లో మన మానసిక ఆరోగ్యాన్ని సంరక్షించుకోవడం అత్యవసరం.

**మానసిక ప్రశాంతత అత్యవసరమైన ఔషధం :** ప్రజలు తమ జీవనశైలిని పునఃపరిశీలించాలి. రోజూ క్రమంగా వ్యాయామం, సమతుల్య ఆహారం, సరైన నిద్ర, మానసిక శాంతి కోసం యోగా, ధ్యానం లాంటి కార్యక్రమాలను అనుసరించాలి. ప్రభుత్వం, ఆరోగ్య శాఖ ఈ విషయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అలాగే కుటుంబ సభ్యుల మద్దతు, ప్రోత్సాహం కూడా ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ప్రజలందరూ తమ జీవనశైలిని మెరుగుపరచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. నవ్వు జాడలేని ముఖాలు, నిరాశతో నిండిన కన్నులు. ఇవే ఆధునిక జీవితం గుర్తులు. ఈ బతుకు జట్కాబండిలో ఏం కోల్పోయామో నెమ్మదిగా తెలుసుకుంటున్నాం. కానీ చాలా ఆలస్యం అయిన తర్వాత ఒత్తిడిలో మునిగిపోయిన ఈ సమాజానికి, ఓ కాసింత మానసిక ప్రశాంతత ఇప్పుడు అత్యవసరమైన ఔషధం.

# రెనాల్ట్ కొత్త డిజైన్ సెంటర్

రెనాల్ట్ ఇండియా, రెనాల్ట్ గ్రూప్‌కి పూర్తిగా చెందిన అనుబంధ సంస్థ మంగళవారం చెన్నైలోని రెనాల్ట్ డిజైన్ సెంటర్ ప్రారంభోత్సవంతో పాటు, భారత్‌కేంద్రంగా తన కొత్త పరివర్తన వ్యూహం 'రెనాల్ట్, రీథింకా'ను ఆవిష్కరించింది.

చెన్నైలో ఈ రోజు ప్రారంభించిన కొత్త రెనాల్ట్ డిజైన్ సెంటర్, ఈ పరివర్తనకు శుభారంభం చేకూర్చడంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా, 'మేక్ ఇన్ ఇండియా' ఫౌండేషన్‌కు అనుగుణం గా 'డిజైన్ ఇన్ ఇండియా' అనే రెనాల్ట్ ఆశయా న్ని వేగవంతం చేయడంలో కూడా ప్రధాన భూమిక పోషిస్తుంది. ఇది ప్రత్యేకంగా RNTBCI (రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ & బిజినెస్ సెంటర్ ఇండి యా) సమీపంలో ఉన్నందున, ఈ సెంటర్‌ను ఒక శ్రేష్ఠతా కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యం గా పెట్టుకుంది.


రెనాల్ట్ ఇండియా తన బ్రాండ్ పరివర్తన వ్యూహాన్ని ప్రకటించింది, ఇది భారతదేశంలో 'ఇంటర్నేషనల్ గేమ్ ప్లాన్ 2027' అమలుకు ఒక కీలక దశగా నిలుస్తుంది.

ఈ చొరవ ఫ్రాన్స్ వెలుపల అతిపెద్ద డిజైన్ సెంటర్‌ను ప్రారంభించడంతో మొదలైంది, ఇది 'డిజైన్ ఇన్ ఇండియా' పట్ల రెనాల్ట్ దృష్టిని మరింత వేగవంతం చేస్తుంది.

యూరోపియన్ మరియు భారతీయ డిజైన్ల సామరస్యపూర్వక సమ్మేళనాన్ని ప్రతిబింబించే ఈ డిజైన్ సెంటర్ – 'స్పర్శ కలయిక'గా నిర్వచించబడింది – ఇది సొగసైన, ఆధునిక యూరోపియన్ శైలిని విభిన్న భారతీయ సాంస్కృతిక ప్రభావాలతో సమ్మిళితం చేస్తూ, ఒక ప్రేరణాత్మకమైన మరియు అర్థవంతమైన పని వాతావరణాన్ని సృష్టిస్తుంది.

ఈ కేంద్రం రెనాల్ట్ భవిష్యత్ మొబిలిటీ పరిష్కారాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించనుంది. లారెన్స్ వాన్ డెన్ అకర్, చీఫ్ డిజైన్ ఆఫీసర్, రెనాల్ట్ గ్రూప్, వెంకట్రామ్ మామిళ్లపల్లి, కంట్రీ సిఇఒ మరియు మేనేజింగ్ డైరెక్టర్, రెనాల్ట్ ఇండియా ఆపరేషన్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉగ్రమూకల పైశాచికానందం ఇంకానా!



సుంకవల్లి సత్తిరాజు
9704903463

అమెరికా,రష్యా లాంటి అగ్రరాజ్యాల ఖండనలతో, సానుభూతి వచనాలతో భారత్ లో ఉగ్రవాదుల ఆగడాలు ఆగునా? సుమారు ఏడున్నర దశాబ్దాలుగా భారత్ లో ఉగ్రవాదులు సాగిస్తున్న నరమేధం నిలువరింపబడుతుందా? అమెరికా,రష్యా దేశాల మాదిరిగా ఉగ్రవాదులను అంతమొందించే శక్తి సామర్థ్యాలు భారత్ కు లేవా? అనే ప్రశ్న ప్రస్తుతం దేశ పౌరుల మదిలో అంకురిస్తున్నది. భారత్ ను ఇబ్బందులు పెడుతున్న ఉగ్రవాదుల మదమణిచే చర్యకు భారత్ పూనుకుంటుందా? అందమైన కాశ్మీరం ఆనందంలో మునిగి తేలుతుండగా,ప్రకృతి పారవశ్యంలో పర్యాటకులు ఆనంద డోలికల్లో విహరిస్తుండగా మానవత్వం మచ్చుకైనా కానరాని ముష్కరుల తూటాలకు పాతికమంది పైగా మృత్యువు ఒడికి చేరారు. అమాయకుల రుధిరంతో పచ్చని పహల్గాం ఎరుపెక్కింది. అమర్ నాథ్ యాత్రకు శ్రీకారం పలుకుతున్న కాశ్మీర్లోని పహల్గామ్ పేరొందిన పర్యాటక కేంద్రం. ఇదొక హిల్ స్టేషన్. పహల్గాం బైసరన్ లోయ స్విట్జర్లాండ కు ప్రతిరూపంగా పేర్కొంటారు. ఆహ్లాదకరమైన వాతావరణంతో మదిని పులకరింప చేసే అందమైన పర్యాటక ప్రాంతం ముష్కరుల నరమేధంతో మూగబోయింది.



ప్రాణాలు కోల్పోయిన వారి బంధువుల ఆక్రందనలు మిన్నంటాయి. క్షతగాత్రుల దేహాలు రక్తంతో తడిసిపోయాయి. బైసరన్ లోయలో అందమైన ప్రకృతి అలజడికి లోనై విలపించింది. పర్యాటకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓలలాడుతుండగా ఓర్వలేని ఉగ్రమూక పంజా విసిరి, 28 మంది పర్యాటకులను కర్కశంగా బలితీసుకుంది. దొంగే దొంగ అన్నట్టుగా...ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూ, భారత్‌పై గత 77 సంవత్సరాలుగా అనునిత్యం కయ్యానికి కాలుదువ్వుతున్న పాక్ ప్రేరిత ఉగ్రవాదంపై ప్రపంచం దృష్టి సారించక పోవడమే ఈ నర మేధానికి కారణం. ప్రపంచమంతా ఉగ్రవాదాన్ని అసహ్యించుకుంటున్నా 'నవ్విపోదురు గాని నాకేటి సిగ్గు' అనే రీతిలో బరితెగించి, అమాయక ప్రజలను కాల్చి చంపుతున్న ఉగ్రవాదులు నేటి ఆధునిక సమాజంలో జీవించడానికి అనర్హులు. ఉగ్రవాద మూకలతో అంటకాగుతూ పాము పడగ నీడలో నిద్రపోవాలనే ఆలోచన రావడమే పాక్ మూర్ఖత్వం. ఉగ్రవాదులకు అండగా నిలబడుతూ పాక్ సాధించేదేమీ ఉండదు. ప్రస్తుతం పాక్ అస్థిత్వానికే ముప్పు ఏర్పడింది. పాక్ పతనమౌతూ, భారత్ ను నాశనం చేయడానికి ప్రయత్నించడం' తాను చెడిన కోతి వనమంతా చెడగొట్టిన...' చందంగా ఉంది. అపారమైన ఖనిజ వనరులతో అలరారుతున్న బలూచిస్తాన్ ను చైనాకు అప్పగించే విధంగా ఆర్థిక కారిడార్ నిర్మాణానికి చైనాకు పాక్ అనుమతినిచ్చి, భారత్ సమగ్రతను ప్రశ్నార్థకం చేయబూనడం క్షమార్హం కాదు. ఆర్థిక పతనంతో పాక్ ప్రజలకు భిక్షాటనను ఒక వృత్తిగా ప్రవేశ పెట్టిన పాకిస్తాన్ స్వయంగా అమ్మకానికి సిద్ధంగా ఉన్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. పాక్ లో ఏర్పడిన ఆర్థిక సంక్షోభమే దీనికి ఒక కారణం కావచ్చు. వ్యక్తులను, వ్యవస్థలను నిర్వీర్యం చేసి, ఆర్థిక మూలాలను ధ్వంసం చేయడమే కాకుండా అమాయక ప్రజల ప్రాణాలను అలవోకగా బలి తీసుకుంటూ,నిరంతరం అశాంతిని ప్రజ్వలింపచేస్తున్న పాక్ పాలకుల దుర్నీతిని ప్రపంచమంతా ఏవగించుకుంటున్నది. మానవత్వం నశించిన కరడు గట్టిన పైశాచిక వాదులను సమూహాలుగా ఏర్పాటు చేసి, ఇతర దేశాల్లోమారణహోమం సృష్టించడమే ధ్యేయంగా ఏర్పాటయిన విధ్వంసకారక సంస్థలే ఉగ్రవాద సంస్థలు.

కరడు గట్టిన రాక్షసత్వమే నైజంగా బ్రతికే ఉగ్రవాదులను విప్లవకారులుగా,సంస్కర్తలుగా కీర్తించే దేశాలకు, వారు సాగించే ఘోరహింసాకాండకు ఆర్థికంగా, నైతికంగా సహకరించే దేశాల అనైతిక పోకడలు అసహ్యించుకోతగినవి. చాలామంది ఉగ్రవాదులకు తమ కార్యకాలాపాలకు సంబంధించి సహేతుకమైన కారణం కనిపించదు. కొంతమంది ప్రోద్భలంతోనో, వారిచేత ప్రేరేపించబడిన తీవ్రమైన మానసిక భావజాలంతోనో ఉగ్రవాదులుగా మారిన వారు కొందరైతే...ఉగ్రవాద శిబిరాలను నడుపుతూ ఇతర దేశాల నుండి ఇబ్బడి ముబ్బడిగా వచ్చి పడుతున్న ధన,కనక,వస్తువాహనాలపై మోజుపడి స్వార్థ పూరితమైన లక్ష్యాలతో ఉగ్రవాదులను పెంచి పోషించే వారు మరికొందరు. ఉగ్రవాదం కూడా కొంతమందికి ఉపాధినిచ్చే ముడిసరుకుగా మారడం అత్యంతహేయం.

ఆంగ్లేయుల విభజనవాదంతో భారతదేశ విభజన జరిగిన మాట వాస్తవం. చైనా,ఇండియా, ఆఫ్ఘనిస్తాన్,ఇరాన్,అరేబియా సముద్రం సరిహద్దులుగా ఉన్న పాకిస్తాన్ 1947లో భారత్ నుండి విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. మహమ్మదాలీ జిన్నా నాయకత్వం లోనే భారత దేశం మత ప్రాతిపదికన విడిపోయింది. పాక్ ఒక స్వతంత్ర ఇస్లామిక్ దేశంగా ఏర్పడింది. పాక్ స్వతంత్ర దేశంగా అవతరించినా భారత్‌పై నిరంతరం కయ్యానికి కాలు దువ్వుతూనే ఉంది. పాక్ పాలకుల దుశ్చర్యలతో విసిగి పోయిన ఆ దేశ ప్రజల్లో అసహనం పెరిగిపోయింది.పాక్ ప్రజల్లో గూడుకట్టుకున్న స్వతంత్ర కాంక్ష ఉవ్వెత్తున లెగిసింది. బలూచిస్తాన్, సింధ్ ప్రాంతాలు పాక్ నుండి స్వేచ్ఛను కోరుకుంటూ స్వతంత్ర దేశాలుగా విడిపోవడానికి ప్రయత్నిస్తున్నాయి. ఖబర్ పఖ్తుంఖ్వా ప్రాంతం ఆఫ్ఘనిస్తాన్ లో విలీనమయ్యే అవకాశముంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ భారత్ లో విలీనమయ్యే రోజులు దగ్గరలో ఉన్నాయి. ఈ పరిస్థితి నుండి గట్టెక్కడం చేతగాక ప్రజల దృష్టిని,ప్రపంచం దృష్టిని మరల్చడానికి కాశ్మీర్ లో రక్తపాతం సృష్టించడానికి నిరంతరం విధ్వంస ప్రణాళికలు రచిస్తూ, అమాయప్రజల రుధిరాన్ని ఆస్వాదిస్తూ, కర్కశ మూకల వికృత ఆగడాలకు అడ్డాగా మారి,లష్కరే తోయిబా వంటి అనుబంధ ఉగ్రవాద సంస్థలకు ఊతమిస్తున్న దాయాది దేశం తమ పాపకృత్యాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

భారత్ ను ఇబ్బందుల పాలు చేస్తున్న పాక్ కు కాలమే తగిన సమాధానం చెప్పాలి. రక్తపాతం ఏనాటికీ సమస్యలకు పరిష్కారం కాదన్న సత్యం త్వరలోనే పాక్ కు అవగతమవుతుంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ ప్రజలు తమ భూభాగాలను భారత్ లో విలీనం చేయాలని కోరుకుంటున్న తరుణంలో పాక్ పై భారత్ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. పాక్ ఆక్రమిత కాశ్మీర్ లేకుండా జమ్మూ కాశ్మీర్ పరిపూర్ణత్వం కాలేదని, త్వరలో పి.ఓ.కె భారత్ లో విలీనమౌతుందని భారత విదేశాంగ మంత్రి జై శంకర్ కొద్దినెలల క్రిందట పేర్కొనడం ఈ సందర్భంగా గమనించాలి. రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కూడా పిఓకె ప్రజలను పాకిస్తాన్ విదేశీయులుగా భావించి చిన్న చూపు చూస్తున్నదని, తమ దేశంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ విలీనమైతే స్వంత ప్రజల్లా చూస్తామని చెప్పడాన్ని బట్టి చూస్తే త్వరలోనే భారత్ లో పాక్ ఆక్రమిత కాశ్మీర్ విలీనం కావడం ఖాయమని అవగతమవుతున్నది. అయితే భారత్ యుద్ధం చేసి పాక్ ఆక్రమిత భూభాగాలను స్వాధీనం చేసుకుంటుందా? పాక్ పాలకులే స్వయంగా తాము ఆక్రమించిన భూభాగాలను భారత్ కు అప్పగిస్తారా? ప్లెబిసైట్ ద్వారా ప్రజలే తమ నిర్ణయాన్ని ప్రకటిస్తారా అనే విషయం స్పష్టం కావలసి ఉంది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ పై భారత్ యుద్ధానికి దిగవచ్చనే సంకేతాలు కూడా వెలువడుతున్నాయి. అయితే ఇది ఎంత వరకు సాధ్యమో ఊహించలేం. పహల్గాం మారణకాండ ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కర్ణాటక సిఎం, డిప్యూటీ సిఎంను చంపేస్తాం..

**బెంగళూరు :** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను హతమారుస్తామని బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. సిఎం, డిప్యూటీ సిఎంలను దారుణంగా హత్య చేస్తామని ఓ దుండగుడు ఇ–మెయిల్‌లో బెదిరింపు సందేశం పంపాడు. కర్ణాటక విధాన సౌధ పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. రాంపురకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తికి తాను కోటి రూపాయలు అప్పుగా ఇచ్చానని, దానిని ఇంకా తిరిగి చెల్లించనందున అతడిని కూడా హత్య చేస్తానని మెయిల్‌లో ఆగంతకుడు పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సింధార్ రాజపుత్ అనే వ్యక్తి పేరిట మెయిల్ వచ్చినట్లు గుర్తించామని, తదుపరి విచారణ కొనసాగుతోందని అన్నారు. త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బెదిరింపు మెయిల్ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నివాసాల దగ్గర భద్రతను కట్టుదిట్టం చేశామని చెప్పారు.

## ప్రయాణికుల కోసం శ్రీనగర్ నుంచి అదనపు విమానాలు

విమాన చార్జీలు సహేతుకంగా ఉండేలా చర్యలు చేపట్టినట్లు ప్రకటించిన ప్రభుత్వం

శ్రీనగర్ విమానాశ్రయం వద్ద ఆహారం, నీరు, అదనపు టెంట్ ఏర్పాటు చేశాం

చార్జీల ఆదేశాలు అమలును పర్యవేక్షిస్తున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడి





**న్యూఢిల్లీ :** పహల్గాం ఉగ్రదాడి తర్వాత జమ్మూ కశ్మీర్ నుండి స్వస్థలాలకు తిరిగివెళ్లేందుకు భారీ సంఖ్యలో నిరీక్షిస్తున్న పర్యాటకుల కోసం సహేతుకమైన విమాన చార్జీలతో శ్రీనగర్ నుంచి అదనపు విమానాలను నడుపబడుతున్నాయని బుధవారం ప్రభుత్వం ప్రకటించింది. బుధవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల మధ్య శ్రీనగర్ నుంచి 20విమానాలలో దాదాపు 3,337 మంది ప్రయాణికులు వెళ్లి పోయారు. ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్ జెట్ శ్రీనగర్ నుంచి సాధారణ షెడ్యూల్డ్ సర్వీసులతో పాటు అదనంగా మొత్తం ఏడు అదనపు విమానాలను నడుపుతున్నాయి. పహల్గాం దాడిలో దాదాపు 26మంది ప్రజలు వారిలో అత్యధిక సంఖ్యలో పర్యాటకులు ఉగ్రదాడిలో చనిపోయిన విషయం తెలిసిందే. బుధవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ విమానచార్జీలు లేకుండా చూడాలని, ఒకవేళ వసూలు చేయాలనుకున్న పక్షంలో అత్యంత ఆమోదయోగ్యమైన తక్కువ ధరలు నిర్ణయించాలని విమానయాన సంస్థలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ ఆదేశాల అమలు అయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. శ్రీనగర్ నుంచి విమానాలలో ప్రయాణించేందుకు రూ.50,000 టికెట్ ధరలను వసూలు చేస్తున్నారని కొన్ని వెబ్‌సైట్లలో స్పష్టంగా చూపిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో దీనిపై స్పష్టత ఇస్తూ అత్యవసర పరిస్థితులలో చార్జీలు తక్కువగా ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపింది. శ్రీనగర్ నుంచి ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించేందుకు భరోసా ఇస్తున్నామని, అందుకోసం నిరవధిక ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని మంత్రి రామ్మోహన్‌నాయుడు నొక్కిచెప్పారు. ఇప్పటికే నాలుగు అదనపు విమానాలు నడుపుతున్నామని ప్రకటించడం జరిగిందని, బుధవారం వాటికి తోడు ఢిల్లీ నుంచి మూడు అదనపు విమానాలు నడిపేలా చర్యచలు తీసుకున్నామని ఆయన తన 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. 'శ్రీనగర్ నుంచి నడుపుతున్న అన్ని విమానయాన సంస్థలు ప్రయాణికులకు మద్దతుగా రద్దు, రీషెడ్యూల్ చార్జీలను మాఫీ చేశాయి. ఆహారం, నీరు ఎయిర్‌పోర్టు వద్ద ఏర్పాటు చేశాం. నిరీక్షించే వారి కోసం బయట అదనపు టెంట్‌ను ఏర్పాటు చేశాం. ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12మధ్య 20 విమానాలలో 3,337 మంది ప్రయాణికులు శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ నుంచి వెళ్లిపోయేందుకు ఏర్పాట్లు చేశాం' అని మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు.

## జమ్ముకశ్మీర్‌లో మిన్నంటిన నిరసనలు

పాకిస్థాన్, ఉగ్రవాదుల దిష్టిబొమ్మలు దహనం



**శ్రీనగర్ :** దక్షిణ కశ్మీర్‌లో పహల్గామ్ టూరిస్ట్ రిసార్ట్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీనగర్, జమ్ము సహా అనేక ప్రాంతాల్లో స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ప్రధాన రాజకీయ పార్టీలు, సామాజిక రాజకీయ, మతపరమైన సంస్థలకు చెందిన వారు పెద్ద ఎత్తున పాకిస్తాన్‌కు వ్యతిరేక నిరసనలు తెలిపారు. ఉగ్ర దాడిలో 26 మంది మరణించగా, ఎక్కువ మంది పర్యాటకులకే కావడం గమనార్హం. నిరసనకారులు పాకిస్తాన్ దిష్టిబొమ్మలను దహనం చేసి, పొరుగు దేశానికి, ఉగ్రవాదులకు, జమ్ము కశ్మీర్‌లోని వారి మద్దతుదారులకు తగిన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నినదించారు. తాజా దాడి 2019 పుల్వామాలో జరిగిన ఉగ్ర దాడి తర్వాత అత్యంత ఘోరమైన దాడిగా అభివర్ణించారు. అయితే నగరంలో నిరసన ప్రదర్శనకు అనుమతి కోరుతూ కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులతో ఘర్షణ పడ్డారు. బిజెపి ఎమ్మెల్యే యుధ్వీర్ సేథి నేతృత్వంలో కాషాయ పార్టీ, విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి), బజరంగ్ దళ్, ఇతర సామాజిక సంస్థలు నగరంలోని సత్వారీ ప్రాంతంలో సంయుక్త నిరసన ప్రదర్శన నిర్వహించాయి. పాకిస్తాన్, దాని సైన్యాధిపతి, ఉగ్రవాదులు, వారి స్థానిక మద్దతు సంస్థకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, పొరుగు దేశానికి, జమ్ముకశ్మీర్‌లోని దాని ఉగ్రవాద నెట్‌వర్క్‌లకు తగిన సమాధానం చెప్పాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. పాకిస్తాన్ జెండాను తగలబెట్టారు. నగరంలో మరో నిరసన ప్రదర్శనకు నాయకత్వం వహించిన జమ్ముకశ్మీర్ బిజెపి మాజీ అధ్యక్షుడు రవీందర్ రైనా మాట్లాడుతూ తమ సోదరుల హత్యలకు ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. ఉగ్రవాదులు, వారి స్థానిక మద్దతుదారులు త్వరలో నిర్మూలించబబడతారన్నారు. కాంగ్రెస్ యువ కార్యకర్తలు జమ్ములోని పార్టీ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. అయితే వారిని పోలీసులు ముందుకు సాగకుండా నిరోధించారు. ఫలితంగా కొద్దిసేపు ఘర్షణ జరిగింది. మాజీ మంత్రి యోగేష్ సాహ్ని నేతృత్వంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలోపాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పహల్గామ్ దాడిలో తమ బంధువులను కోల్పోయిన వారికి కాంగ్రెస్, దేశ ప్రజలు అండగా నిలుస్తున్నారని చెప్పారు. దాడిలో పాల్గొన్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సాహ్ని అన్నారు. బంద్ పిలుపునిచ్చిన జమ్ము చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (జెసిసిఐ), జమ్ము బార్ అసోసియేషన్ (జెబిఎ), ఆల్ జమ్ము అండ్ కాశ్మీర్ ట్రాన్స్‌పోర్టర్స్ అసోసియేషన్, జమ్ము ట్రేడర్స్ అసోసియేషన్ కూడా పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా వేర్వేరుగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. శివసేన డోగ్రా ఫ్రంట్, రాష్ట్రీయ బజరంగ్ దళ్, ఇతర సంస్థలు టైర్లు, పాకిస్తాన్ జెండాలను దగ్ధం చేశాయి. దోడా, కిష్త్వార్, రియాసి, కాట్రా, ఉధంపూర్, కథువా, సాంబా, బనిహాల్, రాంబన్, పూంచ్, రాజౌరిలలోనూ ఇలాంటి నిరసనలనే జరిగాయి. బిజెపి, కాంగ్రెస్, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి), నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) సహా చాలా రాజకీయ పార్టీలు పహల్గామ్ దాడిలో తమ బంధువులను కోల్పోయిన వారికి సంఘీభావం తెలిపాయి. రాజౌరి, పూంచ్, దోడా, కిష్త్వార్, బనిహాల్ మరియు ఉధంపూర్‌లలో అనేక ముస్లిం సంస్థలు సంయుక్తంగా, వ్యక్తిగతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాయి. పహల్గామ్ ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా ప్రజలు వీధుల్లోకి రావడంతో సరిహద్దు పట్టణమైన రాజౌరిలో భారీ నిరసనలు చెలరేగాయి.

## పహల్గాం ఉగ్రదాడి 'అత్యంత దారుణం'



సుప్రీంకోర్టు ఆవేదన

ఉగ్రదాడి బాధితులకు నివాళులు అర్పించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు

ఉగ్రచర్యను ఖండించిన ఢిల్లీ హైకోర్టు బార్ అసోసియేషన్

**న్యూఢిల్లీ :** జమ్మూకశ్మీర్‌లో పహల్గాం వద్ద పర్యాటకులపై ఉగ్రదాడి జరగడం అత్యంతదారుణం అని బుధవారం సుప్రీంకోర్టు ఖండించింది. బుధవారం ఈఘటనపై ఆవేదన వ్యక్తం చేసింది. అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు ఉగ్రదాడి బాధితులకు నివాళులు అర్పిస్తూ కొద్దిసేపు మౌనం పాటించారు. బుధవారం ఉదయం జరిగిన ఫుల్ కోర్టు సమావేశంలో ఉగ్రవాద చర్యను ఖండిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ విషయాన్ని అపెక్స్ కోర్టు ఒక ప్రకటనలో తెలియజేసింది. బుద్ధిహీనమైన హింస సంబంధిత ఈ క్రూరచర్య అందరి మనస్సులను కలిచివేసిందిఅని, ఉగ్రవాదం జడలు విప్పిన క్రూరత్వం, అమానవీయతకు ఇది స్పష్టమైన గుర్తు అని సుప్రీంకోర్టు తెలిపింది. భారతదేశ కిరీట రత్నంగా భాసిల్లుతున్న జమ్మూకశ్మీర్ ప్రకృతి అందాలను చూసి ఆనందిస్తున్న పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి జరపడం జీవిత పవిత్రతను దెబ్బ తీయడమే కాకుండా మానవతా విలువలకు విఘాతం కలిగించిందనడం ఎంతమాత్రం అతిశయోక్తి కాదని అత్యుతన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. 'సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్' కూడా పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించింది. ఢిల్లీ హైకోర్ట్ బార్ అసోసియేషన్ విడుదల చేసిన ఒక ప్రకటనలో దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి ఈ ఉగ్రదాడి సవాల్ విసరడమేనని, అది దారుణమైన ఉగ్ర చర్య అని ఖండించింది. దక్షిణ కశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారం జరిగిన ఉగ్రదాడిలో 26మంది పర్యాటకులను ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా చంపివేయగా, పలువురు క్షతగాత్రులు అయిన విషయం తెలిసిందే.

## బారాముల్లాలో చొరబాటు యత్నం భగ్నం

ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

**శ్రీనగర్ :** కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడిలో సుమారు 26 మంది టూరిస్ట్‌లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరవకముందే మరో ప్రాంతంలో ఉగ్రవాదులు చొరబాటుకు యత్నించారు. అప్రమత్తమైన సైన్యం వారి ప్రయత్నాన్ని విజయవంతంగా తిప్పికొట్టింది. కాల్పులు జరిపి వారిని మట్టుబెట్టింది. బుధవారం ఉదయం బారాముల్లాలోని ఉరి వద్ద ఉన్న సర్జీవన్ ప్రాంతం గుండా సుమారు ముగ్గురు ఉగ్రవాదులు చొరబాటుకు ప్రయత్నించారు. నియంత్రణరేఖ వద్ద అప్రమత్తమైన భద్రతా బలగాలు వారిని అడ్డుకున్నారు. చొరబాటు ప్రయత్నాన్ని సైన్యం విజయవంతంగా భగ్నం చేసింది. ఈ క్రమంలో అక్కడ భీకరమైన ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. ఘటనాస్థలం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఆపరేషన్ కొనసాగుతోంది. పెహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే.

## నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు జడ్జీలు క్షేమం..

వెల్లడించిన కేరళ సిఎం పినరయి విజయన్

**తిరువనంతపురం:** కశ్మీర్ టూరుకు వెళ్లిన కేరళ ఎమ్మెల్యేలు, జడ్జీలు క్షేమంగా ఉన్నట్లు సీఎం పినరయి విజయన్ వెల్లడించారు. కశ్మీర్‌లో ఉన్న కేరళ పర్యాటకుల్ని సురక్షితంగా స్వరాష్ట్రానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కేరళ హైకోర్టు జడ్జీలు జస్టిస్ అనిల్ కే నరేంద్రన్, జస్టిస్ పిజి అజిత్ కుమార్, జస్టిస్ గిరీశ్.. ప్రస్తుతం జఉమ్మకశ్మీర్ టూరులో ఉన్నారు. ఆ జడ్జీలు శ్రీనగర్‌లో ఉన్న ఓ హోటల్‌లో క్షేమంగా ఉన్నట్లు సిఎం తెలిపారు. గురువారం వాళ్లు స్వరాష్ట్రానికి తిరిగి రానున్నారు. ఎమ్మెల్యేలు ఎం ముకేశ్, కేపీసీ మజీద్, టి సిద్దిక్, కె అన్సలన్ కూడా శ్రీనగర్‌లోనే ఉన్నారు. వాళ్లు కూడా క్షేమంగా ఉన్నట్లు కేరళ సిఎం చెప్పారు. కేరళ పర్యాటకుల కోసం నోర్కా గ్లోబల్ కాంటాక్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్లను కూడా రిలీజ్ చేశారు. కేరళలోని కొచ్చికి చెందిన రాంచంద్రన్ అనే వ్యక్తి పహల్గామ్ దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. తన కూతురు, మనవళ్లతో కలిసి రాంచంద్రన్ కశ్మీర్ టూరుకు వెళ్లారు. అయితే ఉగ్రదాడి సమయంలో సాయుధులు అతన్ని కాల్చి చంపారు. ప్రస్తుతం కూతురు ఆరతి, ఆమె పిల్లలు అక్కడే ఉన్నారు.

## తాజ్‌మహల్‌ను వీక్షించిన అమెరికా వైస్ ప్రెసిడెంట్ జెడి.వాన్స్

సతీమణి ఉషా వాన్స్, కుమారులు ఎవాన్, వివేక్, కూతురు మిరాబెల్‌తో సందర్శన

విమానాశ్రయంలో యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ ఘన స్వాగతం



**ఆగ్రా/ జైపూర్ :** అమెరికా వైస్ ప్రెసిడెంట్ జెడి.వాన్స్ బుధవారం తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఆయన తన సతీమణి ఉషా వాన్స్, పిల్లలతో కలిసి తాజ్‌మహల్‌ను సందర్శించినట్లు అధికారులు తెలిపారు. తాజ్‌మహల్ అద్భుతమైనది.'నిజమైన ప్రేమకు, మానవ ఔదార్యానికి, భారతదేశం గొప్పతనానికి అందజేసే నివాళి' అని జెడి.వాన్స్ తాజ్‌మహల్‌ను సందర్శించిన అనంతరం సందర్శకుల డైరీలో తన అనుభూతిని లిఖించారు. బుధవారం వాన్స్ కుటుంబం జైపూర్ నుంచి ఆగ్రా ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు' అని అధికారులు చెప్పారు. 'భారతదేశ పవిత్ర హృదయ భూమి, కాలాతీత భక్తి, శక్తివంతమైన సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి విచ్చేసిన అమెరికా వైస్ ప్రెసిడెంట్ జెడి.వాన్స్, ఆయన కుటుంబానికి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను' అని ఆదిత్యనాథ్ తన 'ఎక్స్'వేదికగా పోస్ట్‌చేశారు. జెడి. వాన్స్ ఆయన సతీమణి ఉషా, వారి ముగ్గురు పిల్లలు... కుమారులు ఎవాన్, వివేక్, కూతురు మిరాబెల్‌తో తాజ్‌మహల్‌ను సందర్శించుకున్నారు. జెడి.వాన్స్ భారతదేశంలో నాలుగు రోజుల పర్యటనను ఏర్పాటుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తాజ్‌మహల్ సందర్శన తర్వాత వాన్స్ జైపూర్‌కు తిరిగివచ్చారు. ఆయన తన ప్రతిపాదిత సిటీ ప్యాలెస్‌ను దర్శ చేసుకున్న తర్వాత రామ్‌బాగ్ ప్యాలెస్ హోటల్‌కు చేరుకున్నారు.ఆగ్రానుంచిజైపూర్‌కు తిరిగివచ్చిన తర్వాత జెడి.వాన్స్ రెండుగంటల కోసం సిటీ ప్యాలెస్ షెడ్యూల్ చేయబడింది. గురువారం ఉదయం అమెరికాకు తిరుగుముఖం పట్టేలా షెడ్యూల్ ఖరారైంది.ఆగ్రాలో వాన్స్ కుటుంబం విమానాశ్రయం నుంచి తాజ్‌మహల్ ఉన్న ఆగ్రాకు కారులో చేరుకున్నారు. జెడి.వాన్స్ కాన్వాయ్ వెళ్లే మార్గం అంతా ప్రత్యేక అలంకరణ చేయబడింది. జెడి.వాన్స్ పర్యటన దారిపొడవునా ఏర్పాటుచేసిన పెద్ద పెద్ద హోర్డింగుల ద్వారా అమెరికా వైస్‌ప్రెసిడెంట్ జెడి.వాన్స్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తాజ్ మహల్ ప్యాలెస్ వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 12కిలోమీటర్ల దూరాన్ని కలిగి ఉన్న ఎయిర్‌పోర్ట్ నుంచి తాజ్‌మహల్ వయా శిల్ప్‌గ్రామ్ మార్గం అంతటా గట్టి భద్రత ఏర్పాటైంది. వాన్స్ కాన్వాయ్ ప్రయాణం సాఫీగా సాగేందుకు దారి పొడవునా జీరో ట్రాఫిక్ జోన్‌ను ప్రకటించారు.తాజ్ మహల్ వద్ద వాన్స్, ఆయన కుటుంబ సభ్యులు దాదాపు గంటసేపు గడిపి అక్కడ నుంచి విమానాశ్రయానికి వెళ్లారు.తిరిగి వాన్స్ భారత ట్రిప్ సోమవారం ఉండనున్నది. ఆయన దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ కావడానికి ముందు అక్షర్‌ధామ్ ఆలయాన్ని సందర్శించనున్నారు.

## ఉక్రేన్‌పై దాడి : లండన్ చర్చలు వాయిదా



**కీవ్ :** ఉక్రేన్ సమస్యపై నిర్ణీత ప్రకారం బుధవారం లండన్‌లో తలపెట్టిన విదేశాంగ మంత్రుల స్థాయి సమావేశం వాయిదా పడింది. తూర్పు ఉక్రేన్ మార్గనెట్స్‌లో బుధవారం ఉదయం ఒక బస్సుపై రష్యా డ్రోన్ దాడుల్లో తొమ్మిదిమంది పౌరులు మరణించారు. మరో 40 మంది గాయపడ్డారు. ఏడుగురు మహిళలు, ఇద్దరు పిల్లలు ఈ దాడిలో మరణించడంతో లండన్‌లో చర్చలు అర్థాంతరంగా వాయిదా పడ్డాయి. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో లండన్‌కు వెళ్లడం లేదని వైట్‌హౌస్ ప్రకటించింది. పుతిన్ యుద్ధాన్ని విరమిస్తారన్న సంకేతాలు కనిపించడంతో ఈ వారంలోనే ఉక్రేన్–రష్యా మధ్య శాంతి ఒప్పందం జరుగుతుందని ట్రంప్ ఇప్పటికే ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్రేన్‌లో కాల్పుల విరమణ పాటిస్తే పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలు జరపడానికి తాను సిద్ధంగా ఉన్నాననీ, వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల సందర్భంగా పుతిన్‌ను తాను కలుస్తాననీ జెలెన్స్కీ ప్రకటించారు. బ్రిటన్, ఉక్రేన్, అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ దేశాల విదేశాంగ మంత్రుల స్థాయిలో బుధవారం లండన్‌లో శాంతి చర్చలు జరగాల్సి ఉండగా దాడుల ఫలితంగా వాయిదా పడింది. రష్యా ఆక్రమిత క్రిమియా ప్రాంతాలను పాక్షికంగా రష్యావేనని గుర్తించేందుకు అనుమతించాలని అమెరికా ప్రతిపాదన చేసింది. కానీ దీనిని జెలెన్స్కీ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు.దీంతో 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన కూడా అమలయ్యే సూచనలు మధ్యవర్తులకు కనిపించడంలేదు. ఉక్రేన్–రష్యా మధ్య 1000 కి.మీ మేరకు సరిహద్దు ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో ఎక్కడైనా దాడులు జరిగే అవకాశాలు ఉన్నాయి. కాగా, ఈ వారంలోనే ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్‌కాఫ్ మాస్కోకు వెళుతున్నారనీ, లండన్‌లో జరిగే చర్చల్లో కూడా ఆయన పాల్గొంటారనీ వైట్‌హౌస్ ఈ తాజా పరిస్థితులకు ముందుగా ప్రకటించింది. లండన్‌లో విదేశాంగమంత్రులస్థాయి సమావేశం వాయిదాపడినాగానీ కిందిస్థాయిలో మాత్రం ఈ చర్చలు జరిగాయి. ఉక్రేన్ విదేశాంగమంత్రి ఆండ్రూ సిబిగా, రక్షణమంత్రి రస్టెమ్ ఉమేవ్‌లు వేరు వేరు బృందాలతో చర్చల నిమిత్తం బుధవారం లండన్‌కు చేరుకున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్స్కీ ప్రకటించారు. వాటికన్‌సిటీలో ఈనెల 26వ తేదీన పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియల సందర్భంగా ఆయనను కలుస్తానన్నారు. మూడు సంవత్సరాలుగా జరుగుతున్న యుద్ధాన్ని ఇక ఆపేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ఒత్తిడి చేస్తూ ఉండటంతో జెలెన్స్కీ ఈ ప్రకటన చేశారు.

## ఆగ్నేయాసియా సౌరవిద్యుత్ పలకలపై సుంకం



**వాషింగ్టన్ :** ఆగ్నేయ ఆసియాలోని నాలుగు దేశాల నుండి అమెరికాకు దిగుమతయ్యే సోలార్ ప్యానల్స్‌పై ట్రంప్ ప్రభుత్వం మంగళవారంనాడు భారీస్థాయిలో సుంకాలు విధించింది. వియత్నాం, కంబోడియా, మలేసియా, థాయ్‌లాండ్ దేశాల నుండి ప్రధానంగా అమెరికాకు సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసే పలకలు దిగుమతి అవుతాయి. ఈ సౌర విద్యుత్ పలకలపై 2,521 3,521 శాతం మేరకు సుంకాలు విధించే ఒక ప్రణాళికను ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించింది. చైనా–వియత్నాం మధ్య దీర్ఘకాలంగా బలమైన సంబంధాలు ఉన్నాయి. ఈ నాలుగు దేశాల కంపెనీలూ చైనా నుండి సబ్సిడీలు తీసుకుని అమెరికు చాలా చౌకగా సౌరవిద్యుత్ పరికరాలను డంప్ చేస్తున్నాయని అమెరికాలోని కంపెనీలు చాలాకాలంగా ఫిర్యాదులు చేస్తున్నాయి. దేశీయ ఉత్పత్తులకు రక్షణ కోరుతున్నాయి. ఈ తరుణంలో, అమెరికాతో వ్యాపార లావాదేవీలు చేసే దేశాలు జాగ్రత్తగా వ్యవహరించాలని, స్వప్రయోజనాలు పణంగా పెట్టి అమెరికాకు లొంగిపోతే సహించబోమని పలు దేశాలకు చైనా ఇటీవల ఒక హెచ్చరిక చేసింది. ఈ హెచ్చరిక వెలువడిన వెంటనే ట్రంప్ యంత్రాంగం నుండి ఈ ప్రకటన వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ట్రంప్ విధించిన సుంకాలను ఒక్క చైనా ప్రభుత్వం తప్ప ఇంకెవ్వరూ బాహాటంగా సవాలు చేసి ప్రతిఘటించడంలేదు. చైనాపై ట్రంప్ 245 శాతం సుంకాలు విధించగా అందుకు ప్రతీకారంగా చైనా కూడా అమెరికాపై 125 శాతం సుంకాలు విధించింది. ఈ విధంగా ప్రతీకార సుంకాలు విధించిన దేశం చైనా మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా అమెరికాకు వ్యతిరేకంగా చిన్న దేశాలను కూడగడతామని కూడా చైనా ప్రకటించింది.

## జమిలీ ఎన్నికలపై... సినీ, క్రీడా ప్రముఖుల అభిప్రాయాలు

స్వీకరించనున్నట్లు వెల్లడించిన జెపిసి చైర్మన్

**న్యూఢిల్లీ :** జమిలీ ఎన్నికల బిల్లులను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) త్వరలోనే సెలబ్రిటీలు, ప్రముఖ వ్యాపారవేత్తలు, క్రీడా ప్రముఖులు, ప్రాంతీయ రాజకీయ పార్టీలు, కీలక ప్రభుత్వ ముఖ్యుల అభిప్రాయాలను స్వీకరించనుంది. వచ్చే నెలలో చేపట్టనున్న కమిటీ అధ్యయన పర్యటనలో భాగంగా క్రీడలు, వినోద ప్రపంచం, న్యాయ వృత్తి, విద్యారంగ ప్రముఖుల సహా సమాజంలోని వివిధ రంగాల వ్యక్తులను, రాష్ట్రాల పరిపాలకులను కలుస్తామని సంయుక్త పార్లమెంటరీ సంఘం (జెపిసి) చైర్మన్ పి.పి. చౌద రి 'పిటిఐ'కి వెల్లడించారు. మే 17 నుంచి 22వ తేదీలలో మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో జెపిసి పర్యటించబోతుందని, ఈ సందర్భంగా ఆ రాష్ట్రల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, వివిధ ప్రభుత్వ శాఖల, రాష్ట్ర ఎన్నికల కమిషన్, స్టాక్ ఎక్స్ఛేంజ్, బ్యాంకుల అధిపతుల అభిప్రాయాలను కమిటీ వింటుందని ఆయన చెప్పారు. సమావేశాలకు సంబంధించి సన్నాహాలు ఇంకా కొనసాగుతున్నాయని, అయితే జెపిసి అందరితో విస్తృత సంప్రదింపులు జరపాలని భావిస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. అయితే ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులను కలిసే విషయంపై ఇంకా నిర్ధారణ జరగాల్సి ఉంది. స్టడీ టూర్‌లో భాగంగా జెపిసి మే 17న ముంబై, మే 20న డెహ్రాడూన్‌కు వెళ్తుందని, ముంబైలో ఆర్‌బిఐ, ఎస్‌బిఐ, నాబార్డ్, ఎల్‌ఐసి ప్రతినిధులతో పాటు, ఇతర బ్యాంకుల ప్రతినిధులతో కూడా జమిలీ ఎన్నికల గురించి చర్చించనుంది. అలాగే నేషనల్ లా యూనివర్సిటీ, ఐఐటి ముంబై, ముంబై యూనివరిటీ అభిప్రాయాలను తీసుకోవాలని భావిస్తుంది.

## ట్రంప్ ప్రభుత్వంలో ఇక మస్క్ పరిమిత పాత్ర



**న్యూయార్క్ :** ప్రపంచ కుబేరుడు, ట్రంప్ ప్రభుత్వంలో కీల కసూత్రధారి ఎలాన్‌మస్క్ కార్ల కంపెనీ ''టెస్లా'' లాభా లు తగ్గుముఖం పడుతున్నాయి. మస్క్ రాజకీయాలలో బిజీగా ఉంటూ వ్యాపారాన్ని నిర్లక్ష్యం చేశారా? అనే విషయం పక్కన పెడితే, ఇక ప్రభుత్వ కార్యకలాపాలలో తాను పరిమిత పాత్ర వహిస్తాననీ, తనకు కేటాయించిన ప్రత్యేక మంత్రిత్వశాఖ నిర్వహణకు తక్కువ సమ యం ఇస్తానని మస్క్ ప్రకటించారు. ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచి పొదుపు చేసి దుబారాను అరికట్టేందుకు వీలుగా మస్క్ ప్రధాన సారథిగా ''డాడ్జ్'' శాఖను ట్రంప్ ఏర్పాటు చేశారు. గడచిన 90 రోజులుగా మస్క్ ఈ పనులు చక్కబెట్టడంలో ఊపిరి సలపకుండా గడిపారు. ప్రపంచవ్యాప్తంగా ట్రంప్‌తో పాటు విమర్శలు కూడా ఎదుర్కొన్నారు.

**CHANGE OF NAME**

I, VENKATA SUBRAHMANYA VIDYASAGAR (Old Name), S/o. Iluru Visweswara Rao, R/o. Flat No.102, Sree Sai Teja Apts., Bhagya Nagar, Phase-2, Kukatpally, Hyderabad - 500072, Telangana State, here by declare that I have changed my name ILURU VENKATA SUBRAHMANYA VIDYASAGAR (New Name) for all purpose.

## పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిద్దాం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో అత్యంత క్రూరంగా ఉగ్రవాదులు చేసిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులు అత్యంత దారుమంగా దాడి చేసి 26మంది భారతీయ పౌరులను చంపివేయడం కిరాతకమైన చర్య అని అన్నారు. సాధారణ పర్యటకులే లక్ష్యంగా ఆర్మీ యూనిఫాంలో వచ్చి మతం అడిగి మరీ కాల్పులు జరపడం ఉగ్రవాదుల పిరికిపంద చర్యగా అభివర్ణించారు. 26మంది అమాయక భారతీయ పౌరులను పొట్ట పెట్టుకున్న ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉగ్రదాడులకు పాల్పడేవారిపై యావత్ భారతదేశం ఐక్యంగా పోరాడాలని కోరారు.



## ఉగ్రవాదులను అంతమొందించాలి

**ప్రజాపక్షం/దేవరకొండ :** కాశ్మీర్‌లోని పహల్గంలో బుధవారం పోలీసు మారు వేషంలో వచ్చి విచక్షణారహితంగా పర్యాటకులపై బుల్లెట్లతో దాడులు చేసిన పాకిస్తాన్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన వారికి కోటి, గాయపడిన పౌరులకు 25లక్షల నష్ట పరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. కాశ్మీర్ లో పర్యాటకులను కిరాతకంగా చంపిన జిహాదీ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను గుర్తించి అంతమొందించాలని, ఉగ్రదాడికి కారణమైన పాక్ ప్రభుత్వాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఒంటరి చేయాలని, వాణిజ్య, వ్యాపార, పర్యాటక రంగాలపై ఆంక్షలు విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న పౌరులంతా ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండించాలని నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఘటనలో గాయాలైన వారికి కేంద్ర ప్రభుత్వం అత్యాధునిక వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన భారత పౌరుల కుటుంబాలకు భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన ప్రగాఢ సానుభూతిని, సంతాప వ్యక్తం చేశారు.

## వేసవి సెలవుల్లోనూ బడిబాట

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వేసవి సెలవుల్లోనూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా బడిబాట కార్యక్రమం చేపట్టాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ఆయన బుధవారం జూమ్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం బడిబాట షెడ్యూల్ ఇవ్వనప్పటికీ గత వారం రోజులుగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లకుండా గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులను ఒప్పించి నమోదు చేయిస్తున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అదే స్ఫూర్తితో అంగన్‌వాడిల నుంచి ఐదు సంవత్సరాలు నిండిన విద్యార్థుల జాబితా సేకరించి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించి తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించేవిధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలాజీనాయక్, లక్ష్మణ్‌నాయక్, వరలక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలలో యాదాద్రి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/యాదాద్రి :** మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో యాదాద్రి భువనగిరి జిల్లా 2024/2025 విద్యాసంవత్సరమునకు గాను ఉత్తమ పలితాలు సాదించడంతో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సి.రమణిని జిల్లా కలెక్టర్ హనుమంతరావు శాలువా కప్పి సన్మానిస్తూ అభినందించారు. 2024/25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సర ఫలితాలలో 6,208 విద్యార్దులకు గాను 3,634 మంది ఉత్తీర్ణత చెంది రాష్ట్రం లో 14 వ స్థానం పొందిందని, అలాగే రెండవ సంవత్సర ఫలితాలలో 5,530 విద్యార్దులకుగాను 3,756 మంది ఉత్తీర్ణత చెంది రాష్ట్రంలో 14వ స్థానం పొందిందని జిల్లా విద్యాశాఖ అధికారి రమణి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఫలితాలు గత సంవత్సరం కంటే అత్యుత్తమంగా రావడం అభినందనీయమని అందుకు కృషి చేసిన విద్యాశాఖ అధికారులను అభినందిస్తూ విద్యలో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు నిరంతరం శ్రమించాలన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐఎన్‌టియుసి కార్యాలయంలో కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ, సిఐటియు, ఐఎఫ్‌టియుల, టియుసిఐ సమావేశం నిర్వహించారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులు యరగాని నాగన్న, మేకల శ్రీనివాస్, నెమ్మాది వెంకటేశ్వర్లు, గంట నాగయ్యలు మాట్లాడుతూ కేంద్రంలో గత పదేళ్ళుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ వారికి ప్రయోజనాలు కలిగేలా వ్యవహరిస్తుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ కనీస వేతనాలు అమలు చేయకుండా, జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం లేదన్నారు. 8గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ పని గంటలను పెంచుతూ, కనీస ఉద్యోగ భద్రతను కల్పించడం లేదన్నారు. కాంట్రాక్ట్, ఓవుట్ సోర్సింగ్ విధానాన్ని పెంచి పోషిస్తూ కార్మిక వర్గాన్ని సమస్యల వలయంలో నెట్టివేస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 49 లేబర్ చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మికులను పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టేందుకు కుట్రలు చేస్తుందన్నారు. మే 6న సూర్యాపేట జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి, సిఐటియు, ఐఎఫ్‌టియుల, టియుసిఐ నాయకులు కాసర్ల శ్రీను, వల్దాస్ శ్రీను, దంతాల రాంబాబు, దేశోజు మధు, ఖమ్మంపాటి రాము, పాపన్న పాల్గొన్నారు.

## 25న భూభారతిపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఎస్‌వీ గార్డెన్స్‌లో మిర్యాలగూడ మండలం, పట్టణస్థాయి భూభాభరతి అవగాహన సదస్సును ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హరిబాబు బుధవారం తెలిపారు. సదస్సుకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుకు రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మేడేను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** మే1న నిర్వహించే కార్మికుల దినోత్సవం మేడేను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు సిలివేరు ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు వెంపటి గురుజీలు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పలు రైస్ మిల్లులలో మేడే, మే20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. బిజెపి కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మే 20న దేశ వ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌టియు నాయకులు, హమాలీ కార్మికులు ఆరెంపుల వెంకటాద్రి, రేసు సైదులు, సోమయ్య, సోము అప్పయ్య, లింగయ్య, నర్సింగరావు, వెంకట్ రెడ్డి, చంద్రయ్య, వీరస్వామి, కుటుంబరావు పాల్గొన్నారు.



# భూ భారతిలో భూనిషేధం ఉండదు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/చిట్యాల:** గతంలో ధరణి పోర్టల్‌లో కొన్ని భూములు నిషేధంలో పెట్టి వాటిని పార్ట్ బిలో ఉంచడం జరిగిందని, వాటికి పరిష్కారం ఉండేది కాదని, కాగా నేటి భూ భారతిలో భూములను నిషేధంలో లేకుండా ప్రభుత్వం చూస్తుందని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి, చిట్యాల మండల కేంద్రంలో బుధావారం ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో ఆమె పాల్గొని చట్టం గురించి రైతులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏదేని వివాదంలో ఉన్న భూములకు హద్దులను నిర్ణయించి జియో కో ఆర్డినేట్ ఏర్పాటు చేయడం ద్వారా సమస్యలను కొలిక్కి తేవడానికి వీలుంటుందన్నారు. భూములకు సంభందించిన వివరాలు ఆన్‌లైన్‌లో ఉంటాయని, రైతులకు ఆధార్ కార్డుల మాదిరిగానే భూధార్ కార్డులను ప్రభుత్వం జారీ చేస్తుందన్నారు. దీని ఆధారంగా భూముల వివరాలను ఎక్కడి నుండైనా తెలుసుకోవచ్చని అన్నారు. భూమి కొనుగోలు చేసేవారు ఇకమీదట ఆన్‌లైన్‌లో భూమి వివరాలను పూర్తిగా తెలుసుకుని కొనుగోలు చేసుకోవచ్చని అన్నారు. భూధార్‌తో 99శాతం భూసమస్యలు తహసిల్దార్ దగ్గరే పరిష్కారం అవుతాయని కలెక్టర్ తెలిపారు. శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ రైతులకు భూములపై విశ్వాసం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి పథకాన్ని తీసుకుని వచ్చిందని, భూములకు భూభారతి రక్షణ కవచంలా ఉంటుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, నల్లగొండ ఆర్‌డిఓ వై అశోక్‌రెడ్డి, తహసిల్దార్లు కృష్ణ నాయక్, జమీరుద్దీన్, డిసిసిబి వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోదమోహన్‌రెడ్డి, వెల్మినేడు పిఏసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి పాల్గొన్నారు.



## వెట్టి చాకిరిని నిర్మూలించిన దొడ్డి కొమరయ్య

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మూడువేల గ్రామాలో వెట్టి చాకిరీ ని నిర్మూలించిన ధీరుడు దొడ్డి కొమరయ్య అని సినిమా చిత్ర దర్శకుడు ఎం సేనాపతి ఆయన సేవలను కొనియాడారు. మహాత్మా జ్యోతిబా పూలే బిసి భవనంలో బుధవారం బిసి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ అధ్యక్షతన తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య సినిమా చిత్ర దర్శకుడు ఎం సేనాపతి బిసి సంఘాల అధ్యక్షులుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేనాపతి మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య 33 జిల్లాల నుండి 26 మంది చొప్పున సహ నిర్మాతలు గా తీసుకోటం జరుగుతున్నదని ఇప్పటివరకు ఆరు జిల్లా ల నుండి సహ నిర్మాతలను తీసుకోవటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమలో బిసి సంఘం కోశాధికారి నల్ల సోమమల్లన్న,కంది సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షులు నకేరేకంటి కాశయ్య గౌడ్, కార్యదర్శి పర్వతాలు యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు లోడంగి గోవర్ధన్, అధ్యక్షులు యాదవ సంఘం గోలి విజయ్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి నెలపట్ల రమేష్, నాయిబ్రహ్మానా సంఘం జిల్లా అధ్యక్షులు నాగులపల్లి శ్యాంసుందర్, మునాసు ప్రసన్న పాల్గొన్నారు.

# రైతులకు ఉచిత న్యాయసేవలు

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

### భూ భారతి చట్టం మంచి నిర్ణయమని కొనియాడిన రైతులు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(మఠంపల్లి) :** రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చేలా భూ భారతి చట్టం రూపొందించారని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని మఠంపల్లి మండల కేంద్రంలోని వి.ఆర్.ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన భూ భారతి చట్టం 2025పై అవగాహన సదస్సుకు ముఖ్యఅతిధిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన భూభారతి చట్టం 2025 ద్వారా రైతులకు సులభతరమైన,న్యాయమైన సేవలు అందుతాయని తెలిపారు. ఈ చట్టం లో ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని తమ సమస్యకు దరఖాస్తు చేసుకునే సౌకర్యం ఉందని, వివిధ స్థాయిలలో నిర్ణీత సమయాలలో దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. భూముల సమస్యలు సులభంగా పరిష్కారం కోసం మార్పులు,చేర్పులు(వికేంద్రీకరణ) చేయడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ గత ధరణి సమయాలలో రైతులు చిన్ని చిన్న భూ విషయాలకు ఇబ్బందులు పడేవారని అట్టి సమస్యలను రెవిన్యూ అధికారుల దృష్టికి తెస్తే వారు ఏమి చేయలేని పరిస్థితిలో ఉండేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్ఓఆర్ చట్టం 2025 ద్వారా రైతులకు సులభతరమైన న్యాయసేవలను అందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసులు,తహశీల్దార్ మంగ, ఎంపిడిఓ జగదీష్,డిటి బాలరాజు,పిఎసిఎస్ చైర్మన్ జివ్వాజి రామచంద్రయ్య,వైస్ చైర్మన్ బాబూనాయక్,రెవిన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## 28న పూలే, అంబేద్కర్ జన జాతర



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి :** ఈనెల 28న నల్లగొండలో జరిగే పూలే,అంబేద్కర్ జన జాతరను జయప్రదం చేయాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పెరిక విజయ్ కుమార్ పిలుపునిచ్చారు.బుధవారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయులు ఎదుర్కొన్న కుల విక్షతలే వారిని శక్తివంతులుగా తయారు చేశాయని,అవమానాలు ఎదుర్కొన్న చోటనే హక్కలను సాధించుకోవాలనె సంకల్పంతో అంతరాలను కారణమైన మూలాలను తొలగించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల అధ్యక్షుడు మండల రాజశేఖర్,శ్రీనయ్య, సైదులు,వెంకటయ్య,సైదులు పాల్గొన్నారు.

## భూ భారతితో భూ సమస్యలకు చెక్

### జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధిః** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం భూ సమస్యల పరిష్కారానికి కీలకమైందని, రైతులు దీని పై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ తెలిపారు. బుధవారం కేటీ దొడ్డి మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి చట్టం 2025 అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొని, చట్టం , అంశాల పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి చట్టం రూపొందిం చిందన్నారు. ఎంతో మంది మేధావులు, అధికారులు భూ భారతి చట్టానికి రూపకల్పన చేశారని వివరించారు. భూ పరిపాలన వ్యవస్థ అనేక దశల్లో అభివృద్ధి చెందిందని, గతంలో జరిగిన కొన్ని చట్టాలు, సర్వేలు, పాస్‌బుక్ లు, ఆర్.ఓ.ఆర్ చట్టం వంటి చర్యలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, గద్వాల్ మార్కెట్ యార్డు చైర్మన్ నల్ల హనుమంతు, కేటి దొడ్డి తహసీల్దార్ హరి కృష్ణ పాల్గొన్నారు.

## ప్రైవేట్ చిల్డ్రన్ హోంలో బాలికలపై లైంగిక వేధింపులు

### ఆలస్యంగా వెలుగులోకి సంఘటన

### నిందితుడిపై పొక్సో చట్టం కింద కేసు నమోదు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఓ ప్రైవేట్ చిల్డ్రన్ హోంలో ఇన్‌చార్జీ భర్త అందులో ఉంటున్న బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఒక ప్రభుత్వ, మరో నాలుగు ప్రైవేట్ చిల్డ్రన్ హోంలు ఉండగా జిల్లా కేంద్రంలోని జీప్సీ చిల్డ్రన్స్ ప్రైవేట్ హోంలో ఇన్‌చార్జీ భర్త ముగ్గురు బాలికలపై గత కొంత కాలంగా లైంగిక వేదింపులకు గురి చేస్తుండడంతో తాళలేక వారి తల్లిదండ్రులలకు విషయాన్ని చెప్పారు. దీంతో వారు శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా విచారణ చేసిన అధికారులు వాస్తవమేనని తేల్చారు. దీనికి బాధ్యుడైన హోం ఇన్‌చార్జీ భర్త రాంబాబుపై సూర్యాపేట పట్టణ పోలీసులకు ఈనెల 11న ఫిర్యాదు చేశారు. దీంతో హోం ఇన్‌చార్జీ భర్త రాంబాబుపై ఫోకో కేసు నమోదు చేసిన కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ సంఘటన వెలుగులోకి రాకుండా ఉండేందుకు కొంతమంది అధికారులు విషయాన్ని బయటికి పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. ఈ సంఘటన వాస్తవమని తేలగానే ప్రైవేట్ హోంను సీజ్ చేయడంతో పాటు అసలు నిర్వహకురాలుపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా అవేవి పట్టించుకోలేదు. హోం అసలు నిర్వహకురాలు సబిత బెంగుళూరులో ఉంటూ ఇన్‌చార్జీలను పెట్టి హోంను నడిపిస్తున్నట్లు అధికారుల విచారణలో తెలింది. ఈమెకు రాష్ట్రంలోని పలు జిల్లాలో మరో నాలుగు చిల్డ్రన్స్ హోంలు ఉన్నట్లు సమాచారం. రాజకీయ వత్తిడితో ఆమెపై అధికారులు చర్యలు తీసుకునేందుకు సహసించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావు వివరణ**

ఈ విషయం జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి నర్సింహారావును వివరణ కోరగా ప్రైవేట్ చిల్డ్రన్స్ హోంలో బాలికలపై లైంగిక వేధింపులు జరిగింది వాస్తవమేనని చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు వెంటనే జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు నివేదికను అందజేసినట్లు చెప్పారు.

# వేగవంతంగా రబీ ధాన్యం కొనుగోలు

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రబీ ధాన్యం కొనుగోలు సక్రమంగా నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. రైతులు, కొనుగోలుదారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు వేగవంతం అయ్యేలా చూడాలని అన్నారు .బుధవారం ఆమె మండలం గట్టు కింది అన్నారం లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో డిసిఎంఎస్ ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు .ఈ కేంద్రంలో సుమారు 150 కుప్పలు ధాన్యం రాగా, ధాన్యం తక్షణమే కొనుగోలు వేగవంతం చేసి మిల్లులకు పంపించేందుకు చర్యలు తీసుకున్నారు. ఒకేసారి ధాన్యం కుప్పలన్నీ సరైన తేమశాతం కలిగి రావడం,అయితే తాలుతో రావడం,అదే సమయంలో ఎక్కువ లారీల అవసరాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించేందుకు అక్కడినుండే మిల్లర్లు,లారీ కాంట్రాక్టర్ తో మాట్లాడి లారీలు ఏర్పాటు చేయించారు.తాలు విషయమై రైతులతో ఆమె మాట్లాడుతూ తాలు,తరుగు లేకుండా సరైన తేమ శాతం తో ధాన్యాన్ని తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించడం జరుగుతుందని తెలిపారు .మిల్లర్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లు డౌన్లోడ్ చేసుకోవాలని చెప్పారు. అప్పటికప్పుడే ఆమె సుమారు 30 లారీలను ఏర్పాటు చేయించి 60 కుప్పలు కొనుగోలు కేంద్రం నుండి పంపించే విధంగా చర్యలు తీసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ వెలుగుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సైతం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేయాలని, అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉండాలని, రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని తీసుకువచ్చే విధంగా రైతులకు కౌన్సిలింగ్ చేయాలని మిల్లర్లు, రైతులు, కొనుగోలుదారులు అందరు సమన్వయంతో పనిచేసి రబీ ధాన్యం కొనుగోలు చేయాలని చెప్పారు.ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్ ,జిల్లా పౌర సరఫరాల మేనేజర్ హరీష్, తదితరులు ఉన్నారు.



## 'మన ఊరు-మన బడి' కార్యక్రమం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండలంలోని పల్లెర్ల గ్రామంలో మన ఊరు మన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా మాజీ జడ్పీటీసీ సభ్యులు కోడిత్యాల నరేందర్ గుప్తా మాట్లాడుతూ పిల్లలకు అక్షర జ్ఞానం కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తూ ప్రభుత్వ బడులను నడిపిస్తుంటే పిల్లల తల్లిదండ్రులు మాత్రం ప్రయివేటు పాఠశాల లోనే వారి పిల్లలను చదివిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.వేసవి సెలవుల తరువాత పాఠశాల ప్రారంభం కాగానే గ్రామ ప్రజలు, యువత ఇంటింటికి తిరిగి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ కోరుకంటి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించడానికి అఖిల పక్ష నాయకులు, గ్రామ ప్రజలు సహకరించరించాలని కోరారు. పాఠశాలలో అన్ని మౌళిక సదుపాయాలు ఉన్నాయని ప్రశాంత వాతావరణం నాణ్యమైన విద్య మన ఉపాధ్యాయులు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమయ్య, గ్రామ నాయకులు మేడి శ్రీనివాస్, పొడుగు వెంకటేష్, సోలిపురం ప్రతాప్ రెడ్డి, కంబాలపల్లి కిష్టయ్య, ఉపాధ్యాయులు వెంకట్ నర్సయ్య, శంకర్, విజయ్ కుమార్ రెడ్డి, త్యాగరాజు, శేఖర్, షమీమ్, సమీనా, నాగమల్లు, రవీందర్, విజయ, మోహన్, వేణు తదితరులు పాల్గొన్నారు.

## జెడి వాన్స్, మోదీ దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/సూర్యాపేట:** అమెరికా అధ్యక్షుడు ట్రంపు భారత దేశంపై 26శాతం సుంకాలు వేయడాన్ని నిరసిస్తూ భారత్ పర్యటనకు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్, ప్రధాని మోదీ దిష్టిబొమ్మను బుధవారం కొత్తబస్టాండ్ సమీపంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేవిడ్ కుమార్, ఎఐకెఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్‌కె నజీర్, సిపిఐ పట్టణ నాయకులు కాంపాటి రాము, రైతు స ంఘం జిల్లా కార్యదర్శి దండా వెంకట్ రెడ్డిలు మాట్లాడారు. భారత్ పర్యటనకు వచ్చిన అమెరికా ఉపాధ్యక్షులు జీడి వాన్స్ వ్యవసాయ రంగ పరికరాలు, వ్యవసాయ అనుబంధ రంగం, చేపలు, కోళ్ళ పరిశ్రమలపై చర్చించడానికి వచ్చాడని ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగం తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటుందన్నారు. పంటలలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలవుతూ ఆత్మహత్యలు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంట నాగయ్య, వరికుప్పల వెంకన్న, దేసోజు మధు, నక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.



## సహకార బ్యాంకుల అభివృద్ధి లక్ష్యం

### జిల్లా సహకార అధికారి రాథోడ్ బిక్కు

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** సహకార బ్యాంకుల అభివృద్ధి ద్వారా సహకార సేవలను మరింత విస్తరించనున్నట్లు జిల్లా సహకార అధికారి రాథోడ్ బిక్కు తెలిపారు. బుధవారం పట్టణంలోని యూనివర్సల్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో జిల్లా సహకార ఆడిట్ అధికారి షేక్ మహమూద్, బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్, సిఇఒ కెవిఎస్ఎన్ మూర్తి, బ్రాంచ్ మేనేజర్ ఎం.బాజీరావులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మాట్లాడు తూ సహకార బ్యాంకులను అభివృద్ధి చేయడంతో పాటు సహకార సేవలను మరింత విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇతర బ్యాంకులతో పోలిస్తే డిపాజిట్లపై అధిక వడ్డీ అందిస్తున్నామన్నారు.




## ‘గ్రీవెన్స్‌డే’లో ఫిర్యాదుల స్వీకరణ

**ప్రజాపక్షం/బైంసా :** బుధవారం బైంసా ఎసపి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి బైంసా సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి జిల్లా ఎస్పి డా.జి.జానకి షర్మిల ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా బాధితులకు చట్టపరంగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనపర్చిన సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల విద్యార్థులను ఎస్పి సన్మానించారు. కార్యక్రమంలో అవినాష్ కుమార్, పోలీస్‌సిబ్బంది సైలు, గోపినాథ్, మల్లేష్, ఎస్ఐలు శంకర్, ఆశోక్, రవీందర్ పద్వాల్, గౌస్, జ్యోతి, శిరీష, రఘువీర్ పాల్గొన్నారు.




## విద్యకు ప్రాధాన్యతనిస్తే సమాజం బాగు : కలెక్టర్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** విద్యకు ప్రాధాన్యత ఇస్తే సమాజం బాగుపడుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం మాసాయిపేట మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలను కలెక్టర్ సందర్శించి పాఠశాలలోని వంట గదులు, వాష్ రూంలలో పరిశుభ్రతను పరిశీలించారు. స్టోర్‌రూంను, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. సరుకుల సరఫరాలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్, కిచెన్ షెడ్, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. 9వ తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు క్వాలిటీ విద్య అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచి, శుచికరమైన భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్‌డిఒ జై చంద్రారెడ్డి, తహసీల్దార్ జ్ఞాన జ్యోతి, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** సంగారెడ్డి జిల్లా కంది మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాలలో కొత్తగా నిర్మించిన అదనపు గదులను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్య అందుబాటులో ఉందన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచుకోవాలని వారికి ఏకరూప దుస్తులు ,పుస్తకాలు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ రవీందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళారులకు అమ్మి మోసపోవద్దు

### ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**ప్రజాపక్షం/లోకేశ్వరం :** లోకేశ్వరం మండలంలోని ఐకెపి ఆధ్వర్యంలో మన్మద్, లోకేశ్వరం, ధర్మోర వట్టోలి, నరసింహ నగర్ తండా, పుస్పూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందన్నారు. వరి ధాన్యం క్వింటాలుకు ఏ గ్రేడ్ రకానికి రూ.2320, బి గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2300 మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు పండించిన తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం మల్లేష్, పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు నాయకులు రాజేష్‌బాబు బద్దం గంగారెడ్డి, మాజీ ఎంపిపి నారాయణరెడ్డి, సాయన్న, మాజీ ఎంపిపి లలిత భోజన్న, శంకర్ గౌడ్, శారద, భాస్కర్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## మే20లోగా విద్యార్థులకు యూనిఫాం

### జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** విద్యార్థులకు మే 20లోగా యూనిఫాం అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని యూనిఫాం కుట్టుమిషన్ కేంద్రాలు, భవిత కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిఫాంల కుట్టుపని పూర్తి చేసి, మే 20వ తేదీలోగా మొదటి జతను విద్యార్థులకు తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. కుట్టుమిషన్ కేంద్రాల్లో పనిచేస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలతో డిఇఒ మాట్లాడారు. విద్యార్థుల కొలతల ప్రకారం యూనిఫాంలు కుట్టాలని, ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యమైన యూనిఫాంలు తయారు చేయాలని స్పష్టం చేశారు. హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ నుండి భవిత కేంద్రాల్లోకి విద్యార్థులను చేర్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విలీన విద్య కోఆర్డినేటర్ కటకం మధుకర్, ఎండిఒ వాసాలా ప్రభాకర్, ఎపిఎం పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



**ప్రజాపక్షం/కేరిమేరి :** కేరిమేరి పోలీసుస్టేషన్ నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా ఎన్.మధుకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మండలంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ఆయన కృషి చేస్తానన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యం

### జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ :** మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అందిస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే సూచించారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఫాతిమా స్వయం సహాయక సంఘం పరిధిలోని అంబేద్కర్ సహాయక సంఘం సభ్యురాలు ఎం. లలిత ఏర్పాటు చేసిన విజయ డైరీ పార్లర్‌ను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్‌లతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. తెలంగాణ విజయ డైరీ పార్లర్‌ల ప్రారంభం మహిళలను ఆర్థికంగా బలపరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ దుకాణంలో పాలు, పెరుగు, నెయ్యి, పాల కోవా, పన్నీరు, నెయ్యితో చేసిన ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయని, వేసవిలో ప్రయాణికులకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పాల అభివృద్ధి సహకార సంస్థ సహకారంతో ఈ షాపును ప్రారంభించామని, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రయాణికులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, ఎపిఎం భూమక్క, సెర్ప్ సిబ్బంది, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## నకిలీ విత్తనాలు అమ్మితే ‘పిడి’ యాక్ట్

### ఎస్పి డివి.శ్రీనివాస్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పి డివి. శ్రీనివా రావు బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. నకిలీ విత్తనాల సరఫరాతో రైతులు నష్టపోకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, నకిలీ విత్తనాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. ఆరుగాలం శ్రమించే రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత విత్తన సంస్థలు, డీలర్లు, వ్యాపారులపై ఉందన్నారు. రైతులకు, వ్యవసాయానికి నష్టం కలిగించేలా నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వ్యవసాయం రాష్ట్రానికి, దేశానికి ముఖ్యమైన ఆధారమని, అలాంటి వ్యవసాయం చేసే రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే సహించేది లేదని ఆయన తేల్చి చెప్పారు. కొమరం భీం జిల్లా మహారాష్ట్ర సరిహద్దులో ఉండటంతో నకిలీ విత్తనాలు ఎక్కువగా సరఫరా అయ్యే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ముందస్తు తనిఖీలు నిర్వహించాలని, రైతులకు, డీలర్లకు అవగాహన కల్పించాలని, సరిహద్దుల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి నకిలీ విత్తనాలను నివారించాలని ఆయన పేర్కొన్నారు.

# భూసమస్యల పరిష్కారమే లక్ష్యం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి /వెల్దుర్తి :** భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం భూభారతి చట్టం తీసువచ్చిందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం మాసాయిపేట మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో ఆర్‌డిఒ జైచంద్రారెడ్డి, తహసీల్దార్ జ్ఞాన జ్యోతి, ఎడిఎతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనున్నదని తెలిపారు. భూభారతిలో 6 మాడ్యూల్స్ మాత్రమే ఉండి సులభమైన దరఖాస్తు ప్రక్రియ ఉంటుందని వివరించారు. భూ భారతి చట్టంలో తహసీల్దార్ స్థాయి నుండి సీసీఎల్‌ఏ స్థాయి వరకు సమస్యలను పరిష్కరించే అప్పీల్ వ్యవస్థను వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. భూముల విస్తీర్ణం, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని తెలిపారు. వారసత్వంగా వస్తున్న యజమానులకు పేరు మార్పులు చేయవచ్చని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు చేస్తారని, దీని ద్వారా భూఆక్రమణలకు అవకాశం ఉండదన్నారు. గ్రామ స్థాయిలో సదస్సులు నిర్వహించి భూ సమస్యలు త్వరగా పరిష్కరించడానికి అవకాశం కల్పిస్తామన్నారు. రాబోయే రోజులలో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేస్తారని తెలిపారు. భూమి హక్కుల రక్షణకు భూ భారతి చట్టం ఉపయోగకరమైందన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో రైతులకు మేలు

### కలెక్టర్ అభిలాష అభినవ్




**ప్రజాపక్షం/తానూర్ :** భూభారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, భూసమస్యలను పరిష్కరించి భూయాజమాన్య హక్కులు కాపాడేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ అభిలాష్ అభినవ్ అన్నారు. బుధవారం తానూర్ మండల కేంద్ర రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ధరణి ద్వారా పరిష్కారం కాని సమస్యలకు కొత్త భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సాదా బైనామాల ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ భూములపై పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రభుత్వం క్రమబద్ధీకరించేందుకు వీలు కల్పించిందని వివరించారు. పురాతన అప్పీల్ వ్యవస్థలతో పోలిస్తే, ఈ కొత్త రెవెన్యూ కోర్టుల ద్వారా రైతులకు వేగవంతమైన న్యాయం లభిస్తుందని చెప్పారు.చిన్న సన్నకారు రైతులకు ఉచిత న్యాయ సహాయం అందుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి వార్షికంగా వాటిని ప్రజల ముందు ప్రదర్శిస్తారన్నారు. ఆధార్ తరహాలో భూమికి ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సాదాబైనామా సమస్యలు, అసైన్డ్ భూముల సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అవగాహన సదస్సులో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ లింగమూర్తి, ఎంపిడిఒ నసీరుద్దీన్, పిఎసిఎస్ చైర్మన్ నారాయణరావు పటేల్‌లతో పాటు రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులకు ఉచిత న్యాయసహాయం

### జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు




**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారానికి రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. మునిపల్లి మండల కేంద్రంలో భూ భారతి చట్టం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ మాధురితో కలిసి కలెక్టర్ క్రాంతి హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన భూ చట్టంతో భూ సమస్యలు పరిష్కారం కాబోతున్నాయన్నారు. భూభారతి చట్టంలో సమస్యలు, అభ్యంతరాలు తెలియజేసే అవకాశం కల్పించిందన్నారు. రైతులు భూయజమానులు భూభారతి చట్టం ద్వారా తమ భూసమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. తమ సమస్యలను హెల్ప్ డెస్క్ లో అందజేయవచ్చన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి రెవెన్యూ అధికారులు రైతులు, రైతు సంఘ నాయకులు, ప్రజాప్రతినిదులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# రికార్డుల్లోని తప్పుల సవరణకు అవకాశం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/కాసిపేట :** భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంతో రికార్డులలోని తప్పుల సవరణకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి హరికృష్ణ, తహసీల్దార్ భోజన్నలతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై ప్రతి రైతుకు పూర్తి అవగాహన ఉండాలని, ఈ చట్టం ద్వారానే భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. చట్టంలో పొందుపరిచిన అంశాలు, రైతులకు కల్పించిన హక్కులపై సమగ్రమైన అవగాహన కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలకు ముందు భూముల యొక్క సమగ్ర సర్వే నిర్వహించి మ్యాప్ తయారు చేస్తామని ఆయన వివరించారు. పెండింగ్‌లో ఉన్న సాదా బైనామాల దరఖాస్తులను పరిష్కరిస్తామని, వారసత్వంగా సంక్రమించిన భూములకు విరాసత్ చేసే ముందు నిర్ణీత సమయంలో సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత వారసులకు నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. పాసు పుస్తకాలలో భూమి పటం ఉంటుందని, భూ సమస్యల పరిష్కారానికి అప్పీల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాలలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ప్రకటించారు. ఎంపిక చేసిన మండలాల్లో జూన్ 2వ తేదీ వరకు సమస్యలను పరిష్కరిస్తామని, మిగిలిన మండలాల్లోని సమస్యలను గుర్తించి ఆగస్టు 15వ తేదీలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామని, సర్వే ప్రక్రియ కోసం సంబంధిత సర్వేయర్లు, ఇతర అధికారుల నియామకంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ

### ఎఎస్‌పి చిత్తరంజన్



**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** పట్టణంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ ఉంటుందని ఎఎస్‌పి చిత్తరంజన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో 100 సిసి కెమెరాలతో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సిఐ రవీందర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎఎస్‌పి చిత్తరంజన్ మాట్లాడారు. నేరాల నియంత్రణలో సిసి కెమెరాల పాత్ర కీలకమన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని పలు ముఖ్య ప్రదేశాలలో 100 సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలు, ర్యాష్ డ్రైవింగ్ చేసిన వాహనాలు, జిల్లాకు వచ్చే అనుమానిత వాహనాలను గుర్తించేందుకు ఆధునిక ఆటోమేటిక్ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించినా, మైనర్లు వాహనాలు నడిపినా, ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేసినా, అనుమానిత వాహనాలు వచ్చినా ఈ ఆటోమేటిక్ సిసి కెమెరాల ద్వారా గుర్తించడం జరుగుతుందన్నారు. వీటి ఆధారంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను, అనుమానిత వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ ప్రజలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

### సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత మొదలైందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సంగారెడ్డి పట్టణ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదిన వరంగల్ లో నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేశారు. సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు. సభ సమయాన్ని వివరించి ఎప్పుడు బయలు దేరాలి అన్న సమయాన్ని వివరించారు. సభలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానలపై ఉద్యమ కార్యాచరణ దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకం మొదలైందని, సోషల్ మీడియాలో ప్రభుత్వంపై ప్రజలు దుమ్మెతి పోస్తున్నారన్నారు. మళ్ళి కెసిఆర్ పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు. కెసిఆర్ బహిరంగ సభతో దేశ రాజకీయల్లో చర్చ జరుగుతుందన్నారు. కాంగ్రెస్, బిజెపిలకు నిద్రపట్టదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కార్యక్రమంలో టిఎన్‌జిఒఎస్ మాజీ అధ్యక్షులు , మామిళ్ల రాజేందర్, సీనియర్ నాయకులు హక్కిమ్, వేణు గోపాలస్వామి, సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్లు కార్యదర్శి నర్సింలు నాగరాజ్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అఘోరీకి 14 రోజుల రిమాండ్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** రాష్ట్రంలో సంచలనం రేపిన అఘోరీ అలియా శ్రీనివాస్ అరెస్ట్ కేసు విచిత్రమైన మలుపులు తిరుగుతుంది. ఓ చీటింగ్ కేసులో అరెస్టు చేసిన అఘోరీని బుధవారం రంగారెడ్డి పోలీసులు చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. అక్కడ న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్ విధించగా అఘోరీ శ్రీనివాస్‌ను సంగారెడ్డి జిల్లా కంది సెంట్రల్ జైలుకు తరలించారు. అయితే ఇక్కడ జైలు అధికారులకు అఘోరీని ఏ బారక్ లో ఉంచాలో అనే టెన్షన్ పట్టుకున్నది. అయితే లింగ నిర్ధారణ జరిగితే గాని ఇక్కడ ఉంచుకోలేమంటూ చెప్పడంతో తిరిగి అఘోరీని కోర్టుకు పంపించారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు డాక్టర్ల వైద్య పరీక్షల అనంతరం లింగ నిర్ధారణ జరగనుంది. రిపోర్టు ఆధారంగా అఘోరీని చంచల్‌గూడ జైలుకు తలిస్తారా లేకపోతే మహిళా ఖైదీలు, ఉన్న జైలుకు పంపిస్తారా అనేది తెలుస్తుంది. మొత్తానికి అఘోరీ ఆడా.. మగా అని పోలీసుల్లో అయోమయం నెలకొంది. లింగ నిర్ధారణ కోసం ఆస్పత్రికి తరలించారు.

## ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం.. పెళ్లి.. పోలీసులకు ఫిర్యాదు

**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ యువకుడికి ఓ మైనర్ బాలిక పరిచయమైంది. అది కాస్త ప్రేమగా మారింది. ఇద్దరు మధ్య ప్రేమ చిగురించడంతో ఆ మైనర్ బాలికను యువకుడు తీసుకెళ్లిపోయాడు. జిల్లాలు వేర్వేరు కావడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన బాధితురాలి తండ్రి తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా నాగపురి గ్రామానికి చెందిన మాంగోల్ నరేష్ అనే యువకుడు(32) ఎలక్ట్రిషియన్ పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో నరేష్ ఇన్‌స్టాగ్రామ్‌లో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరు ఇన్‌స్టాగ్రామ్‌లోనూ, ఫోన్‌లోనూ ఛాటింగ్ చేసుకోవడం, తరచూ మాట్లాడుకోవడం జరిగేది. తనకు విద్యుత్ శాఖలో ఉన్నత స్థానంలో ఉద్యోగం ఉందని నమ్మబలికి ఈ నేపథ్యంలో తనను పెళ్లి చేసుకోవాలని చెప్పాడని, అయితే ఆ బాలిక అడ్డు చెప్పడంతో బలవంతంగా 2023 నవంబర్ నెలలో నరేష్ తన కూతురును జాన్కంపేట్ శివారులోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో పెళ్లి చేసుకొని తన ఇంటికి తీసుకెళ్లాడని తెలిపారు. ఈ క్రమంలో ఆ మైనర్ బాలికపై శరీరకంగా, మానసికంగా బాధించాడని, అలాగే బాలిక వద్ద గల నాలుగు తులాల బంగారం, రూ. 20వేల నగదు నరేష్ తీసుకున్నాడని తెలిపారు. ఈ క్రమంలో రెండున్నర నెలల తరువాత తన కూతురు ఇంటికి చేరుకొందని, అయితే ప్రెగ్నెన్సీ టెస్ట్‌లో పాజిటివ్ రావడంతో ఆమెను నరేష్ వద్దకు పంపారు. అయితే ఆ బాలికతో న్యూడ్ వీడియోల్లో నటించామని నరేష్ ఒత్తిడి తీసుక రావడంతో ఒప్పుకోని తన కూతురును కొట్టడం ప్రారంభించాడని, దీంతో 2024 అక్టోబర్ నెలలో ఇంటికి తిరిగి వచ్చిందని తెలిపారు. ఈ మేరకు ఇటీవల ఓ మగ బిడ్డకు జన్మనిచ్చిందని, అయితే నరేష్ తిరిగి వస్తాడని చూసిన వారికి నిరాశ ఎదురు కావడంతో తాము మోసపోయామని గ్రహించి ఎడపల్లి పోలీసులకు నరేష్‌పై ఫిర్యాదు చేశారు.

## విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాపక్షం/రామడుగు : మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ సిఈసి విభాగంలో మొదటి సంవ త్సరం పరీక్షలు రాసిన మోతె గ్రామానికి చెందిన భోగ వసంత వీరేశం దంపతుల కూతురు భోగ శ్రీజ రాష్ట్రస్థా యిలోనే మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించి రూపాదేవి ఫౌండేషన్ ద్వారా రూ.25 వేలు చెక్కును ఆర్థిక సహాయంగా అందించారు. భవిష్యత్తులో మరింత కష్టపడి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామడుగు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్, ఉపాధ్యాయులు , కాంగ్రెస్ నాయకులు బొమ్మరవేణ తిరుపతి, బండారి భువన్, తడగొండ హనుమంతు తదితరులున్నారు.



## దళారులను నమ్మొద్దు

### జమ్మికుంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ సదానందం

ప్రజాపక్షం/జమ్మికుంట : జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించిన పంటలను దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆర బెట్టి మద్దతు ధరను పొందాలని కోరారు.సన్నవడ్లకు క్వింటాలకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్తు తో పాటు ఏకకాలంలో ఎరువులు, సబ్సిడీ పరదాలు వంటి అనేక సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఐకెపి ఏపిఎం శ్రీనివాస్, సిసి మ్యాకమల్ల రాజమౌళి, కాంగ్రెస్ జమ్మికుంట మండల ప్రధాన కార్యదర్శి మ్యాకమల్ల అశోక్‌తో పాటు పాల్గొన్నారు.



## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన తేజస్




ప్రజాపక్షం/కొత్తపల్లి:ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో తేజస్ అకాడమీ విద్యార్థులు సత్తాచాటి మెరుపు ఫలితాలను సాధించినట్లు చైర్మన్ సిహెచ్ సతీష్‌రావు తెలిపారు. బుధవారం కొత్తపల్లి అకాడ మీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సతీష్‌రావు మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో ఎ.శ్రీవర్ధన్ 466, బి.రిషిత్ యాదవ్ 466, ఎం.వర్షిత్ 465, ఎ.నందీశ్వర్ 464, ఎ.విఠల్ 462, సీఈసీ సిఇసి మొదటి సంవత్సరంలో బి.రామ్ చరణ్ 490, జి.రాజేందర్ 483, ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో కె.మా రుతి 993, ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసిలో ఎ.పర్శరాములు 969, సిఇసిలో ఎం.మనోజ్ కుమార్ 929 మార్కు లతో అత్యుత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో సత్తా చాటినట్లు తెలిపారు. తేజస్ డిఫెన్స్ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రెండు వేలకు పైగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరం బాలికల కోసం ఇంటర్, డిఫెన్స్, ఐఐటి, నీట్ కోచింగ్ ప్రారంభిస్తామని, ఒత్తిడిలేని చదువులతో అత్యుత్తమ ఫలితాలు సాధించడం తమ ప్రత్యేకతన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జెఇఇ మెయిన్స్‌లో సెయింట్‌జార్జి విద్యార్థి అద్భుత ప్రతిభ



ప్రజాపక్షం/కొత్తపల్లి : కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో సిబిఎస్ఈలో చదువుతున్న కె.సాయి స్మరణ్ ఇంటర్మీడియట్ పూర్తి చేసి జెఇఇ మెయిన్స్ 2025లో ఇటీవల వచ్చిన ఫలితాలలో 95.5 పర్సంటైల్‌తో అద్భుత ప్రతిభ కనబరిచినట్లు చైర్మన్ డాక్టర్ ఫాతిమా రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో ఫాతిమా రెడ్డి విద్యార్థి సాయి స్మరణ్‌ను,తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు. 12వ తరగతిలో 8 మంది విధ్యార్థులు ఉండగా అందులో ఒక విద్యార్థికి జెఇఇ మెయిన్స్‌లో చాలా మంచి పర్సంటేజ్ రావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు.

## గురుకులంలో విరిసిన విద్యాకుసుమం

### ఇంటర్ లో 995 మార్కులు సాధించిన మీనాక్షి



ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి: జగిత్యాల జిల్లా లోని గురుకుల విద్యార్థిని మీనాక్షి ఇంటర్ మీడి యేట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించిందని ప్రిన్సిపల్ తెలిపారు. మల్యాల మండలం తాటిపల్లి గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాలలో విద్యా ర్థులు ప్రతిభకనబరిచారు. ఈ కళాశాలలో చదువుతున్న కొడిమ్యాల మండలానికి చెందిన ఆకు నూరి మీనాక్షి బైపీసీలో 995 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించింది.ఆమెకు తల్లిదండ్రులు లేనప్పటికీ ఏ మాత్రం కుంగిపోకుండా తన సోదరిల ప్రోత్సాహంతో మంచి మార్కులు పొందిందని, మీనాక్షిని అభినందించారు. అలాగే జగిత్యాల ఆల్ఫోర్స్ కాలేజీలో చదివిన రాధ నిఖి త ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి విభాగంలో 963 మార్కులు సాధిం చింది. ఈమెను కాలేజీ యాజమాన్యం అభినందనలు తెలిపారు.

## నేడు భూభారతి చట్టంపై అవగాహన

ప్రజాపక్షం/ముత్తారం : భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టంపై గురువారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి అనూష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు కలె క్టర్, ఆర్‌డిఓ హాజరుకానున్నట్టు చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ చట్టం గురించి రైతులకు అవగాహన కల్పించడంతో పాటు కొత్త చట్టంలోని ప్రయోజనాల ను వివరించి, సందేహాలను నివృత్తి చేయనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, రైతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

## అంతర్రాష్ట్ర ఇద్దరు దొంగలు అరెస్టు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అంతర్ రాష్ట్ర దొంగలముఠాలోని ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన కరీంనగర్ పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. గత సంవత్సరం జులై నెలలో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంటూరుపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇం టిలో చొరబడి రూ.2.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరణ, కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని మల్కాపూర్ రోడ్డు, పివిఆర్ గార్డెన్స్ సమీపంలోని రాజేంద్రప్రసాద్ ఇంటి తాళాలు పగలగొట్టి మద్యం సీసాలతో పాటు హీరో హోండా మోటార్ సైకిల్‌ను అపహరించినట్లు తెలిపారు. ఈ ఘటనలపై సమాచారం అందుకున్న కరీంనగర్ రూరల్ , కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాకు చెందిన ప్రదీప్ (29), విక్రమ్, హత్రుసింగ్(41), జితేన్‌గా గుర్తించబడ్డారని తెలిపారు. వీరిపైకొత్తపల్లి , కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు నమోదు చేయబడ్డాయి. ప్రధాన నిందితుడైన ప్రదీప్‌ను గతమార్చి నెలలో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన వెల్లడించారు. ఈ కేసులో మరో నిందితుడైన హత్రుసింగ్ మధ్యప్రదేశ్ లోని ధార్ జిల్లా నరవాలిలో ఉన్నాడని సమాచారం మేరకు కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి మంగళవారం అతడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడం తో జైలుకు తరలించినట్లు తెలిపారు.మరో ఇద్దరు నిందితులు విక్రమ్, జితేన్ ఇంకా పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు. కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, అతని సిబ్బంది శ్రీనాథ్, అబ్దుల్ ఖదీర్, షరీఫ్, సాంబరెడ్డి, దేవేందర్‌లను రూరల్ ఏసిపి అభినందించారు.

# సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం

### ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి : ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారంఎలిగేడు మండలం, బురహానిమియాపేట, సుల్తాన్ పూర్ గ్రామాలల్లో ఐకేపీ అండ్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన అనంతరంఎలిగేడు మండలంలోని సుల్తాన్ పూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎలిగేడు మండలానికి సంబంధించిన వివిధ గ్రామాల కు చెందిన 24 కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు రూ.24, 2,784లక్షల చెక్కులను, అలాగే 69 మంది లబ్దిదారులకు రూ.20,27, 500 / లక్షల విలువగ్ర గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. అంతకు ముందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదోవ తరగతిలో 10జీపి సాధించిన విద్యార్థులకు ప్రశ ంసా పత్రాలను అందించి ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదప్రజల వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ అనేది తోడ్పాటును అందిస్తుందని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. నియోజకవర్గానికి ఎనలేని అభివృద్ధి పనులు మంజూరు చేశారని, రానున్న కాలంలో గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పని చేయనున్నట్లు పేర్కొన్నారు.

### సుల్తాన్‌పూర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన :

ఎలిగేడు మండలంలోని సుల్తాన్ పూర్ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథ కం ద్వారా ఎ.ఎ.పి నిధులు, స్పెషల్ ఫండ్స్ ద్వారా నూతన వంట గది, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు,ఇతర ప నులకు రూ.43,00, 000/ లక్షల రూపాయల నిధులతో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక నా యకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తానే స్వయంగా భోజనా న్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ బషీర్, ఎండిఓ భాస్కర్ రావు, డిఇ దేవందర్, ఎఈ రవీందర్,ఎపిఎం సుధాకర్ కాంగ్రెస్ అధ్యక్షులు సమా రాజశ్వర్ రెడ్డి,మాజీ సర్పంచులు,అర్షణపల్లి వెంకటేశ్వర్ రావు, కొండా తిరుపతి గౌడ్, దుగ్యాల సంతోష్ రావు, గోపు విజయ భాస్కర్‌రెడ్డి, థాం పర్తి వెంకటేశ్వరరావు , బూర్ల సత్యనారాయణ, మాజీ ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులుపాల్గొన్నారు.

## 25న కార్మిక సంఘాల జిల్లా సదస్సు

### ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి: నరేంద్రమోడీ ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని మే 20న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె నిర్వహించనున్నట్లు, అందులో భాగంగా ఈనెల 25న స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా సన్నాహక సదస్సుకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపు నిచ్చారు. కరీంనగర్‌లోని బైపాస్ రోడ్‌లో గల సిమెంట్ గోదాం హమాలీ కార్మికుల సమావేశం జంగం తిరుపతి అధ్యక్షతన గోదాం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి శ్రమిస్తున్న ప్రజల జీవితాలు, జీవనోపాధిపై కార్పొరేట్ కుంత్రాలు అమలు చేయాలని ప్రయత్నిస్తుందన్నా రు. ఫలితంగా దేశంలో పేదరికం, ఆకలి, పోషకాహార లోపం, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల నుంచి లాక్కుంటున్నారని, పనిగంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత, పని పరిస్థి తులకు సంబంధించిన అన్ని ప్రాథమిక హక్కులను తీవ్రమైన సవాలుగా పరిగణించబడుతున్నాయన్నారు. యూనియన్ హక్కులు, గుర్తింపు, సమిష్టి నిరసనల హక్కు, భావ వ్యవస్థీకరణ హక్కు, తీవ్రమైన సవాలుగా మారాయన్నారు. అసంఘటిత కార్మికుల జీవన ఉపాధికి సంబంధించి ప్రాథమిక హక్కులను దూరం చేస్తున్న నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాల ఫెడరేషన్లు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. కార్మికులంతా ఏకమై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సిమెంట్ గోదాం హమాలీ అధ్యక్షుడు జంగం తిరుపతి, ఉపాధ్యక్షుడు బాగోతం వీరయ్య, నాయకులు ననవేని కొమురయ్య, ననవేని శ్రీనివాస్, పల్లెర్ల రాములు గౌడ్, ముత్యాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారిని లబ్ధిదారులుగా గుర్తింపు

### జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్




ప్రజాపక్షం/జగిత్యాలప్రతినిధి : అర్హులైన వారిని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు .ఇందిరమ్మ ఇండ్లు మంజూరి కొరకై లబ్ధిదారులు అర్హత పరిశీలించుట శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్లో ఏర్పాటుచేసిన కార్యక్రమం లో అడిషనల్ కలెక్టర్ బి ఎస్‌లతాతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టబడిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకం ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కొరకై సొంత స్థలం కలిగి ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించుట కొరకై జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నలుగురిని గెజిటెడ్ స్పెషల్ ఆఫీసర్ లను మండలాల వారిగా కమిటీలు ఏర్పాట్లు చేసి పకడ్బందీ గా అవకతవకలు తావు లేకుండా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇల్లు లేని నిరుపేదలు దరఖాస్తులు చేసుకున్న వారికి పకడ్బందీగా వెరిఫికేషన్ చేయాలని అధికారులను సూచిం చారు. జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రాజెక్టర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయను న్నదిఈ శిక్షణ కార్యక్రమంలో వచ్చిన అధికారులను ఉద్దేశించి రాష్ట్ర అధికారాలకు ఆదేశాల మరియు సూచనలు పాటిస్తూ ఆయా గ్రామంలోని ఇందిరమ్మ కమిటీల ద్వారా దరఖాస్తుల జాబితా లను పరిశీలిస్తూ ఇల్లు లేని నిరుపేదలకు గుర్తించి వలసిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి ఎస్ లత,హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్,రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎంపీడీవో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అత్యుత్తమ విద్య ద్వారా సంచలనాత్మక విజయాలు

### ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి




ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : విద్యార్థులకు అత్యుత్తమ విద్య ద్వారా సంచలనాత్మక విజయాలను నమోదు చేయవచ్చని, నాణ్యమైన బోధన ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. ఇందుకు నిదర్శనం ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలేనని పేర్కొన్నారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, పురానిపేటలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో అట్టహాసంగా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో జగిత్యాల అల్ఫోర్స్ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశానికి ముఖ్య అతి థిగా హాజరై మాట్లాడారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర కృషితో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ద్వితీ య స్థానం మార్కులు మరియు జగిత్యాల జిల్లాలో అగ్రస్థానం సాధించడం చాలా చారిత్రా త్మక విజయం అని కొనియాడారు.ఈ ఫలితాలను సాధించడంలో అధ్యాపకుల కృషి ఎంతగానో చెప్పడంలో అతిశయోక్తి లేదని చెప్పారు. ముఖ్యంగా తల్లిదండ్రులు రెండు సంవత్సరాలు పాటు వారు అందించిన సహకారం చాలా అమూల్యమైనదని, అభినందనీయమని తెలిపారు. అభినందన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పుష్ప గుచ్ఛాలు అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలను అద్భుతంగా సాధించి జిల్లాకు వన్నె తేవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్,బోధన, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.అభినందన సభలో భాగంగా విద్యార్థులు తల్లిదండ్రులు నరేందర్‌రెడ్డి విద్యాసంస్థల్లో అనుస రిస్తున్న బోధన పద్ధతులు చాలా ఆదర్శనీయమైనవని ప్రశంసించారు.

# భూభారతితో పొరపాట్ల సవరణకు అవకాశం



### అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి : రైతుల భూములకు సంబంధించి పాస్ పుస్తకాల్లో పొరపాట్ల సవరణకు భూ భారతి చట్టంలో అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలం గాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం) 2025 పై బుధవారం చొప్పదండిలోని ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు.వారు మాట్లాడుతూ రైతుల కు వారి భూములపై భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూభారతి చట్టం ద్వారా లభించనుందన్నారు.4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, తదుపరి భూములకు సంబంధించిన సమ స్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆధారాలతో దరఖాస్తు చేస్తే పాస్ పుస్తకాల్లోని తప్పులను సవరిస్తామని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయికి అధికారులకు సైతం భాధ్యతలు అప్పగించారని, దీనివల్ల భూమికి సంబంధించిన చిన్న సమస్యలు మండల స్థాయిలోని సత్వరం పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. కరీంనగర్ ఆర్‌డిఓ మహేశ్వర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ నవీన్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, వ్యవసాయ అదనపు సహాయ సంచా లకులు ప్రియదర్శిని, మండల ప్రత్యేక అధికారి తిరుపతిరావు, కాంగ్రెస్ నాయకులు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పద్మాకర్ రెడ్డి, రెవెన్యూ, వ్యవసాయ, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

### -అంగన్‌వాడీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి - కలెక్టర్

ప్రతి మహిళా తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. చొప్పదండి మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ పక్షం ముగింపు ఉత్సవాలకు కలెక్టర్ హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మహిళ పోషకాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలతో వండిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. పిల్లలకు పోషకా హారంతో పాటు కార్పొరేట్‌కు ధీటుగా విద్యను నేర్పుతున్న అంగన్‌వాడీల్లో ఆరు సంవత్సరాలలో పిల్లలందరినీ చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సిడిపిఓ నర్సింగారాణి, ప్రత్యేక అధికారి తిరుపతిరావు, డిసిపిఓ పర్వీన్, తహసీల్దార్ నవీన్ కుమార్, మెడికల్ ఆఫీసర్ శ్రీకీర్తన, సూపర్‌వైజర్ శశి కుమారిలు పాల్గొన్నారు.

### సందేహాల నివృత్తికి కృషి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ప్రజాపక్షం/మంథని : భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం పై రైతులకు ప్రజలకు ఉన్న సందేహాలను పూర్తిస్థాయిలో నీ వృత్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం మంథని మండలంలోని నాగారం రైతు వేదిక వద్దనిర్వహించిన భూ భారతి చట్టం అవగా హన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు.భూ భారతి చట్టం లోని వివిధ అంశాలను కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం ఆప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూ మి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకో వచ్చునన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. భూమి హ క్కు కలిగిన రైతులందరికీ 300 రూపాయల ఫీజు తో పాస్ బుక్ జారీ చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవె న్యూ డివిజన్ అధికారి సురేష్ , మంథని తహసిల్దార్ కుమార స్వామి, రైతులు, ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు,సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.



## తెలంగాణ ఏర్పాటులో పెద్దపల్లి జిల్లా పాత్ర కీలకం

### ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత




ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: తెలంగాణ ఉద్యమంలో పెద్దపల్లి జిల్లా కీలకంగా పనిచేసిందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఉద్యమ సమయంలో సింగరేణి సమ్మె చేస్తే ఢిల్లీకి ఉద్యమ సెగ తగిలిందని గుర్తు చేశారు.పెద్దపల్లి జిల్లాలో గురువారం పర్యటించిన ఎమ్మెల్సీ కవిత.. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ తెలంగాణ ప్రజల గుండె చప్పుడైందని, పతి ఒక్కరితోనూ బిఆర్ఎస్ పెనవేసుకుందని, తెలంగాణ ప్రజలతో పార్టీది పేగుబంధమని వ్యాఖ్యానించారు. గత 25 ఏళ్లుగా ఉద్యమ, బిఆర్ఎస్ పాలనా కాలాన్ని ప్రజలంతా నెమరేసుకునేలా ఈనెల 27న వరంగల్ లో జరగబోయే సభ ఉండబోతుందని చెప్పారు. ఈ రజతోత్సవ సభకు పెద్దపల్లి జిల్లా నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. చరిత్రలో నిలిచిపోయేలా, తెలంగాణ కుంభమేళాగా సభ జరగనుందని చెప్పారు.పెద్దపల్లి కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టి రైతులకు భరోసా లేకుండా చేసిందని మండిపడ్డారు. వ్యవసాయం చేయాలంటే రైతులు భయపడే స్థితికి తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనని ఆమె వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే కోరుకొండ చందర్, మాజీ జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మ ణరావు, చిరుమిళ్ళ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రదాడిపై బిజెపి ప్రభుత్వానిదే బాధ్యత

### * రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్



ప్రజాపక్షం/గోదావరిఖని : కాశ్మీర్ పహేల్గామ్ లోజరిగిన ఉగ్రదాడిలో అసువులు బాసిన బాధిత వ్యక్తుల కుటుంబాలకు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, ఉగ్రదాడిని ఖండిస్తున్నట్లు రామగుండం ఎమ్మెల్యే, కాంగ్రెస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మక్కన్‌సింగ్ తెలిపారు. బుధవారం గోదావరిఖని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముష్కరుల దాడి పూర్తి బాధ్యత బిజెపి ప్రభుత్వానిదేనన్నారు. కాశ్మీర్‌లో పర్యాటకులకు భద్రత కల్పించలేని పరిస్థితి నెలకొందన్నారు. బిజెపి ప్రభుత్వం దేశ ప్రజలకు రక్షణ ఇప్పించలేని స్థితిలో ఉందన్నారు. ఉగ్రదాడికి పూర్తి బాధ్యత వహిస్తూ భారత ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌నగర, పట్టణ అధ్యక్షులు బొంతల రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, నాయకులు మహంకాళిస్వామి, కాల్వ లింగస్వామిలు పాల్గొన్నారు.

## కార్మికులకు సగం జీతంతో ప్రత్యేక సెలవు

### ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణి లో గతంలో ఉన్న ఏడు వ్యాధులకు అదనంగా కాలేయ వ్యాధిని చేర్చి వేతనంతో కూడిన సెలవు మంజూరు కోసం ఉత్తర్వులు జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. తీవ్ర కాలేయ వ్యాధి (లివర్ సిరోసిస్) బారిన పడిన సింగరేణి కార్మికులకు 50 శాతం వేతనంతో కూడిన ప్రత్యేక సెలవు మంజూరు చేయ నున్నట్లు సింగరేణి యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొందని ఆయన తెలిపారు. తీవ్ర కాలేయ వ్యాధికి గురైన కార్మికునికి స్పెషల్ లీవు మంజూరు చేయవచ్చని, వ్యాధి నయమై, విధులకు ఫిట్ అయ్యేంతవరకు అతనికి 50 శాతం వేతన మొత్తం (బేసిక్ పే, వీడిఏ, ఎస్‌డిఏలో 50 శాతం) చెల్లించవచ్చని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

### జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్‌ను జనరల్ అసిస్టెంట్‌గా మార్చుతూ సర్క్యులర్ జారీ


సింగరేణిలో జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్‌పై పని చేస్తున్న కార్మికులను ఇక నుండి వారి డిజిగ్నేషన్‌ను జనరల్ అసిస్టెంట్‌గా మార్పు చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌పేర్కొన్నారు. ఇది కార్మికుల ఘనవిజయంగా భావిస్తూ, భవిష్యత్తులో కార్మి కులందరు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముం దుకు కదులు దామని, సంస్థ పరిరక్షణ కోసం ఎఐటియుసి ఇచ్చే పోరాటాల్లో భాగస్వాములు కావాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఫోకస్ కళారంగం

## ప్రజాదరణ పొందిన బ్యాలెట్..



క్యూబాలో బ్యాలెట్ అత్యంత ప్రజాదరణ పొందిన, ఎక్కువ మంది దృష్టి కేంద్రీకరించిన నృత్య ప్రాంతాలలో ఒకటిగా చెప్పుకోవచ్చు. బ్యాలెట్ ప్రదర్శనలు క్యాబరేలో ఉంటాయి. ఇక్కడ ప్రజలు వెళ్లి ప్రదర్శనలను చూస్తారు. వేదిక చుట్టూ ఆహారం, పానీయాలను తీసుకుంటూ బాలెట్‌లను ఆస్వాదిస్తారు. ముఖ్యంగా బ్యాలెట్ ప్రదర్శన జరుగుతున్నప్పుడు క్యాబరేలు బాగా ప్రసిద్ధి చెందాయి. అయితే పారిస్ ఒపెరా బ్యాలెట్ వంటి ప్రధాన థియేటర్లలో మరింత అధునాతన బ్యాలెట్ ప్రదర్శనలు జరుగుతాయి. క్యూబాలో దేశవ్యాప్తంగా బ్యాలెట్ పాఠశాలలు ఉన్నాయి. హవానా లోని క్యూబన్ నేషనల్ బ్యాలెట్ స్కూల్ (ఎస్క్యూలా నేషనల్ క్యూబానా డి బ్యాలెట్) వీటిలో అత్యంత పెద్దది. ఇందులో సుమారు 3,000 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రపంచంలో ఇంత మంది విద్యార్థులుగల బ్యాలెట్ స్కూల్ మరెక్కడా లేదు. దీనికి రామోనా డి సా దర్శకత్వం వహించారు. క్యూబన్ నేషనల్ బ్యాలెట్ కూడా హవానాలో ఉన్న ప్రసిద్ధ బ్యాలెట్ సంసగా వెలుగుతున్నది. ఇంకా ఎన్నో పేర్లతో వివిధ రకాల బ్యాలెట్లు ఉన్నాయి. కానీ అత్యంత గుర్తింపు పొందిన వాటిలో ఒకటి సైకో బ్యాలెట్. ఇది 1973లో అలిసియా అలోన్సో అభివృద్ధి చేసిన చికిత్సా కళ. స్వీయఅభివృద్ధిని పెంపొందించడానికి ఈ బ్యాలెట్ ప్రసిద్ధి చెందింది. మానసిక, శారీరక వైకల్యాలతో బాధపడుతున్న వారి కోసం 17 దేశాలలోని అనేక ఆసుపత్రులు, పాఠశాలలు, కమ్యూనిటీ సెంటర్లలో సైకో బ్యాలెట్‌ను ఒక బృంద నాయకుడు, మనస్తత్వవేత్త బోధిస్తాడు. వ్యక్తిత్వం, పెరుగుదల, ఉన్నత జీవన నాణ్యత యొక్క వ్యక్తి యొక్క భావాన్ని మెరుగుపరచడం, బలోపేతం చేయడం వంటి అంశాలను లక్ష్యంగా చేసుకొని ఈ బోధనలు ఉంటాయి. దీనిని ప్రస్తుతకాల 'కౌన్సెలింగ్'లతో పోల్చవచ్చు. ఈ రకమైన చికిత్సను అనుభవించిన ఇతర దేశాలు అవసరమైన వారికి మార్గనిర్దేశం చేయడం..నయం చేయడం కొనసాగిస్తున్నందున మరిన్ని పరిశోధనలను అభివృద్ధి చేస్తున్నాయి. క్యూబన్ బ్యాలెట్ దేశ నృత్య సంస్కృతికి వలసరాజ్యాల తర్వాత పునఃస్థాపనను ప్రోత్సహించింది. నృత్య సమాజానికి ఇది భారీ మలుపు. ఎందుకంటే నృత్యం దాని పట్ల మక్కువ ఉన్నవారికి మాత్రమే కాదు, ఆసక్తి ఉన్నవారికి, కానీ వారు అలా చేయగలరని ఎప్పుడూ అనుకోని వారికి కూడా. క్యూబాలో బ్యాలెట్ ఒక ఉన్నత వృత్తి అని అందరికీ తెలుసు. వైద్యుల కంటే ఎక్కువ సంపాదించడంతో ప్రవేశం తీవ్రంగా ఉంటుంది.



# 'సల్సా' పుట్టినిల్లు క్యూబా



ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ పొందిన సల్సా నృత్యం పుట్టినిల్లు క్యూబా దేశమనే విషయం చాలా తక్కువ మందికి తెలుసు. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లోనూ ఏదో ఒక సందర్భంలో సల్సా నృత్య ప్రదర్శనలు జరుగుతునే ఉంటాయి. న్యూయార్క్‌లో ప్రసిద్ధి చెందిన 'చాచాచా', మాంమో వంటి సంప్రదాన నృత్య రూపాల నుంచి సల్సా ఉద్భవించింది. స్వింగ్ డ్యాన్స్, హస్టిల్ నృత్య రీతులోని అంశాలతోపాటు, గ్వాగువాంకో, పచంగా వంటి ఆఫ్రోక్యూబన్ మరియు ఆఫ్రోకరేబియన్ నృత్యాల అంశాల మేలికలయిక సల్సాలో చూడవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే, అనేక రకాల నృత్య శైలులు కలిగిన విశిష్ట కళారూపమే సల్సా. నిజానికి సల్సా అనేది ఏ ఒక్క శైలికే పరిమితం కాలేదు. అనేక శైలులను చూడవచ్చు. ఒక నృత్యకారుడు అడుగు పెట్టడం ద్వారా బరువును మార్చుకున్నప్పుడు, పైభాగం సమతలంగా ఉంటుంది. ఈ బరువు మార్పులు సల్సా నృత్యంపై ఎలాంటి ప్రభావం చూపదు. అయితే, బరువు మారడం వల్ల తుంటి కదలికల్లో మార్పులను స్పష్టంగా గమనించవచ్చు. ఇందులో భాగంగానే చేయి, భుజం కదలికలను కూడా చేర్చారు. క్యూబాలో పుట్టిన సల్సాను వివిధ దేశాల కళాకారులు తమతమ దేశాలు లేదా ప్రాంతాలకు అనుకూలంగా మలచుకున్నారు. దీనితో నృత్య రీతుల్లో కొద్ది పాటి మార్పులు తప్పలేదు. క్యూబన్ మాతృకలో మాత్రం క్యాసినో శైలి కనిపిస్తుంది. గణనీయమైన కదలికలకు కేంద్రమవుతుంది. భుజాల కదలికలతోపాటు, పక్కటెముకల కదలిక కూడా చేరుతుంది. నృత్య రూపకంలో పాల్గొన్న ఇతరులతో సంభాషించడానికి లేదా తన అభిప్రాయాలుతెలపడానికి లేదా సంకేతం ఇవ్వడానికి చేతులను ఉపయోగిస్తారు. ఇది 'ఓపెన్' లేదా 'క్లోజ్డ్' విధానంలో ఉంటుంది. ఓపెన్ స్థానంలో ఇద్దరు నృత్యకళాకారులు ఒకటి లేదా రెండు చేతులను పట్టుకుంటారు. ముఖ్యంగా మలుపులు తిరగడానికి అనువుగా, చేతులను వెనక్కు ఉంచుతారు. ఒకరి చుట్టూ మరొకరు కదలడానికి లేదా లయబద్ధంగా తిరగడానికి కూడా కళాకారులు ఒకరి చేతులను మరొకరు పట్టుకుంటారు. కాగా, క్లోజ్డ్ స్థానంలో నాయకుడు తన కుడిచేతిని అనుచరుడి వీపుపై ఉంచుతాడు. అందుకు స్పందనగా, అనుచరుడు తన చేతిని నాయకుడి భుజంపై వేస్తాడు. అనంతరం వీరు ప్రదర్శించే నృత్యం అత్యంత ఆహ్లాదకరంగానూ, ఆకట్టుకునేదిగానూ ఉంటుంది. సల్సాను అందించిన క్యూబాకు యావత్ ప్రపంచ నృత్య కళాకారులు రుణపడి ఉంటారు



కాగా, క్యూబన్ సంస్కృతి కేవలం సల్సాకు మాత్రమే పరిమితం కాదు. అక్కడి సంస్కృతిలో విస్తృత శ్రేణి నృత్యరూపాలు, విస్తారమైన సంగీత విధానాలు ఉన్నాయి. సాంస్కృతిక వైవిధ్యం ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ద్వీపంలోని స్థానికులు 'అరెటో' అని పిలిచే ఆచార వ్యవహారాలను జరుపుకొంటారు. నృత్యం ఇందులో ఒక భాగమని అంటారు. అయితే, దీనికి సంబంధించిన శైలులు ప్రస్తుతం అంతగా ప్రాచుర్యంలో లేవు. క్యూబాను స్పెయిన్ వలస రాజ్యంగా మార్చిన తర్వాత ఐరోపా సాంస్కృతిక వారసత్వ ప్రక్రియలు స్థానిక నృత్య రీతుల్లో కలిశాయి. ఫ్రెంచ్ కాంట్రే డాన్స్ వీటిలో ఒకటి. డాన్జోన్ , మాంబో, చాచాచాతో సహా బాల్రూమ్ నృత్యాల శ్రేణి విస్తరించింది. క్యూబా స్థానికతను కూడా రంగరించుకున్న ప్రత్యేక కాంట్రే డాన్స్ నుంచి ఈ శ్రేణులు ఉద్భవించాయి. 19 శతాబ్దం నాటికి ఈ నృత్యరీతులన్నీ స్థానిక సంస్కృతితో కలిసిపోయాయి. కాగా, 20 శతాబ్దంలో 'సోన్' బాగా ప్రసిద్ధి చెందింది. అదనంగా, పశ్చిమ ఆఫ్రికా, కాంగో బేసిన్ నుండి నల్లజాతీయులు బానిసలుగా ఉన్న రోజుల్లో, వారి ద్వారా అనేక నృత్య సంప్రదాయాలు క్యూబాలో చేరాయి. దీని వలన శాంటెరియా , యుకా, అబాకువా వంటి మతపరమైన నృత్యాలు , అలాగే రుంబా వంటి లౌకిక రూపాలు పుట్టుకొచ్చాయి. యూరోపియన్ నృత్యం, యు మతపరమైన నృత్యాల నుండి వచ్చిన ఈ నృత్య అంశాలు చాలావరకు కలిసి 'లా టెక్నికా క్యూబానా'కు ఆధారం అయ్యాయి. క్యూబన్ సంగీతం ఆధారంగా అమెరికాలో రుంబా (బాల్‌రూమ్ రుంబా), సల్సా వంటి లాటిన్ నృత్య శైలుల ఆవిర్భవించాయి. క్యూబన్ శైలి నృత్యరీతులను మెక్సికో నగరంలోని మోంటెర్రే నృత్యకారులు అనుసరించారు. ఈ విధంగా ఐరోపాలో తీవ్ర ప్రభావం చూపిన క్యూబన్ సంగీతం, నృత్య రీతుల్లో డాన్జోన్ ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంది. దీనిని క్యూబా అధికారిక సంగీత శైలిగానూ, నృత్య రూపంగానూ పేర్కొంటారు. ఈ సంగీతం.. నృత్యం మెక్సికోలోనూ విపరీతమైన ప్రజాదరణ పొందింది. డాన్జోన్ అనేది క్యూబన్ కాంట్రాడాన్జా (దీనిని హబనేరా అని కూడా పిలుస్తారు ) నుండి ఉద్భవించింది. క్యూబాలో, ఈ నృత్యాలు ఆఫ్రికన్ రిథమిక్, నృత్య శైలులచే ప్రభావితమయ్యాయి. యూరోపియన్ ప్రభావం కూడా ఉంది. 1879లో అభివృద్ధి చెందిన డాన్జోన్, నాటి నుంచి నేటి వరకూ క్యూబన్ సంగీతానికి ముఖ్యమైన మూలంగా ఉంది. హబనేరా సంగీతం నుంచి రూపాంతరం చెందిన కొత్త విధానంగా డాన్జోన్‌ను అభివర్ణిస్తారు. మాన్యుయెల్ సామెల్ లేదా మటాన్జాస్‌లో మిగ్యుల్ ఫాయిల్డే ఈ సంగీతాన్ని అభివృద్ధి చేసినట్టు పేర్కొంటారు. మిగ్యుల్ ఫాయిల్డే సృష్టించిన డాన్జాన్ రూపం (లాస్ ఆల్టురాస్ డి సింప్సన్), పరిచయం (నాలుగు బార్‌లు), పాసియో (నాలుగు బార్‌లు)తో ప్రారంభమవుతుంది, వీటిని పునరావృతం చేసి 16బార్ శ్రావ్యత అనుసరిస్తుంది. రెండవ గీతాలాపనకు ముందు పరిచయం పాసియో మళ్ళీ పునరావృతమవుతుంది. ఈ విభాగాల సమయంలో నృత్యకారులు నృత్యం చేయరు. వారు భాగస్వాములను ఎంచుకుంటారు. డ్యాన్స్ ఫ్లోర్‌పైకి నడుస్తారు. హఠాత్తుగా నృత్యం చేయడం ప్రారంభిస్తారు. పాసియోకు సంబంధించిన బార్ ఫోర్ నాలుగో బీట్ విలక్షణమైన పెర్కషన్ నమూనాను కలిగి ఉంటుంది. పరిచయం పునరావృతమైనప్పుడు నృత్యకారులు ఆగి, చర్చలు మొదలుపెడతారు. సరసాలాడతారు. వారి స్నేహితులను పలకరిస్తారు. .ప్రారంభ డాన్జోన్ గాలి వాయిద్యాలపై ఆధారపడిన ఆర్కెస్టాస్ టిపికాస్ అని పిలిచే సమూహాలు వాయించేవి. వారికి అనేక ఇత్తడి వాయిద్యాలు ( కార్నెట్ , వాల్వ్ ట్రోంబోన్ , ఓఫిక్లైడ్ ), ఒక క్లారినెట్ లేదా రెండు, ఒక వయోలిన్, టింపాని ( కెటిల్ డ్రమ్స్ ) అందుబాటులో ఉంటాయి. 20వ శతాబ్దం ప్రారంభంలో, చరంగా యొక్క తేలికైన, కొంతవరకు సొగసైన ధ్వని ఉద్భవించింది. ప్రారంభంలో, అవి రెండు వయోలిన్‌లు, ఒక సెల్లో, ఫ్లూట్, టింబేల్స్ , గైరో, డబుల్‌బాస్‌తో కూడిన చిన్న ఆర్కెస్ట్రా. చరంగా, టిపికాస్ సంవత్సరాలుగా ఒకదానితో ఒకటి పోటీ పడ్డాయి. కానీ 1930 తర్వాత టిపికా కనుమరుగైంది.

## సంగీత ప్రధానమైన 'మాంబో'

క్యూబాలో అత్యంత ప్రసిద్ధమైన సంప్రదాయ సంగీత, నృత్య విధానాల్లో మాంబో ఒకటి. తొలినాళ్లలో అభివృద్ధి చెందిన సంగీత రూపం.. నృత్య శైలి ఇది. మెక్సికో, అమెరికాలోని క్యూబన్ సంగీతకారులు దీనిని మరింత ముఖ్యమైన అభివృద్ధి చేశారు. 'మాంబో' అనే పదానికి కికోంగోలో 'దేవతలతో సంభాషణ' అని అర్థం. నల్లజాతీయులను బహిరంగ మార్కెట్‌లో కొనుక్కొని, వివిధ దేశాలకు తరలించడం ఆ రోజుల్లో ఆనవాయితీ. ఆ విధంగా క్యూబా చేరిన కాంగో బానిసలు మాట్లాడే భాష మాంబో. ఆధునిక మాంబో 1938లో ఒరెస్టెస్, కాచావో లోపెజ్ సోదరులు రాసిన 'మాంబో' అనే పాటతో ప్రారంభమైంది. ఈ పాట డాన్జోన్ , ఇది ఇంగ్లీష్ కంట్రీ డ్యాన్స్,



ఫ్రెంచ్ కాంట్రెడాన్స్ .. స్పానిష్ కాంట్రెడాన్జా వంటి యూరోపియన్ సామాజిక నృత్యాల నుండి ఉద్భవించిన నృత్య రూపం జత కలిసింది. దీనికి ఆఫ్రికన్ జానపద సంగీతం నుండి ఉద్భవించిన లయలు మద్దతు ఇచ్చాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, 'మాంబో' అనేది క్యూబన్, ఆఫ్రికన్ సంగీత, నృత్య శైలుల కలయికతో ఉద్భవించిన సరికొత్త కళా రూపం.

# గ్రామ గ్రామాన 'మేడే' జరపాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :** ప్రపంచ కార్మికుల పర్వదినం మేడే ఉత్సవాలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లక్ష్మీదేవిపల్లి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు అధ్యక్షతన చుంచుపల్లి సిపిఐ కార్యాలయం రజబ్ అలీ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన సాబీర్ పాషా మాట్లాడుతూ, కార్మికులు, పేద ప్రజల పక్షాన నిల్చున్నది ఎర్రజెండానేనని, వారికి అనేక హక్కులు, సౌకర్యాలు సాధించి పెట్టింది ఎర్రజెండానేనన్నారు. కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు వెనుక ఎఐటియుసి, సిపిఐ పోరాటం ఉందన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి హామీ చట్టం సాధించి పెట్టింది కమ్యూనిస్టులేనన్నారు. ఎమ్మెల్యేగా కూనంనేని సాంబశివరావు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని, మునుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధి చేశామన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల చట్టాలని, హక్కులను కాలరాసే చర్యలకు పాల్పడుతోందని, దీనిని గ్రామీణ కార్మికులు, ప్రజలు వ్యతిరేకించి కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న పోరాటాల్లో కలసి రావాలని పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా అన్ని గ్రామాల్లో, కార్మిక క్షేత్రాల్లో జెండావిష్కరణలు జరపాలని, సదస్సులు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి చికాగో అమరవీరుల స్ఫూర్తిని ప్రజల్లో నింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దీటి లక్ష్మీపతి, వాసిరెడ్డి మురళి, గెద్దాడు నగేష్, కంటెం శ్రీనివాసరావు, మాడే రాంప్రసాద్, కంటెం సత్యనారాయణ, దారా శ్రీనివాస్, కోడి లింగయ్య, దేవరగట్ల రాంబాబు, మాధవరావు, రమణయ్య, లక్ష్మయ్య, రాధాకృష్ణ, సాగర్, సత్తిబాబు, రాజు, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీల అమలుకు కృషి

**మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి ● కార్మిక సంఘాల దుష్ప్రచారాలను నమ్మకండి : రాజ్ కుమార్**

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సింగరేణిలో జయప్రదం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కార్మికులకు పిలుపు నిచ్చారు. బుధవారం గోదావరిఖని భాస్కరరావు భవన్‌లో జరిగిన ఏఐటియుసి ప్రెస్‌మీట్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ, దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలను వేగవంతం చేస్తోందని ఆయన ఆరోపించారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుంచే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి, కార్మికులను కట్టు బానిసలుగా మార్చే కుట్ర చేస్తుందని ఆయన కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తన అధికారాన్ని ఉపయోగించి పేద ప్రజల కడుపు కొట్టి కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతుందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేపట్టాలని అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. కొత్త గనుల కోసం, సంస్థ పరిరక్షణ, కార్మిక హక్కుల సాధన కోసం, యువ కార్మికుల ఉద్యోగ భద్రత కోసం జరిగే ఈ సమ్మెలో సింగరేణి కార్మికులు,కాంట్రాక్టు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా సింగరేణి ఎన్నికల్లో ఏఐటియుసి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం యాజమాన్యంతో స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో మాట్లాడి పరిష్కారం చేస్తామని, చట్ట ప్రకారం న్యాయ బద్ధంగా సమస్యల పరిష్కారానికి ఆలస్యమైన కృషి చేస్తామని ఆయన అన్నారు. కొన్ని కార్మిక సంఘాలు కార్మికుల సమస్యల పరిష్కారంలో మేమే సాధించామని, ప్రభుత్వంతో మాట్లాడినామని దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని కార్మికులు నమ్మొద్దని, ఎవరు ప్రభుత్వంతో మాట్లడడం లేదని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంతరం యాజమాన్యంతో మాట్లాడ్డం జరుగుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా కార్మికుల సోంత ఇంటి పథకం అమలు కోసం యాజమాన్యం కమిటీ వేసి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చిందని ఆయన అన్నారు. అలవెన్సుల పై ఆదాయపు పన్నును మినహాయింపు కోసం కమిటీ వేసిందని, ఆ సమస్య త్వరలో పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు. కార్మికుల పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేశ పెట్టాలని ఏఐటియుసి డిమాండ్ చేయగా, యాజమాన్యం అంగీకరించి, ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం చేస్తామని హామీ ఇచ్చిందని, ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ మాట్లాడుతూ కొంత మంది సింగరేణి అధికారులు గత ప్రభుత్వంలో అనుసరిస్తున్న విధానాలను అమలు చేసి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తూ, ఎఐటియుసిని బద్‌నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని, కార్మికుల సంక్షేమం కోసం, సంస్థ పరిరక్షణ కోసం అధికారులు కృషి చేయాలన్నారు. కావాలని కార్మికుల ను ఇబ్బందులకు గురి చేస్తే ఎఐటియుసి చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి, కే స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి అరెల్లి పోషం, నాయకులు రంగు శ్రీనివాస్,గోసిక మోహన్, కే.కనక రాజు, ఎం.ఎ. గౌస్, దాసరి శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.



# ఎపిలోని తెలంగాణ హోంగార్డులను స్వరాష్ట్రానికి బదిలీ చేయాలి

ఎఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి డిమాండ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ హోంగార్డులను స్వరాష్ట్రానికి బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హోంగార్డుల పక్షాన (డిసిపి) డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ లక్ష్మి నాయారణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి యుగేందర్ మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా తెలంగాణ స్థానికతకు చెందిన హోంగార్డులు ఆంధ్రప్రదేశ్‌లో విధులు, అదే విధంగా తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్ హోంగార్డులు పనిచేస్తున్నారన్నారు. తెలంగాణ స్థానికతకు చెందిన హోంగార్డులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సెలక్ట్ అయ్యారని, రాష్ట్ర విభజన జూన్ 2014 తర్వాత వారంతా ఆంధ్రప్రదేశ్‌లో ఉండిపోయారని పేర్కొన్నారు. వారి స్థానికత ప్రకారం మార్చడం జరిగినా హోంగార్డులను మార్చలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణకు చెందిన హోంగార్డులు పనిచేస్తున్నారని, ఆ కుటుంబాలు తెలంగాణలో ఉన్నాయని వాపోయారు. ఫలితంగా వారు ఉద్యోగం ఆంధ్రప్రదేశ్‌లో, కుటుంబం తెలంగాణలో ఉండడంతో మానసికంగా, కుటుంబపరంగా డ్యూటీకి హాజరుకావడానికి, రవాణాపరంగా, ఆర్థికంగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. హోంగార్డుల తల్లి దండ్రులు వృద్ధాప్యంలో ఉండడం వల్ల వారి బాగోగులు చూసుకోలేకపోతున్నారన్నారు. కొంతమంది పిల్లలు ఆంధ్రప్రదేశ్‌లో విద్యను కొనసాగిస్తున్నారని, వారు భవిష్యత్తులో తెలంగాణ స్థానికతను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన జూన్ 2014 నుంచి దాదాపుగా 11 సంవత్సరాలుగా స్వరాష్ట్రాలకు వెళ్లాలని ఎదురుచూస్తున్నా వారి సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలం చెందారని వాపోయారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌కు హోంగార్డ్స్ బదిలీ చేయడానికి అభ్యంతరం లేదని తెలిపినా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాలయాపన చేస్తూ స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో రాజేస్, నగేష్, మురళి తదితరులున్నారు.

# 'స్థానిక' ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలి

**ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి : సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం**



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేస్తూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీని బలోపేతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. బుధవారం రోజున ధర్మారం మండలం మల్లాపూర్ సిపిఐ గ్రామ మహాసభ కామ్రేడ్ మల్లేశం అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ముఖ్యఅతిథిగా హాజరై వారిని ఉద్దేశించి మాట్లాడు తూ భారత కమ్యూనిస్టు పార్టీ పేదల కోసం కష్టజీవుల కోసం వ్యవసాయ కూలీల కోసం కార్మిక వర్గం కోసం అనునిత్యం పోరాటం చేసే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. రాబోయే కాలంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ గెలుపు దిశగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలుగా మనం పని చేయవలసిన అవసరం ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు శత జయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఒక పండగ వాతావరణంలో జరుపుకోవటం మంచి పరిణామన్నారు. ఆనాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని భూమిలేని నిరుపేదలకు భూములు పంచిన పార్టీ సిపిఐ అన్నారు. అనంతరం మల్లాపూర్ గ్రామ శాఖ కార్యదర్శిగా యశోద మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది . వీరితోపాటు ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేయడమైనది భవిష్యత్తులో ధర్మా రం మండలంలోని అన్ని గ్రామాల్లో పార్టీ శాఖలు ఏర్పాటు చేసి కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేసే దిశగా మనం పని చేయాలని సదానందం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు గౌతమ్ ,గోవర్ధన్ , లక్ష్మీ నారాయణ తోపాటు దుర్గయ్య ,నరసయ్య, చంద్రయ్య ,తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రదాడి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి : పల్లా నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ:** కాశ్మీర్‌లోని పహల్గంలో బుధవారం పోలీసు మారు వేషంలో వచ్చి విచక్షణారహితంగా పర్యాటకుల పై బుల్లెట్లతో దాడులు చేసిన పాకిస్థాన్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉగ్రదాడిలో మరణించిన వారికి రూ.కోటి, గాయపడిన పౌరులకు రూ.25లక్షల నష్ట పరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. కాశ్మీర్ లో పర్యాటకులను కిరాతకంగా చంపిన జిహాదీ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను గుర్తించి అంతమొందించాలని, ఉగ్రదాడికి కారణమైన పాక్ ప్రభుత్వాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఒంటరి చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మృతి చెందిన భారత పౌరుల కుటుంబాలకు సిపిఐ పక్షాన ప్రగాఢ సానుభూతిని, సంతాప వ్యక్తం చేశారు.

# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి

సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్

**ప్రజాపక్షం/బెజ్జంకి :** సిపిఐ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిద్దిపేట సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పార్టీ శ్రేణులకు సూచించారు.బుధవారం మండల పరిధిలోని గుగ్గిళ్ళ, తిమ్మాయిపల్లి గ్రామాల్లో సిపిఐ పార్టీ గ్రామ శాఖల మహాసభల సమావేశం పార్టీ మండలాధ్యక్షులు బోనగిరి రూపేష్ అధ్యక్షతన నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వారు హజరై మాట్లాడుతే బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా దేశానికి స్వాతంత్ర్యం రావడంలో క్రియాశీల పాత్ర పోషించి మార్కిసిజం లేనినిజం సిద్దాంతాలతో సమ సమాజమే లక్ష్యంగా దోపిడి లేని సమాజం కోసం పేద బడుగు బలహీన వర్గాల పక్షాన అలుపెరుగని పోరాటాలు చేస్తున్న దేశంలోనే మొట్టమొదటి రాజకీయ పార్టీ సిపిఐ అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జేరిపోతుల జనార్దన్,సంగెం మధు,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మోదీ పతనం ప్రారంభమైంది...

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మే20వ తేదీన కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ పిలుపునిచ్చారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్యాతరాజు సతీష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ పతనం ప్రారంభమైందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను మానుకోవాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు లెగిసెట్టి మల్లయ్య, భౌతు కమలాకర్, పసునూరి మహేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## ఉగ్రదాడిని ఖండించిన టిజిఇజెఏసి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని పిరికిపంద చర్యని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిజిఈజెఏసి ఛైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఉగ్రవాద దాడుల్లో మృతిచెందిన వారికి సంతాప సూచికంగా టిజిఈజెఏసి ఆధ్వర్యంలో ఖమ్మంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రవాదుల దాడులు పిరికిపంద చర్య అన్నారు. కార్యక్రమంలో టిఎన్‌జిఓస్ కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టిజిఓస్ కార్యదర్శి మోదుగు వేలాద్రి, టిఎన్‌జిఓస్ జిల్లా కార్యవర్గం, టిజిఒజిల్లా కార్యవర్గం, టిజిఇజెఏసి మహిళా విభాగం పాల్గొన్నారు.

## ఐఎల్ ఖమ్మం నగర అధ్యక్షుడిగా జివి లక్ష్మీనారాయణ ఎన్నిక



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) ఖమ్మం నగర అధ్యక్షునిగా జివి లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. బుధవారం ఖమ్మం నగరంలోని సూర్యతేజ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం బార్ అసోసియేషన్ తో పాటు జిల్లాలో వివిధ బార్ అసోసియేషన్‌లో జరిగిన ఎన్నికల్లో ఐఎఎల్ తరుపున గెలిచిన సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఐఎఎల్ ఖమ్మం నగర కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా జివి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ముమ్మడి సతీష్ ఎన్నికయ్యారు. వీరితో పాటు ఆఫీస్‌బేరర్స్‌గా ఎండి ఫర్వేజ్, ఆర్‌ఎన్ నారాయణస్వామి, రామ్మూర్తి రెడ్డయ్య, శివకుమారి, ఎస్. రాంబాబు, కోటేశ్వరరావు, టి. మధు, కె. మన్మధరావు, కె. మల్లేష్, బి. నాగేశ్వరరావు లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన జివి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఐఎఎల్ తరుపున కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఎల్ ఖమ్మంజిల్లా అధ్యక్షులు షేక్ లతీఫ్, గౌరవాధ్యక్షులు పారుపల్లి అమర్‌చంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి శేషగిరిరావు, షేక్ నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసరాలు వితరణ




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అనాథ, వృద్ధాశ్రమాలను సందర్శించి వారికి అవసరమైన నిత్యావసర వస్తువులను వితరణగా అందించారు. పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 24న జరిగే జాతీయ స్థాయి కల్చరల్ ఫెస్ట్, శ్రీచైతన్య ఉత్సవ్ 25లో సామాజిక సేవ అనే అంశంలో భాగంగా ఖమ్మం నగరంలోని ఎనిమిది అనాథ, వృద్ధాశ్రమాలను బుధవారం విద్యార్థులు సందర్శించి వారికి కావాల్సిన నిత్యావసరాలను వితరణ చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ డా॥ మురళికృష్ణ తెలిపారు. బ్యాంక్ కాలనీలోని ఈశ్వరమ్మ ప్రశాంతి సదన్, జీవన సంధ్య, భవ్యశ్రీ ఓల్డ్ ఏజ్ హోమ్ , దాసరి నాగయ్య ఓల్డ్ ఏజ్ హోమ్, మధర్ థెరిసా ఆశ్రమం, నేనున్నాను ఫౌండేషన్‌ని విద్యార్థులు సందర్శించారు. ఆయా ఆశ్రమాల్లో ఉన్న 500 మంది అనాథ, వృద్ధులకు కావాల్సిన నిత్యావసర వస్తువులు అందించారు.ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలోని స్థితిగతులపై విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యార్థులు చదువుల్లోనే కాకుండా సమాజంలో అన్ని రంగాల్లో ముందుండేలా ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులచే నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.కార్యక్రమంలో అకాడమిక్ డీన్ , ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ , డిప్లొమా ఇంచార్జ్ , వివిధ విభాగాల అధిపతులు , అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టిపిబిఒస్ హ్యాండ్ బుక్ ఆవిష్కరణ




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని సుడా జెపిఒఇటికాల భాస్కర్ సంకలనం చేసిన టిపిబిఓస్ హ్యాండ్‌బుక్‌ను సుడా వైస్ ఛైర్మన్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం ఆవిష్కరించారు. కొత్తగా టిజిపిఎస్‌సి ద్వారా ఉద్యోగంలో చేరిన టౌన్ ప్లానింగ్ అధికారులకు, టౌన్ ప్లానింగ్ విధులపై ప్రాథమిక విషయ పరిజ్ఞానం అందించడం కోసం ఈ పుస్తకాన్ని వివిధ జిఒలను క్రోడీకరించి సంకలనం చేయడం జరిగిందని ఇటికాల భాస్కర్ తెలిపారు. ఈ సంధర్భంగా పుస్తకాన్ని రచించిన ఇటికాల భాస్కర్‌ను కమిషనర్ అభినందించారు.కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ సిపిఒ రాజ్‌కుమార్, ఎసిపి వసుంధర, ఎపిఒ ఖాదర్, టిపిఎస్ నరేష్ తదితరులు పాల్గొన్నా రు.

## 25న ఉద్యోగుల సదస్సు




ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ,పెన్ష న ర్ల సమస్యల సాధనకై టిజిఇజెఏసి ఆధ్వర్యంలో ఈనెల 25న జరిగే ఉద్యోగుల సదస్సులో పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఎటి) ఖమ్మంజిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య కోరారు. బుధవారం కృషి భవన్‌లో పెన్షనర్ల సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా శుక్రవారం జరి గే ఉద్యోగ సదస్సు పోస్టర్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం పరిశ పుల్లయ్య మాట్లాడుతూ పెన్షనర్ల ఉద్యోగ విరమణ బకాయిలు తక్షణమే చె ల్లించాలని ఐదు విడతల పెండింగ్ కరువు భ త్యం విడుదల చేయాలని, 50 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి అమలు చే యాలని ప్రభుత్వాన్ని డిమా ండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బి ల్లులు మంజూరు చేయాలని, నగదు రహిత హెల్త్ స్కీం సత్వరం అమలు చేయాలని, పాతపెన్షన్ వి ధానం పునరుద్ధరించాలని టిజిఇజెఏసి ఖమ్మం జిల్లా నాయకులు పరిశ పు ల్లయ్య, రాయల రవి కుమార్ కోరారు.కార్యక్రమంలో ఉపాధ్యక్షులు , తదితరులు పాల్గొన్నారు.

## 25న బైక్ ర్యాలీ సదస్సు



ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ : ఖమ్మంజిల్లా ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 25న జరిగే బైక్ ర్యాలీ, ఉద్యోగుల సదస్సును జయప్రదం చేయాలని జిల్లా విద్యాశాఖ టిఎన్‌జీవోస్ ఖమ్మంజిల్లా ప్రచార కార్యదర్శి ఎర్రమల్ల శ్రీనివాసరావు కోరారు. బుధవారం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా విద్యా శిక్షణా సంస్థ డైట్ కళాశాల నందు బైక్ ర్యాలీ, ఉద్యోగుల సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. 25న జరిగే బైక్ ర్యాలీతో పాటు ఉద్యోగుల సదస్సుకు విద్యాశాఖ నుంచి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ, అధ్యాపకులు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో భూభారతి అమలు
# సంచలనాత్మక నిర్ణయం

తిరుమలాయపాలెం పర్యటనలో మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మరాజ్యంలో భూభారతి చట్టం అమలు సంచలనాత్మక నిర్ణయం అని సొంత భూమి ఉండి భూమి హక్కులు పొందక ఇబ్బందులు పడుతున్న రైతులకు భూభారతి ఒక వరం అని పాలేరు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో సైడ్ కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా ఏలువారిగూడెం గ్రామంలో 26 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరామరాజ్యం ఏర్పడ్డ నుండి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ వస్తున్నామని గత ప్రభుత్వంలో ధరణి పేరుతో కోట్ల రూపాయల విలువైన భూముల్ని కొల్లగొట్టారని పేద రైతులను నట్టేట ముంచారని ఇందిరమ్మ రాజ్యంలో భూభారతి చట్టం అమలు ఒక సంచలనాత్మక నిర్ణయం అని దీని ద్వారా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రతి రైతు న్యాయం జరుగుతుందని రైతులు తమ భూమి సమస్యలు ఏమైనా ఉంటే ఆర్‌ఓఆర్ భూ భారతి చట్టం ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని రెవెన్యూ అధికారుల సలహాలు సూచనలు తీసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో ప్రతీ పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ఇందిరమ్మ రాజ్య లక్ష్యమని ప్రతి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని అన్నారు. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, రానున్న రోజుల్లో పాలేరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీలో అంతర్గత రోడ్లు సైడ్ కాలవలు నూతన గ్రామపంచాయతీ బిల్డింగులు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు పెన్షన్లు అందిస్తామని ఆయన తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, డిపిఓ ఆశాలత, డిఎల్‌పిఓ రాంబాబు, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ యుగంధర్, ఇరిగేషన్ ఎస్‌ఇ ఎం.వెంకటేశ్వర్లు, మండల స్పెషల్ ఆఫీసర్ పుల్లారావు, పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, బీరోలు సొసైటీ అధ్యక్షులు రామ సహాయం నరేష్ రెడ్డి, మద్దినేని బేబీ స్వర్ణకుమారి,బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, బోడ మంగీలాల్ నాయక్, గ్రామపంచాయతీ కాంట్రాక్టర్ దేవరం దేవేందర్ రెడ్డి,మండల ఎంపిడివో సిలార్ సాహెబ్, ఇంచార్జ్ తహసీల్దార్ సుధీర్, ఎంపీఓ సూర్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి సీతారామరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే జిఎంను కలిసిన ఖమ్మం ఎంపి రామసహాయం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ధంసలాపురం రైల్వే అండర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు నిర్మాణం, భూ సేకరణకు నిధులు మంజూరు చేయాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి రైల్వే జియంను కోరారు. ఇటీవల ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి రైల్వే అధికారులతో కలిసి ధంసలాపురం అండర్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. రైల్వే అండర్ బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు నిర్మాణానికి గతంలో సర్వే పూర్తయినప్పటికీ భూ సేకరణకు నిధులు మంజూరు చేయకపోవడంతో అండర్ బ్రిడ్జి నిర్మాణం జరగలేదు. దీనితో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్న విషయం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి గుర్తించారు. బుధవారం సికింద్రాబాద్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే జియంను కలిసి భూ సేకరణకు నిధులు మంజూరు చేసి ఆర్‌యుబి నిర్మాణం చేపట్టాలని ఎంపి వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన రైల్వే జియం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గతంలో రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్దరించాలని, ఖమ్మం, బోనకల్, ఎర్రుపాలెం, డోర్నకల్ నుండి భద్రాచలం రోడ్డు వెళ్లే మార్గంలో గాంధీనగర్ స్టేషన్‌లో రైళ్లను నిలుపుదల చేయాలని రైల్వే జియంను ఎంపి కోరారు.

## భూ భారతితో శాశ్వత పరిష్కారం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ప్రజాపక్షం/ మధిర: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న భూభారతి ఆర్వోఆర్ చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బుధవారం స్థానిక క్లబ్ కాంపెక్స్ కళ్యాణ మండపం నందు భూ భారతి కొత్త ఆర్వోఆర్ చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ఆర్‌డిఓ నర్సింహారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు భూ భారతి చట్టంతో పరిష్కారమవుతాయని అన్నారు. భూమి ఎక్కడ ఉంది, కొలతలు ఆధునాతన జిపిఎస్ ప్రక్రియతో మరోసారి సర్వే చేపట్టి కొలతలు , హద్దులు శాశ్వతంగా నిర్ణయించడం, ఆతర్వాత యాజమాన్యం నిర్ధారించడం చేపట్టడం జరుగుతుందన్నారు. కొనుగోలు రిజిస్ట్రేషన్ ద్వారా అయితే తహశీల్దార్ కార్యాలయంలోనే ప్రక్రియను పూర్తవుతుందని, రిజిస్ట్రేషన్ కానప్పుడు విచారణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తులకు విచారణ చేసి సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి తదుపరి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. అదేవిధంగా భూ చట్టాలపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఆర్‌డిఓ జి. నర్సింహారావు మాట్లాడుతూ భూ భారతి కొత్త ఆర్ ఆర్ చట్టంపై,చట్టంలోని కీలక అంశాలు, రికార్డుల సవరణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, సాదా బైనామా క్రమబద్ధీకరణ, మ్యూటేషన్, భూదార్‌కార్డు, గ్రామరెవెన్యూ రికార్డు ఖాతా లు, సమర్ధ అధికారి అప్పీల్ వ్యవస్థ, సేవల వివరణ పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు అడిగిన ప్రశ్నలకు సమాధానా లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంబాబు, ఎడిఎ విజయ్‌చంద్ర, మండల వ్యవసాయ అధికారి సాయిదీక్షితులు, మున్సిపల్ కమీసనర్ సంపత్‌కుమార్, మధిర ఎఎంసి చైర్మన్ నర్సింహారావు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుడు వెంపటి సూర్యనారాయణ మృతి

జాతీయ సమితి సభ్యుడు భాగం, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా నివాళి




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:సిపిఐ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు ఖమ్మంకు చెందిన వెంపటి సూర్యనారాయణ(85) అనారోగ్యంతో బుధవారం పాల్వంచ లో ఆయన కుమార్తె నివాసంలో మృతి చెందారు. గ త కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నా రు. మృతివార్త తెలుసుకున్న సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా సహాయ కార్యద ర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాధం, పాల్వంచ పట్టణ కార్యదర్శి అడుసుమ ల్లి సాయిబాబా, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశె ట్టి రాహుల్, ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు సిం గు నర్సింహారావు, యర్రాబాబు, తాటి వెంకటేశ్వ ర్లు, నాయకులు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబా బు, శనగారపు శ్రీనివాసరావు, వైఎస్ గిరి, బివి స త్యానారాయణ, ఆదినారాయణ, అజయ్, హైటెక్ హరి తదితరులు సందర్శించి నివాళులర్పించారు. యర్ర జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ స భ్యులకు సానుభూతి ప్రకటించారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక భూపోరాటాలు, ప్రజాపోరాటలకు సూర్యనారాయణ నాయకత్వం వహించారని, వివిధ మండలాలకు ఇంచార్జ్‌గా వ్యవహరించి పార్టీ విస్తరణకు కృషి చేశారని చెప్పారు.

## మతోన్మాద ఉగ్రవాదాన్ని ఖండించండి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

ఉగ్రశవాదదాడిలో మృతిచెందిన వారికి సిపిఐ నివాళి




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : భారతదేశంలో మతోన్మాద ఉగ్రవాదాన్ని ముక్త కంఠంతో ఖండించాలని సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్ సెంటర్‌లో జమ్ము కశ్మీర్ రాష్ట్రంలోని అనంతనాగ్ జిల్లాలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి సిపిఐ ఖమ్మంజిల్లా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీని ఉద్దేశించి దండి సురేష్ మాట్లాడుతూ ప్రపంచంలో రోజు రోజుకు మత విద్వేషాలు పెరుగుతున్నాయన్నారు.మతం పేరుతో జరిగే ఏ ఉన్మాదాన్నైనా సరే వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ ఏ మతానికి వ్యతిరేకం కాదని మతం పేరుతో జరిగే ఉన్మాదానికి, మూడత్వానికి వ్యతిరేకమన్నారు.మతం పేరుతో దేశంలో అమాయకులను చంపుతుంటే వ్యతిరేకించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పరమత సహనాన్ని పాటించే భారతదేశంలో మతాల పేరుతో ఉన్మాదాలు జరగడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలన్నారు. దాడిలో మరణించిన అమరవీరులకు భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మంజిల్లా సమితి తరుపున ప్రగాఢ సంతాప సానుభూతిని తెలియజేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులుయర్రాబాబు,జిల్లాకార్యవర్గ సభ్యులు, జిల్లా సమితి సభ్యులు, ఏఐఎస్‌ఎఫ్ ఖమ్మంజిల్లా ప్రధాన కార్యదర్శి , జిల్లా సమితి సభ్యులు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ సదస్సు దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/నేలకొండపల్లి:భూ హక్కుల నమోదు ప్రక్రియ కోసం రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజిమ్మిలాఖాన్ సూచించారు. మండల తహశీల్ కార్యాలయంను బుధవారం ఆకస్మికంగా తనీఖీ చేశా రు. రెవిన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తుల స్థితిగతులను కలెక్టర్ పరిశీలించారు. ఎలాంటి భూ సమస్యలు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టం ప్రజల భూ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చట్టం పరిధిలో శాశ్వత పరిష్కారాలకు మార్గం సూచించారు. గత చట్టం కంటే మె రుగైన అంశాలు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ యం.రాజేశ్వరి, ఖమ్మం ఆర్‌డిఒ, వ్యవసాయ మార్కెట్ కమిటి చెరున్ తహసీల్దార్ , డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు. హెల్ప్ డెస్క్‌లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌ను కోరారు.గ్రామ సభల వలన అధికారులు, సిబ్బంది అంతా సభల వద్ద ఉండటం వలన కార్యాలయం లో వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చే వారు కొంత ఇబ్బంది పడుతున్నారని సర్టిపికెట్ల కోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.

## సిపిఐ సానుభూతిపరుడు మృతి...



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ముత్తగూడెం, వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన సిపిఐ పార్టీ సానుభూతిపరులు ఎస్కే యాకుబ్‌పాషా(27), జూసెట్టి వెంకటేశ్వర్లు(55) అనారోగ్యంతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఖమ్మం జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సింగు నరసింహారావు, తాటి వెంకటేశ్వర రావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎడ్లపల్లి శంకరయ్య, ఐఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు,ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు,యువజన సంఘం సభ్యులు ,ఎఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి ,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలలో....
# 'సింగరేణి' విజయ దుందుభి

అత్యుత్తమ ఫలితాలు సాధించిన సింగరేణి మహిళా జూనియర్ కళాశాల



ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:ఇంటర్ విద్యార్థిని హాసిని 992 మార్కులతో సరికొత్త రికార్డు రాష్ట్ర ఉత్తీర్ణత శాతం కన్నా ఉత్తమ ఫలితాలు అభినందనలు తెలిపిన సింగరేణి ఛైర్మన్ అండ్ ఎండీ ఎన్.బలరాం మంగళవారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కొత్తగూడెంలోని సింగరేణి మహిళా జూనియర్ కళాశాల విజయ దుందుభి మోగించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 71.37 కాగా ఈ కళాశాల 81 శాతం సాధించింది. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 66.89 కాగా ఈ కళాశాల 73.07 సాధించి తన ప్రతిభను చాటింది. ఇంటర్ ద్వితీయ లో కళాశాల విద్యార్థిని హాసిని 1000 మార్కులకు 992 మార్కులు సాధించి కళాశాలలో సరికొత్త రికార్డు నెలకొల్పడంతో పాటు రాష్ట్ర స్థాయి ర్యాంకర్ గా నిలిచింది. అలాగే జూనియర్ హెచ్.ఈ.సి. విద్యార్థిని షేక్ అయిషా ఫర్హాత్ 500 మార్కులకు 489 సాధించి రాష్ట్రస్థాయిలో నిలబడింది. జూనియర్ ఎం.ఈ.సి. విద్యార్థిని సోనాలి బజాజ్ 487 మార్కులతో రాష్ట్రస్థాయి టాపర్ లలో ఒకరుగా నిలిచింది. బై.పి.సి నుండి ఐశ్వర్య 431/440, ఎం.పీ.సీ. నుండి జె.రేణుశ్రీ 460/470, సి.ఇ.సి. నుండి షేక్ నశ్రీన్ సుల్తానా 459/500 సాధించి అగ్రభాగాన నిలిచారు.

**చైర్మన్ అభినందనలు**

సింగరేణి మహిళా జూనియర్ కళాశాల రాష్ట్రస్థాయి సగటు ఉత్తీర్ణత కన్నా ఎక్కువ ఉత్తీర్ణత సాధించడమే కాక పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడంపై సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండీ ఎన్.బలరామ్ తన హర్షం ప్రకటిస్తూ అభినందనలు తెలిపారు. ఇదే విధంగా ఇకపై కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. సంస్థ ఛైర్మన్ ఇచ్చిన స్ఫూర్తితో, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డైరెక్టర్ పి.పి.పా కే.వెంకటేశ్వర్లు సహకారంతో కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థుల కృషి ఫలితంగా ఉత్తమ ఫలితాలు సాధించామని ఇకపై కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తామని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ తెలియజేశారు.

## ఘనంగా 'మేడే'నిర్వహణ




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. బుధవారం వన్ టౌన్ ఏరియా 19వ డివిజన్‌లో శాఖ కార్యదర్శుల ముఖ్య కార్యకర్తల సమావేశం వన్‌టౌన్ కార్యదర్శి వై. యాకూబ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్‌కె జానిమియా మాట్లాడుతూ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని వాడ వాడలా ఎర్రజెండా రెపరెపలాడాలన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు, త్యాగాలు చేసి ప్రజలకు అనేక హక్కులు సాధించిపెట్టిందన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ వర్గాలకు దేశంలోని వనరులు, సంపదను కట్టబెడుతుందన్నారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు చేతుల్లో పెడుతుందన్నారు. నిరుద్యోగం పెరుగుతున్న , ధరలు పెరుగుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించి పాలన సాగిస్తున్నారన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా బలమైన ప్రజా ఉద్యమా లు నిర్మించి పాలకుల విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలోనగరసహాయ కార్యదర్శి పగడాల మల్లేష్, నాయకులు మాడుగుల నాగేశ్వరరావు, మాలకొండయ్య, డివిజన్ కార్యదర్శులు మెంటెం రవి, కారం సామెలు, భూపాల్‌రెడ్డి, ముత్తారపు రవి, కృష్ణ, వన్‌టౌన్ ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ కార్యదర్శి నాగమణి, సరోజినమ్మ, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు సన్మానం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వరంగల్ కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజు యాదవ్ కూతురు వివాహ వేడుకలకు వచ్చిన సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంను సిపిఐ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, మేకల రవి ఆధ్వర్యంలో సన్మానించారు. రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనువాస్, హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దేల ఎల్లేష్, వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, ఏఐటియుసి హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్, సంగి ఎలేందర్,వెంకట్రాజం, శంకర్ నాయక్ పాల్గొన్నారు.



## వికసించిన జూనియర్ కళాశాల విద్యా కుసుమాలు

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** గత 17 ఏళ్లుగా ప్రతీ ఏటా జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులతో హసన్‌పర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టిస్తున్నారని, ఈ ఏడాది కూడా రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం అభినందనీయమని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాసవి క్లబ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో ర్యాంకర్లను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ సునీత అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాజేశ్వర్ రావుమాట్లాడుతూ.. ఈ కళాశాలకు సకల సౌకర్యాలు సమకూరుస్తున్నామని, ఇక ముందు సాధ్యమైనంతలో సహాయ సహకారాలు అందిస్తామని, ప్రిన్సిపాల్, అధ్యాపకుల కృసి అభినందనీయని కళాశాల ఆధ్వర్యంలో ర్యాంకర్లను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్, కార్యదర్శి చిదర పురవర్దన్, కోశాధికారి నాగమల్ల మాధవశంకర్, జోన్ ఛైర్మన్ నాగమల్ల సుధీర్, జిల్లా జాయింట్ సెక్రటరీ అప్పని శంకర్, వెలగందుల భీష్మ నాథం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా జడ్జిని కలిసిన ఎస్‌పి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా ఎస్‌పి సుధీర్ రాంనాథ్ కేకన్ బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, సెషన్స్ జడ్జి మొహమ్మద్ అబ్దుల్ రఫీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌పి న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాకు సంబంధించిన శాఖా పరమైన కొన్ని అంశాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ సరవయ్య, డిసిఆర్‌బి సిఐ సత్యనారాయణ, కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ జీనాథ్ కుమార్, కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

## ప్రసూతిని ప్రోత్సహించాలి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి ప్రోత్సహించేలా వైద్యాధికారులు కృషి చేయాలని జిల్లా వైద్యా ఆరోగ్యశాఖాధికారి సాంబశివ రావు అన్నారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరం, నర్సంపేట పల్లె దవాఖాలను ఆకస్మీకంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందించల్సిన సేవలు, సమయపాలన పాటించాలన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, మాతశిశు సంరక్షణ, ప్రభుత్వ ఆస్పత్రి ప్రసూతి ప్రోత్సహించాలని కోరారు. ఎండకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, అంటు వ్యాధులు, వడదెబ్బపై ప్రజలలో అవగాహన కల్పించాలని కోరారు. వైద్యాధికారులు డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు రామలింగయ్య, ఎల్డి కంప్యూటర్ నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'సెయింట్ పీటర్స్'లో సక్సెస్ మీట్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ పాత బస్ డిపో చర్చి కాంపౌండ్ లోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలలో భాగంగా సెలెబ్రేషన్స్ ఆఫ్ సక్సెస్ మీట్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ గోపు మధ్యాస్ రెడ్డి,డైరెక్టర్ గోపు సునీతారెడ్డి తెలిపారు. 3వ తరగతి నుండి 7వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను బుధవారం నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యార్థులు పట్టాలను మెడల్స్ ను అందుకున్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలను వీక్షించారు. సహాయ,సహకారాలను అందించిన పాఠశాల ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు,విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఒలంపియాడ్,కాంపిటేటివ్ పరీక్షలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేసినట్లు ప్రిన్సిపాల్ మధ్యాస్ రెడ్డి తెలిపారు.సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ గోపు సునీతారెడ్డి, ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

## తేమశాతం రాగానే కొనాలి

### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి పరిశీలించారు. కలెక్టర్ ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి సంబంధిత ధాన్యం కొనుగోళ్ల రిజిస్టర్‌లను తనిఖీచేసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కల్లాల్లోని ధాన్యం తడువకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం అమ్ముకుని మద్దతు ధర పొందాలని తెలిపారు. అలాగే సరిపడా టార్పాలిన్లు అందుబాటులో పెట్టుకోవాలని, కొనుగోలు వివరాలు కేపీఎంఎస్లో వెంటనే నమోదుచేయాలని కేంద్ర నిర్వాహకులను కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యవేక్షణలో ఆర్డీవో గోపిరాం, మండల తహశీల్దార్ రవీందర్, ఐకేపీ నిర్వాహకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో బాలికకు గాయాలు

**ప్రజాపక్షం/చిట్యాల:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గాంధీ నగర్‌కి చెందిన రత్నం రమేష్ కూతురు నైనిశా తన ఇంటి ముందు బుధవారం ఆడుకుంటుండగా ఒకేసారి మూడు కుక్కలు బాలికపై దాడి చేశాయి. హుటాహుటిన గ్రామస్తులు చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేస్తున్నారన్నారు. కుక్కల దాడిలో గాయాలైన బాలిక విషయంపై సమాచారం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నైనీషా ఆరోగ్యం పట్ల మెరుగైన వైద్యం అందించాలని ఎంజీఎం ఆసుపత్రి వైద్యులను కోరినట్లు తెలిపారు.

## కాజీపేట రైల్వే జంక్షన్ ప్రాముఖ్యతను కొనసాగిద్దాం

### దక్షిణ మధ్య రైల్వే జీఎంతో ఎంపి కడియం కావ్య
### సమస్యలపై చర్చ..సానుకూలంగా స్పందించిన అరుణ్‌కుమార్‌జైన్



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మెనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశం అయ్యారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న రైల్వే సమస్యలను పూర్తి చేయాలని బుధవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో జీఎంకు వినతి పత్రం అందజేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ లో కీలకమైన కాజీపేట జంక్షన్ ప్రాముఖ్యతను ఎట్టి పరిస్థితుల్లో తగ్గకుండా చూడాలని కావ్య రైల్వే జీఎంను కోరారు. కాజీపేట లోకో రన్నింగ్ డిపో సిబ్బందిని విజయవాడలోని లోకో రన్నింగ్ డిపో బదిలీచేయడం, ప్రస్తుతం కాజీపేట లోకో రన్నింగ్ స్టేషన్‌లో కొత్త పోస్టుల భర్తీకి అధికారులు ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం వంటి విషయాలపై రైల్వే జీఎంను వివరణ కోరారు. కాజీపేటలో 709మంది ఉద్యోగుల సంఖ్యకు కేవలం 526 మంది ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ప్రస్తుతం కాజీపేట లోకో రన్నింగ్ స్టేషన్‌కు 184 కొత్త పోస్టింగ్‌లు మంజూరు చేసినప్పటికి, పోస్టుల భర్తీకి అధికారులు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని, దీని వల్ల ఉన్న ఉద్యోగులపై అధిక భారం పడుతుందని వివరించారు. కృష్ణా, ఎల్‌టిటి, కోణార్క్, గౌతమి ఎక్స్‌ప్రెస్ లను కాజీపేట నుండి విజయవాడ డిపోకు తలుస్తున్నారన్నారు. మంగళవారం నుండి ఈ ఎక్స్ ప్రెస్ లింకులను విజయవాడ నుండి ఆపరేట్ చేస్తున్నట్లు అందుకు సంబంధించిన ఛార్జ్ తయారు చేశారని తెలిపారు. గతంలో ఈ లింకును కాజీపేట డిపో వారే అప్ అండ్ డౌన్ రూట్లో నడిపే వారిని పేర్కొన్నారు. ఇప్పుడు ఈ నాలుగు క్రూ లింకులను మార్చకుండా యధావిధిగా కొనసాగించాలని ఎంపి కోరారు. అమృత్ భారత్ పథకం కింద వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కడియం కావ్య అభ్యర్థనల పట్ల రైల్వే జీఎం సానుకూలంగా స్పందించారు. కడియం కావ్యతో పాటు ఎంపీలు రఘురాం రెడ్డి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉగ్రదాడుల్లో జమ్ము కాశ్మీర్ పర్యాటకుల మృతి పట్ల కావ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు.

## సేవాభావంతోనే సర్వత్రా మన్నన

### రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** ఉన్నత చదువులు చదవడం గొప్పకాదని, ఉన్నత చదువులు చదివిన వారు సేవాభావం కలిగి ఉండి సేవ చేసినప్పటికి వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో జిల్లాను మొదటిస్థానంలోనిలిపినవిద్యార్థిని, విద్యార్థులకు సన్మానం జరిగింది. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర్ టిఎస్ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థిని, విద్యార్థులు మొదటి స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. ఎంత నేర్చుకున్నామనేది ముఖ్యం కాదని నేర్చుకునే విషయాలు అనేకంగా ఉంటాయన్నారు. ఎవరైనా సముద్రాన్ని దాటగలరు కానీ జ్ఞానం ఎంత నేర్చుకున్న సరిపోదని అన్నారు. ఉన్నత చదువులు చదివిన వారు మారుమూల గ్రామాలలోని ప్రజలకు సేవలు అందించడానికి ముందుకు రావాలని, తాను సైతం కరోనాసమయంలోఏజెన్సీగ్రామాలలో కార్యక్రమాలు నిర్వహించానని, తనకు గుర్తింపు లభించిందని వివరించారు. అసిఫాబాద్ జిల్లా విద్యార్థులు రెండవ స్థానంలో ఉండడం గర్వంగా ఉందన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి చంద్రకళ ఉన్నారు.

## పుష్కరాల పనుల్లో వేగం పెంచాలి

### దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్




**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం :** సరస్వతి పుష్కరాల పనులు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని, పనులను సీరియస్‌గా తీ సుకుని పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను, కాంట్రాక్టర్లు ను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కర పనులను సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ శ్రీమతి అలేఖ్య పుంజాల, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్,జిల్లాఅధికారులతో కలసి విఐపి ఘాట్, సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు, 100 గ దుల సత్రం పనులు పరిశీలించారు. అనంతరం ఈఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖల వారిగా చేపట్టిన పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రానున్న 10 రోజులు చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతి రోజు పనులలో ప్రగతి రావాలని ఆదేశించారు. మే 10 వరకు అన్ని పనులు పూర్తి కావాలని ఆదేశించారు. స్థాని క సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఆర్జేసి రామకృష్ణ రావు, అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకర జీవనశైలి అలవర్చుకోవాలి

### హనుమకొండ కలెక్టర్ పి.ప్రావిణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఐదేళ్ల లోపు చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలు పౌష్టిక ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణా పక్షం కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలంటే జిల్లాలోని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రణాళికబద్ధంగా లబ్ధిదారులకు అందాల్సిన సేవలు సకాలంలో అందించాలని, లోపపోషణ లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అనుబంధ పోషకాహారం, ఆరోగ్యం, పోషకాహార విద్య, ప్రీస్కూల్ విద్య, రోగనిరోధకత, రెఫరల్ సేవలు, ఆరోగ్య పరీక్షలు తదితర సేవలు అందుటకుసంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ బాలిక దినోత్సవం రోజున (జనవరి 24) ఆడ పిల్లలకు జన్మనిచ్చిన ఐదుగురు చిన్నారులను వారి తల్లి తండ్రులనుకలెక్టర్ ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రీస్కూల్ పూర్తిచేసుకున్న చిన్నారులకు కాన్వొకేషన్ తదితర కార్యక్రమాలు, సుకన్య సమృద్ధి యో జన పథకం కింద ఆరుగురు లబ్ధిదారులకు పోస్టాఫీసు పాస్ పుస్తకాలను అందజేశారు. ఆర్జేడీ ఝాన్సి లక్ష్మి బాయి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, ఆయుష్ వైద్యులు డాక్టర్ మహేందర్, జిల్లా న్యూట్రిషన్ స్పెషలిస్ట్ డాక్టర్ సరళ, సిడీపీఓ లు విశ్వజ, స్వరూప, స్వాతి, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ టీ సుమలత, జిల్లా మిషన్ శక్తి కో ఆర్డినేటర్ డి కళ్యాణి, సీనియర్ అసిస్టెంట్ వి.వెంకట్రాం పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనూ కార్పొరేట్ స్థాయి బోధన

### జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎ.రవీందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని, ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయిలో అనుభవజ్ఞులు, విద్యావంతులు, అర్హులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన ఉంటుందని, మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఏ. రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం శనిపురం జెడ్‌పిహెచ్ఎస్‌లో 2024–25 విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం పాఠశాల హెచ్ఎం దాసరి శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. డిఇఓ ముఖ్య అతిధిగా మాట్లాడుతూ స్థానిక శనిగపురం పాఠశాలలో అతి తక్కువగా స్టాఫ్ ఉన్నా కూడా రోజుకు 18గంటల పాటు పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపర్చడంలో విశేష కృషి చేస్తూ జిల్లాలోని అత్యుత్తమ పాఠశాలగా తీర్చిదిద్దడంలో చక్కటి ప్రతిభ కనపర్చిన పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా పదవ తరగతి విద్యార్థుల కోసం జూమ్ తరగతులు నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రుల యందు మంచి ఆదర్శంగా నిలిచిన ఉపాధ్యాయ బృందాన్ని డిఇఓ అభినందించారు. ప్రభుత్వం పాఠశాలల్లో కూడా కార్పొరేట్ స్థాయి సౌకర్యాలను కల్పిస్తున్నామని, విద్యా సామర్థ్యాలను ప్రైవేటు రంగానికి ధీటుగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని డిఇఓ పిలుపునిచ్చారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు చదవడం, రాయడం చేర్చుకుని తల్లిదండ్రులను ఆనందింపచేయాలని, వేసవిసెలవుల్లో బావులు, చెరువులకు వెళ్ళి ఈతలు కొట్టవద్దని సూచించారు. వేసవి క్రీడా శిక్షణా శిభిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అరుణ, మాజీ వార్డు కౌన్సిలర్ హరిసింగ్‌నాయక్, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఆజాద్ చంద్రశేఖర్, పాఠశాలఉపాధ్యాయబృందంజి.వెంకన్న,బి.వెంకన్న,టి.పర్వతాలు, చైతన్య, చాత్రోపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అర్హులైనవారందరికీ పథకాలు

### పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు :** రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికి అందిస్తామని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో తొర్రూరు మండల ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి సమావేశమై తొర్రూరు మండల, పట్టణ అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ, కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించారు.యశస్వినిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులకు అన్యాయం జరగకూడదన్నారు. పార్టీ పరమైన కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరూ పాలుపంచుకొని ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తొర్రూరు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులను వివరించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే ప్రతీ కార్యకర్తకు పూర్తిగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీకి ద్రోహం చేసే వారికి కఠినంగా ఎదురు తిరుగుతామన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధిని మనమంతా ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ విద్యార్థులు విజయభేరి

### విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఇంటర్ ఫలితాలలో ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. గోపాలపురం లోని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో జరిగిన పత్రికా సమావేశంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరెందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో చారిత్రాత్మక ఆనావాళ్ళకు నిలయమైన ఓరుగల్లు లోని విద్యార్థులు ఆంద్రా కార్పోరేట్ కాలేజిలకు హైదారాబాద్, విజయవాడ,గుంటూరుకు వెళ్ళవలసిన అవసరం లేకుండా అందరికి అందుబాటుతో ఫిజులలో నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలను హనుమకొండ, వరంగల్ లో ఏర్పాటు చేయడమైనదిఅన్నారు. అందులో భాగంగా ఐఐటి,నీట్ ఫలితాలలో జాతీయస్థాయి అత్యుత్తమ ర్యాంకులు అందించడం జరుగుతుందని తెలిపారు.ఇంటర్ మొదటి, రెండవ సంవత్సర ఫలితాలలో ఆల్ఫోర్స్ విద్యార్థులు చారిత్రాత్మక విజయాలు సాధించారన్నారు. సినియర్ ఇంటర్‌ఫలితాలలో 1000 మార్కులకుగాను ఝె.పి.సి విభాగంలో జె. అంజనా 997 మార్కులతో రాష్ట్రంలో అగ్రగామిగా నిలిచిందని, యంపిసి విభాగంలో కె. రుత్విక్ 996 మార్కులు సాధించారని తెలిపారు. ఎస్. సేవితా 994, టి. కీర్తన994, ఎస్.కీర్తన 994, జి. వర్షిణి 993, టి.సాత్విక 992,హెచ్. పల్లవి992, డి.గాయత్రేని 992, కె. హసిని992 మార్కులు సాధించారు.ఇంటర్ ఫలితాలలో యం. పి.సిలో 470 మార్కులకు జి.తరుణ్468, ఎ. నిచిత 468, కె. సహస్ర 467, వి.శ్రీ వర్షిణి 467, పి. సిరిచందన467, ఎస్. దేషిమి467, కె.వర్షి 467, పి. సాత్విక 467, కె. శ్రీశాంత్467, పి. బన్ని 467,కె. గీతాం నిహారి 467, వి.హాసిని 467, బై.పి.సి విభాగంగలో సభిలా తారీమ్ 438, సామాఫి రథోస్438, యు. హాసిని 437, సి.హెచ్. మనస్వీని 436 మరెన్నో ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు.ఇటీవల ప్రకటించిన ఐఐటి మెయిన్స్ ఫలితాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు అద్భుతంగా రాణించారని, రాబోయే నీట్, ఎంసెట్ ఫలితాల్లోనూ విజయం సాధిస్తారని అన్నారు.

## భూ భారతితోనే పొరపాట్ల సవరణకు అవకాశం

### అవగాహనసదస్సులో కలెక్టర్ దివాకర టి.ఎస్

**ప్రజాపక్షం/వాజేడు :** రైతుల భూములకు సంబంధించి పాస్ పుస్తకాల్లో పొరపాట్ల సవరణకు భూభారతి చట్టంలో అవకాశం ఉందని, దీర్ఘకాలిక భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఎంతగానో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.అన్నారు. వాజేడు మండలం కేంద్రం లోని రైతు వైదికలో బుధవారం భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై కలెక్టర్ దివాకరఅవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావానికి తావు లేకుండా జవాబుదారితనాన్ని పెంచేందుకు భూభారతి నూతన చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందనితెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామావంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి రూపొందించారని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరగకుండా గ్రామాల్లోకి ప్రజలు దగ్గరకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు. జిల్లాలో ఉన్న అసైన్మెంట్, సాదా బైనమాలు, పాసు పుస్తకాలలోని సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ఆర్ఓఆర్ చట్టం ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఆధార్ తరహాలో భవిష్యత్తులో భూములకు సంబంధించి సర్వే చేసి, హద్దులు, కొలతలు, భూముల వివరాలు ఒకే పుస్తకంలో ఉండేలా భూధార్ ను రూపొందించనున్నట్లు తెలిపారు. సాదా బైనామాల పరిష్కారం వేగవంతం అవడంతో పాటు, వారసత్వ మ్యూటేషన్, హక్కుల సంక్రమణను గడువులో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూభారతి ద్వారా భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, అక్కడ కూడా సంతృప్తి చెందకపోతే కలెక్టర్ కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. మండల ప్రత్యేక అధికారి సర్దార్ సింగ్, తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ కుమారస్వామి,డిటిసత్యనారాయణ,ఎండిఓవిజయఉన్నారు.

## రామప్పలో ఏర్పాట్లపై సమీక్ష



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు మే 14వ తేదీన ములుగు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమం విజయవంతంగా సాగే విధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. బుధవారం వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయం, హరిత హోటల్, ఇంటర్ప్రిటేషన్ సెంటర్‌లలో జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజధాని హైదరాబాద్ నగరంలో నిర్వహించే ప్రపంచ సుందరీ పోటీలలో పాల్గొనే వివిధ పర్యటనలో భాగంగా రామప్ప దేవాలయంను సందర్శించనున్న నేపథ్యంలో రామప్ప పరిసర ప్రాంతాన్ని స్వాగత ఆర్చ్, ఆలయంను లైటింగ్‌తో సుందకరించి, గ్రీనరి పెంచాలని, స్వాగత ఏర్పాట్లు, కాకతీయ కట్టడాలను ప్రపంచ వ్యాప్తంగా తెలియజేయడానికి విదేశీ పర్యటకులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో మొదటి సారిగా ప్రపంచ సుందరీ పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా ఆయా దేశాల సుందరీమనులను పర్యాటక ప్రాంతాలకు తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఆయన వివరించారు. ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రపంచానికి యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం చారిత్రక విశేషాలను తెలియజేసేందుకు లభించిన ఈ అవకాశాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. ఆర్‌డిఓ వెంకటేష్, పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు, పురావస్తు శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్, అధికారులు, మండల అధికారులు, షో బోట్ ఈవెంట్ ప్రతినిధి, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ

### 'నల్లబ్యాడ్జ్'లతో ఆటగాళ్లు..

ఐపిఎల్ 2025 సీజన్‌లో ఉప్పల్ మైదానం వేదికగా బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో బాధిత కుటుంబాలకు బిసిసిఐ సంఘీభావం తెలపనుంది. ఇందులోభాగంగా ఎస్ఆర్‌హెచ్, ముంబయి ఆటగాళ్లు నల్ల బ్యాడ్జ్‌లతో బరిలోకి దిగనున్నారు. వీరితోపాటు అంపైర్లు ధరించనున్నారు. ఈ మ్యాచ్‌లో చీర్ లీడర్స్‌కు అనుమతి లేదు. ఒక నిమిషం పాటు ప్రేక్షకులతో పాటు అందరూ మౌనం పాటించనున్నట్లు ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. 2019లోనూ ఇలాంటి పరిస్థితులే ఎదురుకాగా.. అప్పుడు కూడా 12వ సీజన్ ప్రారంభోత్సవాలను బిసిసిఐ నిర్వహించలేదు. అందుకు బదులుగా నిర్వహణకు ఖర్చు పెడదామనుకున్న డబ్బును బాధిత కుటుంబాల సంక్షేమం కోసం కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఉగ్రదాడిపై భారత్‌కు మాజీ, ప్రస్తుత క్రికెటర్లు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. తాజాగా సోషల్ మీడియా వేదికగా విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్య బాధితులకు మద్దతుగా నిలిచారు. ''పహల్గాం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం'' సన్‌రైజర్స్ హైదరాబాద్.

## క్లాసెన్, అభినవ్.. ఆపద్బాంధవులు



అనిశ్చితికి కేరాఫ్‌గా మారిన సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంతమైదానంలో తడబడినా.. ఆఖరికి పోరాడ గలిగే స్కోర్ చేసింది. ముంబై ఇండియన్స్ పేసర్ల ధాటికి టాపార్డర్ మరోసారి విఫలం కావడంతో.. 35 పరుగులకే సగం వికెట్లు కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీని హెన్రిచ్ క్లాసెన్(71) ఆదుకున్నాడు. ఒత్తిడిలోనూ ఖతర్నాక్ హాఫ్ సెంచరీ బాదిన అతడు ఇంప్యాక్ట్ ప్లేయర్ అభినవ్ మనోహర్(43)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. క్రీజులో పాతుకుపోయిన ఈ ఇద్దరూ.. ముంబై బౌలర్లపై విరుచుకు పడుతూ ఐదో వికెట్‌కు 99 రన్స్ జోడించారు. దాంతో, వందలోపే కుప్పకూలేలా కనిపించిన సన్‌రైజర్స్ నిర్ణీత ఓవర్లలో7 వికెట్ల నష్టానికి 143 పరుగులు స్కోర్ చేయగలిగింది. ఉప్పల్ స్టేడియంలో టాస్ ఓడిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు దిగింది. ఇంకేముంది పరుగుల విందే అనుకున్నారు స్టేడియంలోని, టీవీల ముందు అభిమానులు. కానీ, రెండో ఓవర్లోనే కథ అడ్డం తిరిగింది. విధ్వంసక ఓపెనర్ ట్రావిస్ హెడ్(0)ను బౌల్ట్ డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఆ తర్వాత వచ్చిన ఇషాన్ కిషన్(1) సైతం దీపక్ చాహర్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ రికెల్టన్ చేతికి చిక్కాడు. ఆ షాక్ నుంచి తేరుకునే లోపే.. అభిషేక్ శర్మ(8), నితీశ్ కుమార్ రెడ్డి(2)లు పేలవ షాట్లతో పెవిలియన్‌కు క్యూ కట్టారు. దాంతో, 14 పరుగులకే కమిన్స్ సేన నలుగురు ప్రధాన ఆటగాళ్ల వికెట్లు కోల్పోయింది. గత మ్యాచ్‌లో చెలరేగి ఆడిన కుర్రాడు అనికేత్ వర్మ(12),, హెన్రిచ్ క్లాసెన్(71) జతగా రెచ్చిపోతాడులే అనుకున్న ఆరెంజ్ ఆర్మీ ఆశ ఫలించలేదు. బుమ్రా ఓవర్లో ఫోర్ కొట్టిన అనికేత్ లెగ్ సైడ్ ఆడబోయి కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. అంతే.35 వద్ద ఐదో వికెట్.. దాంతో.. కమిన్స్ సేన 50లోపే ఆలౌట్ అయ్యేలా కనిపించింది. ఐపీఎల్ చరిత్రలో 49 రన్స్‌కే ఆలౌట్ అయిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రికార్డును బ్రేక్ చేస్తుందనపించింది. కానీ, క్లాసెన్ అలా జరగనీయలేదు.

**క్లాసెన్ ఒంటరి సైనికుడిలా**

ఓవైపు వికెట్లు పడుతున్నా క్లాసెన్ ఒంటరి సైనికుడిలా పోరాడాడు. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అభినవ్ మనోహర్(43) ఓపికగా క్రీజులో నిలబడి క్లాసెన్‌కు చక్కని సహకారం అందించాడు.

## బంగ్లాకు షాకిచ్చిన జింబాబ్వే..

### మూడేళ్ల తర్వాత తొలి విజయం




టెస్టు క్రికెట్‌లో మరో సంచలనం. ఆతిథ్య బంగ్లాదేశ్‌కు జింబాబ్వే జట్టు పెద్ద షాకిచ్చింది. మూడేళ్ల తర్వాత బంగ్లాపై సుదీర్ఘ ఫార్మాట్‌లో జయభేరి మోగించింది. తొలి టెస్టులో 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(57, 54) హాఫ్ సెంచరీలతో అదరగొట్టగా.. పేసర్ బ్లెస్సింగ్ ముజరబని 9 వికెట్లతో రాణించాడు. 147 పరుగుల ఛేదనలో బంగ్లా 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి.. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తన పేస్‌తో బంగ్లా నడ్డివిరిచిన ముజరబని 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. స్వదేశంలో పెద్ద జట్లను సైతం మట్టికరిపించే బంగ్లాదేశ్‌కు చుక్కెదురైంది. జింబాబ్వే చేతిలో భారీ ఓటమి మూటగట్టుకుంది. ఎడమ చేతివాటం పేసర్ బ్లెస్సింగ్ ముజరబని విజృంభణతో రెండు ఇన్నింగ్స్‌లోనూ బంగ్లా బ్యాటర్లు విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో మొమినుల్ హక్(50), కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో(40)ల పోరాటంతో బంగ్లాదేశ్ 191కే ఆలౌటయ్యింది. అనంతరం దీటుగా బదులిచ్చింది జింబాబ్వే. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(57), సియాన్ విలియమ్స్(59) హాఫ్ సెంచరీలతో చెలరేగారు. అయితే.. ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్(5-52) దెబ్బకొట్టడంతో 273 పరుగులకే పర్యాటక జట్టు ఆలౌటైంది.. 82 పరుగుల ఆధిక్యం సాధించిన జింబాబ్వే.. రెండో ఇన్నింగ్స్‌లోనూ బంగ్లాకు గట్టిగా పోరాడింది.

**ఆరు వికెట్లతో..**

తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాను వణికించిన ముజరబని మళ్లీ నిప్పులు చెరిగాడు. రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ కొట్టి మ్యాచ్ కాపాడుకోవాలనుకున్న శాంటో బృందాన్ని వణికించాడు. డేంజరస్ మొమినుల్(47), శాంటో(60)లను ఔట్ చేసిన అతడు.. మిడిలార్డర్‌ను కూల్చి 6 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. దాంతో, బంగ్లా 255కే కుప్పకూలింది. ఛేదనలో జింబాబ్వే బ్యాటర్లు అద్భుతంగా ఆడారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(54), బెన్ కరాన్ (44)లు తొలి వికెట్‌కు 95 రన్స్ జోడించి పటిష్ఠ స్థితిలో నిలిపారు. వీళ్లిద్దరి జోరుతో విజయానికి చేరువైన జింబాబ్వేను మిరాజ్(5-50) వరుసగా వికెట్లు తీసి కష్టాల్లోకి నెట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నావెస్లీ మధీవెరె(19 నాటౌట్), రిచర్డ్ గరవ(4 నాటౌట్)లు అసమాన పోరాటంతో జట్టును విజయ తీరాలకు చేర్చారు. దాంతో, 3 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది జింబాబ్వే. సిరీస్ విజేతను నిర్ణయించే రెండో టెస్టు ఏప్రిల్ 28న మొదలుకానుంది.


## 'ఫౌజీ' చుట్టూ వివాదం!



పర్యాటక కేంద్రంగా ఉన్న పహల్గాంలో పర్యాటకులను ఉగ్రవాదులు కిరాతకంగా చంపేశారు. ఈ ఘటనపై దేశ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇక ఇప్పుడు ఈ వ్యతిరేకత ప్రభాస్ నటిస్తున్న ఫౌజీ చిత్రం వైపు సాగుతుంది. దర్శకుడు హను రాఘవపూడి డైరెక్షన్‌లో ప్రభాస్ 'ఫౌజీ' సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇమాన్వి నటిస్తోంది. అయితే, ఇప్పుడు ఈ సినిమాలో నుంచి ఆమె తొలగించాలంటూ సోషల్ మీడియాలో కొత్త వివాదం తెరపైకి వచ్చింది. ఇమాన్వి తండ్రి మాజీ పాకిస్థాన్ మిలిటరీ అధికారి కావడంతో ఇలాంటి వారిని ఇండియన్ సినిమాల్లో నటింపజేయవద్దంటూ పలువురు కామెంట్స్ చేస్తున్నారు. అయితే, ఇమాన్వి పుట్టి పెరిగింది ఢిల్లీలో. అక్కడే చదువుకుని, మోడలింగ్, యాక్టింగ్ నేర్చుకుంది. పాక్‌తో ప్రత్యక్ష సంబంధం ఉన్నవారిని ఇండియన్ సినిమాల్లో తీసుకుంటే అభ్యంతరం కానీ, ఇలా ఢిల్లీలో పుట్టి పెరిగిన అమ్మాయికి ఇక్కడ ఛాన్స్ ఇవ్వకూడదనేది ఏమాత్రం కరెక్ట్ కాదని మరికొందరు కామెంట్ చేస్తున్నారు. ఏదేమైనా ప్రస్తుతం పహల్గాం దాడితో ఫౌజీ చుట్టూ వివాదం రేగడం అభిమానులకు ఆందోళన కలిగిస్తోంది.

## రీల్

### డైనోసర్‌తో మహేష్ ఫైట్?



దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో కలిసి SSMB29 ప్రాజెక్ట్ తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాను పాన్ వరల్డ్ మూవీగా అడ్వెంచర్ కథగా రూపొందిస్తున్నారు. ఇక ఈ సినిమాలో మహేష్ సరికొత్త లుక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అయితే, ఈ సినిమాకు సంబంధించి తాజాగా సినీ సర్కిల్స్‌లో ఓ ఇంట్రెస్టింగ్ వార్త వినిపిస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు చేసే అడ్వెంచర్స్ ప్రేక్షకులను అబ్బురపరుస్తాయని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ సినిమాలో జక్కన్న ఓ భారీ సీక్వెన్స్‌ను ప్లాన్ చేస్తున్నాడని.. ఇందులో మహేష్ బాబు ఏకంగా డైనోసర్‌తో ఫైట్ చేయబోతున్నాడట. గతంలో ఎన్టీఆర్‌ను 'ఆర్ఆర్ఆర్'లో పులితో ఫైట్ చేయించాడు రాజమౌళి. ఇక ఇప్పుడు మహేష్ బాబును డైనోసర్‌తో ఫైట్ చేయించనున్నాడు ఈ స్టార్ డైరెక్టర్. ఈ సినిమాలోని అడవి నేపథ్యంలో సాగే షూటింగ్ కోసం చిత్ర యూనిట్ ఆఫ్రికా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

## 'కల్కి–2' రిలీజ్‌కు గ్రహాలు అనుకూలించాలి

– నాగ్ అశ్విన్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడి' బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేసిందో మనం చూశాం. ఈ సినిమాను దర్శకుడు నాగ్ అశ్విన్ డైరెక్ట్ చేయగా పూర్తి సైన్స్ ఫిక్షన్ మూవీగా అదిరిపోయే గ్రాఫిక్స్‌తో ఈ చిత్రం ప్రేక్షకులు ఆకట్టుకుంది. ఇక ఈ సినిమాలో ప్రభాస్ భైరవ అనే పాత్రలో నటించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. కాగా ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉంటుందని చిత్ర యూనిట్ గతంలోనే వెల్లడించింది. దీంతో ఈ సినిమా ఎప్పుడెప్పుడు తెరకెక్కుతుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాపై తాజాగా దర్శకుడు నాగ్ అశ్విన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. 'కల్కి 2' చిత్రం రిలీజ్ కావాలంటే 3–4 గ్రహాలు అనుకూలించాలని గతంలో చెప్పాను. కానీ, ఇప్పుడు ఈ సినిమా రిలీజ్ కావాలంటే ఏకంగా 7–8 అనుకూలించాలి అని నాగ్ అశ్విన్ అన్నారు. ఇక ఈ సీక్వెల్ చిత్రం పట్టాలెక్కాలంటే ప్రభాస్ ప్రస్తుతం కమిట్ అయి సినిమాలు పూర్తి చేయాల్సి ఉంది. ఇక 'కల్కి 2' సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు.

## 'కుబేర' భారీ బడ్జెట్ చిత్రం



టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న చిత్రాల్లో దర్శకుడు శేఖర్ కమ్ముల డైరెక్ట్ చేస్తున్న 'కుబేర' ఇప్పటికే మంచి బజ్‌ని క్రియేట్ చేసింది. ఈ సినిమాలో ధనుష్, అక్కినేని నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో ఈ సినిమాపై సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. శేఖర్ కమ్ముల తనదైన మార్క్‌తో ఈ సినిమాను కొత్త పంథాలో తెరకెక్కిస్తున్నాడు. ఇక ఈ సినిమా ధనుష్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్ చిత్రంగా నిలిచింది. కుబేర చిత్రాన్ని ఏకంగా రూ.130 కోట్ల బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. ఈ సినిమా కోసం ధనుష్ రికార్డు స్థాయిలో రూ.30 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇది ధనుష్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ రెమ్యునరేషన్ అని సినీ సర్కిల్స్ టాక్. ఇక మరో కీలక పాత్రలో నటిస్తున్న అక్కినేని నాగార్జున ఈ సినిమా కోసం రూ.14 కోట్లు తీసుకుంటున్నాడట. అటు అందాల భామ రష్మిక మందన్న ఈ మూవీ కోసం రూ.4 కోట్లు తీసుకుంటుండగా.. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమా కోసం రూ.3 కోట్లు తీసుకుంటున్నాడట. దీంతో 'కుబేర' సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాను జూన్ 20న పలు భాషల్లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

## కర్రెగుట్టల్లో యుద్ధ పరిస్థితిని నివారించండి

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు శాంతి చర్చల కమిటీ విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఛత్తీస్‌గఢ్, ఎపి, తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల అడవుల్లో, బస్తర్‌లో, జార్ఖండ్‌లో యుద్ధ వాతావరణ పరిస్థితిని నివారించాలని శాంతి చర్చల కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేసింది. మావోయిస్టులతో శాంతి చర్చలకు నిర్దిష్ట కాలపరిమితితో కాల్పుల విరమణ ప్రకటించి, సానుకూల వాతావరణంలో సమస్య పరిష్కరించాలని కోరింది. బుధవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో కమిటీ చైర్మన్ జస్టిస్ బి.చంద్రకుమార్, వైస్ చైర్మన్ జంపన్న, స్వాతంత్ర్యసమరయోధుడు, రచయిత కె.ప్రతాపరెడ్డి, హెచ్‌ఆర్‌ఎఫ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ జీవన్ కుమార్ మీడియాతో మాట్లాడారు. కర్రెగుట్టల్లో వందలాది మంది మావోయిస్టులు ఉన్నారని తెలిసి, సిఆర్‌పిఎఫ్, కోబ్రా, తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు చుట్టుముడుతున్నట్టు వస్తున్న వార్తలు కలవరపెడుతున్నాయని, ఇది పెద్ద ఎత్తున మానవ ప్రాణ నష్టం, మారణహోమాలకు దారితీయవచ్చని వారు ఆందోళన వ్యక్త ంచేశారు. ఈ హింసాత్మక వాతావరణం తొలగిపోయేవిధంగా శాంతియుత పరిష్కార మార్గానికి సహకరిస్తామని మావోయిస్టుల నుంచి ప్రకటనలు వస్తున్న తరుణంలో కక్షపూరిత విధానాన్ని అవలంబించటం పాలకుల లక్షణం కాదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, ఎపి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే శాంతియుత రాజకీయ పరిష్కారం కనుగొనాలని వారు కోరారు. సమావేశంలో పియుసిఎల్ ప్రెసిడెంట్ సి.హెచ్.బాలకిషన్‌రావు, పీస్ కమిటీ వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ వినయ్‌రెడ్డి, హెచ్‌ఆర్‌ఎఫ్ సెక్రటరీ డా. తిరుపతయ్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సిసిఎం చలపతిరావు, సిపిఐ (ఎంఎల్) నేత సిసిఎం గుర్రం వినయ్‌కుమార్, సిపిఐ ఎంఎల్ నేత హన్మేశ్, ఆర్‌ఎస్‌పి నేత జానకిరామ్, సీనియర్ జర్నలిస్టు టి.తిరుమల్ పాల్గొన్నారు.

## ప్రపంచ మానవాళికే ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరం : ఐప్సో





ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రపంచ మానవాళికే అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితంగా పోరాడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) నాయకులు పిలుపు నిచ్చారు. ఐప్సో ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాష్ట్ర కార్యాలయం వద్ద జమ్మూ కశ్మీర్‌లోని ఫహల్గాం వద్ద జరిగిన టెర్రరిస్టుల దాడిని ఖండిస్తూ, మృతులకు కొవ్వత్తులతో నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఐఎఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెపిఎల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి.నాగేశ్వరరావు, కాచం సత్యనారాయణ మాట్లాడుతూ దేశ సార్వభౌమాధికారాన్ని, ప్రగతిని, మానవ హక్కులను హరిస్తున్న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దేశ ప్రజలందరూ పోరాడాలని కోరారు. ఉగ్రవాదం అంతమొందించడం ద్వారా ప్రపంచ శాంతికి పాలకులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో శాంతి సంఘం నాయకులు రామరాజు, రవి కిషోర్, జె.కె శ్రీనివాస్, నరేంద్ర ప్రసాద్ సుధావన్, జాదవ్ రజాక్, హర్షద్ అహ్మద్, పుష్పలత, వి.రాజి రెడ్డి నక్క కృష్ణ గౌడ్, సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ అలెర్ట్ జారీ (మొదటి పేజీ తరువాయి)

జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. రెడ్ అలర్ట్ జారీ చేసిన తొమ్మిది జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామన్నారు. రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాల్పుల ప్రభావం ఉందన్నారు. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్ మహబూబ్ నగర్ జిల్లాలకు వడ గాల్పుల హెచ్చరికలను జారీ చేశామన్నారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com